# కల్నల్ సంతోష్ త్యాగాన్ని దేశం మరువదు

**ఘనంగా నివాళి అర్పించిన మంత్రులు**

హైదరాబాద్,జూన్17(ఆర్ఎన్ఎ): దేశం కోసం తన ప్రాణాన్నిపణంగా పెట్టి అమరుడైన కల్నల్ సంతోష్‌బాబు త్యాగాన్నిదేశం ఎన్నడూ మరవదని తెలంగాణ మంత్రులు పేర్కొన్నారు. సంతోష్ దేశం కోసం తన ప్రాణాన్ని కోల్పోయారని పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కొనియాడారు. భారత్‌చైనా సరిహద్దులో జరిగిన ఘర్షణలో వీరమరణం పొందిన సూర్యాపేటకు చెందిన కల్నల్ సంతోష్‌బాబు కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కల్నల్‌సంతోష్ శౌర్యం, త్యాగం దేశంలోని యువతకు స్ఫూర్తినిస్తుందన్నారు. దేశ రక్షణలో వీరమరణం పొందిన కల్నల్ సంతోష్‌బాబు ఆత్మకు శాంతి కలగాలని అన్నారు. కాగా భారత సరిహద్దుల్లో జరిగిన ఘర్షణలో కల్నల్ సంతోష్‌బాబు ప్రాణాలు కోల్పోవడం విచారకరమని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆయన మరణం పట్ల మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ బిడ్డ వీర మరణం వెలకట్టలేనిదని అన్నారు. సంతోష్‌బాబు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నిరంతరం దేశ రక్షణ కోసం సరిహద్దులో సాహసం చేసి సమరంలో వీరమరణం పొందిన కల్నల్ బిక్కుమల్ల సంతోష్ బాబు త్యాగాన్ని.. ఈ దేశం ఎప్పటికీ మరిచిపోలేనిదని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. సూర్యాపేటకు చెందిన తెలంగాణ బిడ్డ సంతోష్ బాబు ఇండో, చైనా సరిహద్దు ఘర్షణలో వీరమరణం పొందడంతో ఆ కుటుంబానికి ఏర్పడిన లోటు తీర్చలేనిదన్నారు. తనయుడు చనిపోయినా...దేశం కోసం ప్రాణం వదిలినందుకు గర్విస్తున్నామన్న వారి తల్లిదండ్రుల దేశభక్తికి సెల్యూట్ చేశారు. వారి కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 18-6-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 278 పేజీలు: 8 వెల: రూ.1/-


# రెచ్చగొడితే భారత్ చూస్తూ ఊరుకోదు

**దేశ రక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదు**

**సైనికుల త్యాగాలను వృధా కానివ్వం**

**సిఎంల వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోడీ ప్రకటన**

**రెండు నిముషాలు మౌనం పాటించి నివాళి**

న్యూఢిల్లీ,జూన్17(ఆర్ఎన్ఎ): భారతదేశ సార్వభౌమాధికారాన్ని కాపాడడంలో ఎలాంటి రాజీలేదని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. భారతదేశం ఎల్లవేళలా శాంతినే కోరకుంటుందని, అయితే సార్వభౌమాధికారం కోసం ఎలాంటి రాజీ ఉండదని ఘాటుగానే హెచ్చరించారు. చైనా దుగరం కారణంగా అమరులైన సైన్యం త్యాగాలు వృధా కానివ్వబోమన్నారు. సరిహద్దుల్లో చైనా సైన్యం చేస్తున్న దాష్టీకాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం స్పందించారు. దేశ రక్షణ కోసం అమరులైన 20 మంది జవాన్ల వీరత్వం ఏమాత్రం వృథా పోదని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. భారత్ ఎప్పటికీ శాంతినే కోరుకుంటోందని, అయితే రెచ్చగొడితే మాత్రం సరైన, దీటైన జవాబు చెప్పడానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉన్నామన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన హెచ్చరించారు. తమకు దేశ ఐక్యత, సార్వభౌమత్వం చాలా ముఖ్యమైన అంశాలని స్పష్టం చేశారు. చైనా సైనికులతో సరిహద్దుల్లో పోరాడుతూ వీర మరణం పొందిన సైనికులను చూసి దేశం ఎంతో గర్విస్తోందని మోదీ అన్నారు. బుధవారం పలు రాష్ట్రాల ముఖ్యమంత్రుల తో వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో పాల్గొన్న మోదీ.. లేచి నిలబడి రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న హోం మంత్రి అమిత్ షా, సీఎంలు కూడా అమర జవాన్లకు నివాళులు అర్పించారు. అమర జవాన్ల త్యాగాన్ని చూసి దేశం గర్విస్తోందని మోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.'మన జవాన్ల త్యాగం వృథా కాదని దేశానికి హామీ ఇస్తున్నాను. భారత్ సార్వభౌమాధికారంపై రాజీ పడే ప్రసక్తే లేదు. భారత్ శాంతిని కోరుకుటుందని.. కానీ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే అందుకు తగ్గ సమాధానం ఇవ్వగలదని భారత ప్రధాని మోడీ చైనాను గట్టిగా హెచ్చరించారు. మరోవైపు తూర్పు లద్ధాఖ్‌లో నెలకొన్న పరిస్థితులపై చర్చించేందుకు మోదీ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్టుగా సమాచారం. కాగా, తూర్పు లద్ధాఖ్‌లోని గాల్వన్ లోయ ప్రాంతంలో సోమవారం రాత్రి భారత్-చైనా బలగాల మధ్య జరిగిన ఘర్షణలో 20 మంది జవానులు వీర మరణం పొందిన విషయం తెలిసిందే. భారత్ ఎలాంటి వివాదాలను కోరుకోదు. రెచ్చగొడితే సైలెంట్‌గా ఉండబోం. దీటుగా బదులిచ్చే విషయంలో ఏ మాత్రం వెనక్కి తగ్గం. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు దేశం సిద్ధంగా ఉందని' మోదీ పేర్కొన్నారు. ప్రధాని మోదీతో పాటు వివిధ రాష్ట్రాల సిఎంలు కూడా నివాళి అర్పించారు.

# సైనికుల వీరమరణంపై సర్వత్రా ఆందోళన

**సైనికుల త్యాగాలు మరువలేనివని నివాళి**

**గవర్నర్ తమిళసై, బండి సంజయ్‌ల సంతాపం**

**నివాళి అర్పించిన టాలీవుడ్**

హైదరాబాద్,జూన్17(ఆర్ఎన్ఎ): లధక్‌లోని గాల్వాన్ లోయలో భారత్-చైనా జవాన్లు పరస్పరం దాడులు చేసుకోవటంతో 20మంది భారత సైనికులు మరణించిన ఘటనపై సర్వత్రా నిరసనలు వెల్లువెత్తాయి. అలాగే మరణించిన సైనికులకు పలువురు శాల్యూట్ చేస్తూ ప్రకటన చేస్తున్నారు. ఇకపోతే చైనా సైనికులు 43 మంది మరణించినట్టు ఆ దేశ మీడియా తెలిపింది. నెలన్నర ఉద్రిక్తతల అనంతరం వాస్తవాధీన రేఖవెంబడి ఇరు పక్షాలు వెనుకకు తగ్గుతున్న సమయంలో సోమవారం ఘర్షణ తలెత్తింది. ఇరు దేశాల సైనికులు రాత్రి రాళ్లు, రాడ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో భారత కమాండింగ్ ఆఫీసర్ సహా 20మంది సైనికులు మరణించారని సైన్యం ప్రకటించింది. భారత్-చైనా సరిహద్దుల్లో జరిగిన ఘర్షణలో వీర మరణం పొందిన కర్నల్ సంతోష్ కుమార్ కుటుంబానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయనతోపాటు దేశ భద్రత కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లకు గవర్నర్ నివాళుల ర్పించారు. ఈ ఘటన మానని గాయంగా మిగిలిపోతుందని ఆమె అభిప్రాయపడ్డారు. సైనికులు అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించారని కొనియాడారు. దేశం వారి త్యాగాలను ఎన్నటికీ మరవదని.. యావత్ దేశ ప్రజలు అమరులైన సైనికులను స్మరించుకుంటారని ఈ సందర్భంగా తమిళిసై పేర్కొన్నారు.

అమరవీరుల మృతిపై టాలీవుడ్ ప్రముఖులు తమ ట్విట్టర్ ద్వారా సంతాపం వ్యక్తం చేశారు. దేశం కోసం ప్రాణాలు విడిచిన అమరవీరుల ఆత్మకి శాంతి కలగాలని, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. తమన్నా, దేవి శ్రీ ప్రసాద్, మంచు విష్ణు, అనీల్ రావిపూడి,నిఖిల్, వరుణ్ తేజ్, లక్ష్మీ మంచు వీరజవాన్లకి ఘన నివాళు లు అర్పించారు. వీర మరణం పొందిన జవాన్ల కుటుంబాలకు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సంతాపం తెలియజేశారు. ఈ ఘటనలో 20 మంది భారత జవాన్లు మృతి చెందడం తనను కలచివేసిందని అన్నారు. జవాన్లు అత్యుత్తమ ధైర్యాన్ని ప్రదర్శించి దేశ సేవ కోసం ప్రాణాలు అర్పించారని కొనియాడారు. వారి ధైర్య సాహసాలు, త్యాగాలను ఎన్నటికీ మరువమన్నారు. మాతృభూమి సేవలో జాతి రక్షణ కోసం ప్రాణాలర్పించిన భరత మాత ముద్దుబిడ్డ, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన వీర సైనికుడు కర్నల్ సంతోష్ బాబుతో పాటు వీర మరణం పొందిన జవాన్లకు ఆయన నివాళులర్పించారు. సైనికుల సేవలను భారత్ ఎప్పటికీ స్మరించుకుంటుందని బండి సంజయ్ అన్నారు.

# సరిహద్దుల్లో వాతావరణం వేడెక్కిస్తున్న చైనా

**జిన్‌పింగ్ వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం**

న్యూఢిల్లీ,జూన్17(ఆర్ఎన్ఎ): కరోనాతో అంతర్జాతీయంగా అపఖ్యాతి పాలైన నేపథ్యంలో ఆత్మరక్షణకు స్వస్తిచెప్పి దూకుడుగా పోవాలని చైనా నిర్ణయించుకున్నట్లు దాని చర్యలఅవి నిరూపిస్తున్నాయి. యుద్ధానికి సన్నద్ధం కండి అంటూ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ లద్దాఖ్ నుంచి హాంకాంగ్ వరకూ అన్నింటినీ వేడెక్కిస్తున్నారు. చైనా పెట్టుబడులకు అడ్డుకట్టవేయడం నుంచి కరోనా పుట్టుపూర్వోత్తరాలపై స్వతంత్ర దర్యాప్తు వరకూ భారత్ దానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుంటే, సరిహద్దుల్లో చొరబడటం, నేపాల్‌ను గిల్లడం ద్వారా మనమీద కక్షసాధించాలని చైనా ప్రయత్నిస్తున్నది. దీని పర్యవసానమే ఇండియా,చైనా సరిహద్దుల్లో జరిగిన ఘటన తాజా ఉదాహరణ. 45 ఏళ్లలో తొలిసారిగా లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (ఎల్ఏసీ) రక్తసిక్తమైంది. 3గంటలపాటు జరిగిన గొడవలో మన సైనికులు 20 మందికి పైగా వీరమరణంపొందారు. వీరిలో తెలంగాణబిడ్డ, కర్నల్ బిక్కుమళ్ల సంతోష్ బాబు కూడా ఉన్నారు. గాల్వాన్‌లోయలో ఒక ప్రదేశాన్ని విడిచివెళ్లేందుకు చైనా సైనికులు నిరాకరించారు. ఇరు దేశాల బలగాలను వెనక్కి పిలిపిస్తున్న దశలో అకస్మాత్తుగా చైనా సైనికులు దాడి చేశారు. ఇండియన్ సోల్జర్లపై రాళ్లు, ఫెన్సింగ్ వైర్లు చుట్టిన రాడ్లతో దాడి చేయడం చూస్తుంటే కొత్తతరహా యుద్ధానికి తెరలేపింది. వెంటనే తేరుకున్న భారత సైనికులు స్పందించినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. కొన్ని గంటలపాటు జరిగిన ఈ గొడవ.. అర్ధరాత్రి తరువాత సద్దుమణిగింది. చైనా సైనికులతో జరిగిన ఘర్షణల్లో 16 బీహార్ రెజిమెంట్‌కు చెందిన సైనికులు ఉన్నారు. కమాండింగ్ ఆఫీసర్ సంతోష్, హవల్దార్ పలణి, సిపాయి కుందన్ ఓజాతోపాటు 20 మంది వరకు చనిపోయారు. మన వాళ్లు తక్కువగా ఉండటంతో చైనా సైనికులు రెచ్చిపోయి దాడి చేసినట్లు తెలిసింది. అయితే మన వాళ్లుకూడా గట్టిగానే స్పందించి ఎదిరించారు. దీంతో 43 మందికి పైగా చైనా సైనికులు చనిపోయారని అంటున్నా అటువైపు నుంచి ఎలాంటి ప్రకటనా రాలేదు. ఇంతజరిగినా రెండు వైపుల నుంచి ఎలాంటి కాల్పులు చోటు చేసుకోలేదని అధికార వర్గాలు వెల్లడించాయి. గల్వాన్ లోయలో డీ-ఎస్కలేషన్ పక్రియ జరుగుతుండగా.. సోమవారం రాత్రి రెండు వర్గాల మధ్య గొడవ జరిగిందని ఆర్మీ తెలిపింది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో రెండు వైపుల మేజర్ జనరల్స్ చర్చలు జరుపుతున్నారు. 1975లో అరుణాచల్ ప్రదేశ్‌లోని తులుంగ్‌లా వద్ద నలుగురు భారత సైనికులు చైనా దళాల దాడిలో చనిపోయారు. ఆ తర్వాత ఈ 45ఏళ్లల్లో లైనాఫ్ యాక్చ్ వల్ కంట్రోల్ (ఎల్ఏసీ) దగ్గర మన వాళు చనిపోవడం ఇదే తొలిసారి. ఈ దశలో వరుసగా రెండోరోజు కూడా రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రెండుసార్లు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్, ఎయిర్ ఫోర్స్, ఆర్మీ, నేవీ చీఫ్లతో సమావేశమయ్యారు. తాజా పరిస్థితులపై చర్చించారు. జరిగిన ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీకి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్ , జై శంకర్ వివరించారు. తర్వాత మోడీ నివాసానికి వెళ్లిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. ప్రస్తుత పరిస్థితిపై చర్చించారు.

# మిడతల దాడిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి

**అవసరమైన స్ప్రేయర్లు, సేఫ్టీకిట్స్ సిద్ధం చేసుకోవాలి**

**ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సిఎస్ సమీక్ష**

హైదరాబాద్,జూన్17(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో మిడతలు దాడి చేస్తే ఎటువంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఆయన అధికారులతో సమీక్షించారు. మిడతలు దాడిచేసే ప్రభావం ఉన్న 9 జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఫైర్, వ్యవసాయ, అటవీశాఖ అధికారులులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు సరిహద్దు జిల్లాలతో సమన్వయంతో పనిచేసి మిడతల దాడులను ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉండాలని, అవసరమైన స్ప్రేయర్లు, సేఫ్టీకిట్స్, మెటీరియల్, నీటి వసంతి, లైటింగ్ తదితర వసతులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సరిహద్దు జిల్లాల్లో మిడతలు దాడి చేసే అవకాశం ఉన్న ప్రభావిత గ్రామాల కోసం సూక్ష్మ స్థాయి ప్రణాళికను తయారు చేయాలన్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న మానవ వనరులు, పరికరాలు, మెటీరియల్‌కు సంబంధించి ఇన్‌వెంటరీని తయారు చేయాలని సీఎస్ సూచించారు. గ్రామస్థాయిలో బృందాలను ఏర్పాటుచేసి స్టేక్‌హోల్డర్స్‌ను భాగస్వాములుగా చేయాలన్నారు. ప్రతి మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నమయించాలని సీఎస్ అధికారులకు సూచించారు. జిల్లాస్థాయిలో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు.జిల్లాలలో అమలుచేయడం కోసం స్టాండింగ్ ఆపరేటింగ్ ప్రోసీజర్స్‌తో అడ్వయిజరీని తయారు చేయాలని వ్యవసాయ శాఖను ఆదేశించారు. మిడతల గమనం, నిరోధక చర్యలపై శాస్త్రవేత్తలు ఈసందర్భంగా అధికారులకు ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో డీజీపీ మహేందర్‌రెడ్డి, పిసిసిఎఫ్ శోభ, వ్యవసాయశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, అగ్నిమాపక డీజీ సంజయ్ జైన్, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రవీణ్‌రావు, ముఖ్య ఎంటమాజిస్ట్ రెహమాన్, సస్యసంరక్షణ అధికారి సునీత, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్,

కొమరంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు ,జిల్లాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భారతజాతీయతా పులిని రెచ్చగొట్టిన చైనా

**తాజా ఘర్షణలపై అమెరికా మీడియా వ్యాఖ్య**

**తాజా ఘటనలపై సమాచార సేకరణలో భారత్**

న్యూఢిల్లీ,జూన్17(ఆర్ఎన్ఎ): వాస్తవాధీన రేఖ వద్ద భారత్-చైనా ఘర్షణలపై అమెరికా మీడియా స్పందించింది. 20 మంది భారత సైనికులను పొట్టనపెట్టుకోవడం ద్వారా చైనా.. భారత జాతీయభావం అనే పులిని రెచ్చగొట్టిందని వ్యాఖ్యానించింది. ఎల్ఓఏసీ రేఖవద్ద గల్వాన్ లోయలో జూన్ 15న భారత్, చైనా సైనికులు రాళ్లు, కర్రలతో పరస్పర దాడులు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ దాడిలో కనీసం 20 మంది భారతీయ సైనికులు వీరమరణం పొంది ఉంటారని ప్రభుత్వం చెబుతుండగా 43 మంది చైనా సైనికులు మృతి చెందారని సమాచారం. అయితే చైనా మాత్రం ఈ విషయంలో ఇప్పటి వరకూ ఎటువంటి అధికారిక ప్రకటనా చేయలేదు. భారత్‌ను ఓ అంతర్జాతీయ శక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్న సమయంలో చైనా తీరుతో కొత్త తలనొప్పులు వస్తాయని అక్కడి మీడియా భావిస్తోంది. చైనాకు దీటుగా జవాబివ్వాలనే ఒత్తడి ప్రధానిపై పెరుగుతుందని అభిప్రాయపడుతోంది. చిన్న దేశాలైన వియత్నాం, మలేషియా, ఫిలిప్పైన్స్ ప్రతి రోజూ చైనా దురుసు చర్యలను ఎదుర్కొంటున్నాయని అమెరికా పత్రికా విశ్లేషకులు చెబుతున్నారు. అతి పెద్ద ప్రజాస్వామిక దేశమైన భారత్ కూడా ప్రస్తుతం ఇదే పరిస్థితిని ఎదుర్కొంటోందని వారు వ్యాఖ్యానిస్తున్నారు. ఇదిలావుంటే భారత సరిహద్దుకు చెందిన వాస్తవాధీన రేఖ లోపల చైనా సైనికులు టెంట్‌ను వేశారు. పెట్రోలింగ్ పరంగా అది వ్యూహాత్మకమైన ప్రదేశం. పాయింట్ 14 వద్దకు వెళ్లిన భారతీయ సైనికులపై .. చైనా ఆర్మీ దాడి చేసినట్లు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తున్నది. అత్యంత ఎత్తులో ఉన్న చైనా సైనికులు.. భారత ఆర్మీపై రాళ్లతో దాడి చేశారు. ఆ తర్వాత ఇనుప కడ్డీలు, క్లబ్స్‌తో భారత ఆర్మీపై కిరాతకంగా దాడి చేసినట్లు తెలుస్తోంది. గాల్వన్, షయోక్ నదుల సమ్మేళనం వద్ద పాయింట్ 14 ఉంది. ఇక్కడే గత వారం డివిజన్ కమాండర్ స్థాయి సమావేశాలు జరిగాయి. తమ దళాలను తగ్గించేందుకు రెండు దేశాలు ఆ సమావేశంలో అంగీకరించాయి. ఉద్రిక్తతలు తగ్గించే ప్రయత్నం జరుగుతున్న సమయంలో.. భారీ రక్తపాతం ఎందుకు జరిగిందన్న దానిపై స్పష్టత రాలేదు. ఇటీవల షయాక్ నదిపై భారత ఓ బ్రిడ్జ్‌ను నిర్మించింది. దాన్ని వ్యతిరేకిస్తూ పీఎల్ఏ దళాలు.. పాయింట్ 14 వద్ద టెంట్ వేసి తిష్ట వేశాయి. ఇటీవల జరిగిన చర్చల తర్వాత పీఎల్ఏ దళాలు.. అక్కడ ఉన్న రెండు టెంట్లను తొలగించాయి. ఆ తర్వాత పాయింట్ 15 వద్ద కూడా చైనా ఆర్మీ ఓ టెంట్‌ను ఫిక్స్ చేసింది. దీంతో ఆ ప్రాంతంలో మన సైనికులు కూడా గస్తీని పెంచారు. గాల్వన్ వ్యాలీలోని పాయింట్ 17 వద్ద కూడా సైనిక ప్రతిష్టంభన నెలకొన్నది. ఈ ప్రదేశానికి రెండు దేశాలు తమ ఆయుధాలను, బలగాలను మోహరించాయి. మొత్తంగా భారత్ రోడ్డు నిర్మాణాలు చేపట్టడాన్ని చైనా జీర్ణించుకోలేకపోతున్నది.




చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో త్రివిధ దళాలతో భేటీ అయిన కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

# కల్లాల నిర్మాణానికి 750 కోట్లు

**నియోజకవర్గానికి వెయ్యి కల్లాల నిర్మాణం**

**రైతు సంక్షేమంలో మరో పెద్ద నిర్ణయమన్న మంత్రి సబిత**

వికారాబాద్,జూన్17(ఆర్ఎన్ఎ): గ్రామాల్లో రైతులు పండించిన పంటను రోడ్లపై నూర్పిడి చేయకుండా కల్లాలు నిర్మించుకోవడానికి సీఎం కేసీఆర్ రూ.750 కోట్లు మంజూరు చేశారని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి వెయ్యి కల్లాల చొప్పున నిర్మించుకోవచ్చని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఇదో విప్లవాత్మకనిర్ణయమని అన్నారు. రైతులపట్ల కెసిఆర్‌కు ఉన్న ప్రేమకు నిదర్శనమన్నారు. జిల్లాలోని బోంరాస్ పేట మండల కేంద్రంలో రూ.22 లక్షల వ్యయంతో నిర్మించే రైతు వేదిక భవన నిర్మాణానికి కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణలో రైతులను సంఘటితం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. రైతు వేదిక పేరుతో రైతులకు ఒక భవనాన్ని నిర్మించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని, వీటి నిర్మాణానికి రూ.22 లక్షలు వ్యయం చేస్తున్నామని చెప్పారు. రైతు వేదిక భవనాలను మూడు నెలల్లో పూర్తి చేయాలని మంత్రి సబిత అధికారులను ఆదేశించారు. ఒక్క రైతు నష్టపోకుండా రైతుబంధు పథకం కింద ప్రతి రైతుకు లాగొడి సహాయం అందిస్తామని, జిల్లాలో కొత్తగా 2 వేల మందికి, మండలంలో 1100 మంది రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చాయని వీరందరికీ రైతుబంధు సహాయం అందిస్తామని మంత్రి చెప్పారు. రైతు

## చరిత్రలో నేటినిజం



కం॥ ప్రాణములను లెక్కింపక
ప్రాణాధిక మైనయట్టి స్వాతంత్ర్యమ్మే
రాణింప... పోరు సలిపిన
రాణిని... ఝాన్సీని... గొలుతు లక్ష్మీబాయిన్!!



(జూన్ 18 ఝాన్సీరాణి లక్ష్మీ భాయి జననం...)

-రాధశ్రీ

సెల్: 9494481210

# షేక్‌పేట తహసిల్దార్ సుజాత భర్త ఆత్మహత్య

**భవనంపై నుంచి దూకి మరణం**

**కేసు విచారణతో మనస్తాపంతో ఘాతుకం**

హైదరాబాద్,జూన్17(ఆర్ఎన్ఎ): ఇటీవలే ఎసిబికి చిక్కి అరెస్టయిన షేక్‌పేట తహసీల్దార్ సుజాత భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. విద్యానగర్‌లో నివాసముం టున్న సుజాత భర్త అజయ్ కుమార్.. బుధవారం తెల్లవారుజామున ఐదో అంతస్తు నుంచి కిందకు దూకాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన అజయ్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆయన చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బంజారాహిల్స్ భూ వివాదం కేసులో షేక్‌పేట తహసీల్దార్ సుజాత అరెస్టు అయిన విషయం విదితమే. ఖాలీద్ అనే వ్యక్తి నుంచి లంచం తీసుకున్నట్లు సుజాతపై ఆరోపణలు రావడంతో ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. ఇదే కేసులో రూ. 15 లక్షలు లంచం తీసుకుంటూ ఆర్ఐ నాగార్జున రెడ్డి, బంజారాహిల్స్ సెక్టార్ ఎస్ఐ రవీంద్ర నాయక్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించారు. ఈ కేసులో సుజాత విచారణ ఎదుర్కొంటుంది. ఈ కేసుకు సంబంధించి ఇటీవలే సుజాతను నాంపల్లి ఏసీబీ కార్యాలయానికి పిలిపించిన అధికారులు, ఆమె నివాసంలో పట్టుబడ్డ రూ.30 లక్షల డబ్బు సహా పలు అంశాలపై ఆరా తీశారు. విశ్వసనీయంగా తెలిసిన వివరాల ప్రకారం.. రూ.30 లక్షలు తన జీతం డబ్బులని సుజాత సమాధానమిచ్చినట్టు తెలిసింది. అయితే ఎన్నేండ్లుగా జీతాన్ని ఇంట్లో దాచుకుంటున్న విషయం తనకు సరిగా గుర్తు లేదంటూ ఆమె పొంతలేని సమాధానాలు చెప్పుకొచ్చారు. ఇదే విషయంపై ఉస్మానియా వర్సిటీ ఆర్ట్స్ కళాశా లలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సుజాత భర్తను ఆరా తీయగా స్థలాన్ని బంధువులకే విక్రయించినందున ఆ లావాదేవీలకు సంబంధించిన పత్రాలు లేవని చెప్పుకొచ్చారు. విచారణ సందర్భంగా సుజాత ఇంట్లో స్వాధీనం చేసుకున్న పలు ప్రభుత్వ డాక్యుమెంట్ల పైనా అధికారులు ఆరా తీశారు. ఈ కేసులో ఉన్నతాధికారుల ప్రేమయం ఉండొచ్చనే అనుమానంతో షేక్ పేట తహసీల్దార్ సుజాతను ఏసీబీ అధికా రులు వరుసగా మూడు రోజుల పాటు విచా రించారు. ఈ క్రమంలో ఆమె నివాసంలో అధికారులు సోదాలు చేయగా రూ. 30 లక్షలు, బంగారు ఆభరణాలు బయటప డ్డాయి.

# చైనాతో సరిహద్దు సమస్యలపై అఖిలపక్షం

**19న అఖిలపక్ష భేటీకి ఆహ్వానించిన ప్రధాని మోడీ**

**సైన్యం త్యాగాలు వృధాకావన్న రక్షణమంత్రి రాజ్‌నాథ్**

**త్రివిధ దళాధిపతులతో అత్యవసర భేటీ**

**ఎలాంటి పరిస్థితిని అయినా ఎదుర్కొనేలా దళాలు సర్వసన్నద్ధం**

న్యూఢిల్లీ,జూన్17(ఆర్ఎన్ఎ): భారత, చైనా సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్న కారణంగా సమస్యలపై అఖిలపక్షంలో చర్చించాలని ప్రధాని మోడీ నిర్ణయించారు. సోమవారం రాత్రి జరిగిన దాడిలో.. గాల్వన్‌లో 20 మంది భారతీయ సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దశలో భారత, చైనా సరిహద్దు విషయాన్ని చర్చించేందుకు.. ప్రధాని మోదీ అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 19వ తేదీన సాయంత్రం 5 గంటలకు అఖిలపక్ష భేటీ ఉంటుందని ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొన్నది. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అధ్యక్షులు పాల్గొంటారని పీఎంవో తన ట్విట్టర్‌లో తెలియజేసింది. ఈ మేరకు ఆయా పార్టీల నేతలకు సమాచారం ఇవ్వనున్నారు. ఇదిలావుంటే తాజా పరిస్థితిపై రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ త్రివిధ దళాలతో చర్చించారు. సైనికుల త్యాగాలను, ధైర్యాన్ని దేశం ఎన్నడూ మరిచిపోదని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. గాల్వన్ వ్యాలీలో 20 మంది సైనికులు మృతిచెందిన ఘటనపై ఆయన ట్విట్టర్ ద్వారా స్పందించారు. గాల్వన్ దాడిలో చనిపోయిన సైనికుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. క్లిష్ట సమయంలో దేశం అంతా కలిసి కట్టుగా ఉన్నదన్నారు. భారతీయ బ్రేవ్‌హార్ట్స్ పట్ల గర్వంగా ఉందన్నారు. గాల్వన్‌లో సైనికులు చనిపోవడం బాధాకరం అని అన్నారు. ఆ ఘటన చాలా కలిచివేసిందన్నారు. సరిహద్దు విధుల్లో మన సైనికులు అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించినట్లు ఆయన తెలిపారు. అత్యున్నత స్థాయిలో సైనికులు తమ ప్రాణాలను త్యాగం చేశారని రాజ్‌నాథ్ ట్వీట్ చేశారు. మరోవైపు చైనాతో సరిహద్దు విషయంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్న నేపథ్యంలో.. త్రివిధ దళాలను అప్రమత్తం చేశారు. సైన్యం, నౌకాదళం, వైమానిక దళాలు మొత్తం.. హై అలర్ట్‌లో ఉన్నాయి. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని.. త్రివిధ దళాలకు సంకేతాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. గాల్వన్ జరిగిన హింసాత్మక ఘటన నేపథ్యంలో భారత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గాల్వన్ లో వ్యాలీలో జరిగిన గొడవలో భారత సైన్యానికి చెందిన 20 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. తెలంగాణకు చెందిన కల్నల్ సంతోశ్ బాబు కూడా వీరమరణం పొందారు. గాల్వాన్‌లో ఉన్న స్థానిక కమాండర్ స్థాయి అధికారికి ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛను ఇచ్చినట్లు తెలుస్తోంది. ఒకవేళ ఎక్కడైనా శత్రువు ఉల్లంఘనకు పాల్పడితే, అక్కడ బలమైన ప్రతిఘన చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భారత, చైనా సరిహద్దుల్లో పనిచేస్తున్న ఐటీబీపీ దళాలు కూడా ఇక నుంచి ఆర్మీ ఆధీనంలో ఉంటాయని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తున్నది. ప్రస్తుతానికి సైనిక అధికారుల చర్చలు లేవని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# భవిష్యత్ తరాలకు పచ్చదనం అందిద్దాం

**హరితహారంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి**

**నర్సరీలను పరిశీలించిన మంత్రి కెటిఆర్**

హైదరాబాద్,జూన్17(ఆర్ఎన్ఎ): భవిష్యత్ తరాలకు పచ్చదనాన్ని కానుకగా అందించే లక్ష్యంతో ముందుకు సాగుదామని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈసారి హరితహారం కర్యాక్రమాన్ని మరింత పెద్ద ఎత్తున చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు. అందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. నగర శివార్లలోని శంషాబాద్‌లో ఉన్న హెచ్ఎం ఏడీఏ నర్సరీని మంత్రి సందర్శించారు. నర్సరీలో మొక్కల పెంపకాన్ని ఆయన పరిశీలించారు. పురపాలక పట్టణాల్లో మొక్కలు నాటడంతోపాటు మొక్కల పెంపకంపై ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ పరిధిలో ఎవరైనా మొక్కలు కావాలనుకునేవారు నగర పరిధిలోని నర్సరీల నుంచి ఉచితంగా తీసుకోవచ్చని ప్రకటించారు. నగరంలోని నర్సరీల వివరాలను అందరికీ అందుబాట ులో ఉంచుతామని చెప్పారు. హరితహారం కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలి పిలుపునిచ్చారు. నర్సరీలోని కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. కాలనీలు, అపార్ట్‌మెంట్ వాసులను హరితహారంలో భాగస్వాములను చేయాలని అన్నా రు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు.



- బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
తొలి ఛైర్మన్, బీసీ కమిషన్, తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

# అధికారం రుచి

**కులాధిక్యతను చూసుకొని మురిసి పోయేవారు గర్వించేవారు స్వంతంగా సాధించిందేమీ లేక కులం పేరు చెప్పుకొని బతుకుతారు. వీరు దరిద్రులు. వీరి వల్లనే కులాల మధ్య చిచ్చులు రగులుతుంటాయి.**

కొందరు కష్ట పడి అధికారం సంపాదించుకుంటారు. ఉద్యమాలు చేసో, ఎన్నికల్లో కష్టపడి గెలిచో, పరీక్షలు రాసో, ఉద్యోగం సంపాదించో అధికారం సంపాదించుకుంటారు. జన సేవ చేయడానికి అధికారం అనేది ఒక అవకాశం. తద్వారా మంచిపేరు కూడ సంపాదించుకుంటారు.

మరికొందరికి అధికారం కష్టపడకుండానే చేతికి అంది వస్తుంది. వారసత్వంగా వచ్చేవి కొన్ని ఉంటాయి. సంపద, యాజమాన్యం, కులాధిక్యత,మొదలైనవి. ఇంకా

లాటరీ తగిలినట్టు తగిలేవి.కొన్ని ఉంటాయి.

మాజీ ప్రదాని మన్మోహన్ సింగ్ గారికి , రాహుల్ గాంధీ గారికి కష్టపడకుండా అధికారం అంది వచ్చింది.

కష్టపడకుండా వచ్చే అధికారం, పరపతి ద్వారా ఇప్పించే ఉద్యోగం , వారికి వాటి విలువ తెలియదు. ఓ సారి మామిడిపండ్లు తినలేనంత పుల్లగా ఉన్నాయని ఎదురుగా ఉన్న పిల్లలకు ఆచెట్టును ఎవరు ముట్టుకొని తొందరగా వస్తారో వారికి అని చెప్పడంతో వేగంగా పరిగెత్తి పండు గెలుచుకున్నారు. పండు ఎలా ఉందంటే తియ్యన అని చెప్పారు.

కష్టపడి గెలుచుకుంటే ఏదైనా తియ్యగా మధురంగా ఉంటుంది. ఉచితంగా ఇస్తే ఛ ఛ ! పుల్లన అని పడేసేవారు.

కష్టపడి సాధించే విజయంలో ఉండే ఆనందం ఊరకే అన్ని సమకూర్చి పెడితే ఉండదు. స్వయంగా ఎంతో కష్ట పడి ఇల్లుకట్టుకునే వారికుండే ఆనందం, రెడీమేడ్ అపార్ట్ మెంట్ కొనేవారికి ఎలా ఉంటుంది? కష్టపడి ఇష్టపడి ప్రేమించి పెళ్లి చేసుకోవడంలో ఉండే థ్రిల్ ఎవరో వెతికి పెడితే పెళ్లి చేసుకోవడంలో ఉండదు. ఆ అనుభవాలు వేరు. అలా ఏదైనా కష్టపడి సాధించడంలో ఉండే తృప్తి , అనుభవాలు, అనుభూతులు అయాచితంగా వచ్చినపుడు కలగవు. వారసత్వంగా వారసులకు పరిశ్రమ ,వ్యాపారం పెట్టిస్తే నష్టపోయినపుడు తల్లితండ్రులు నిలబెట్టే ప్రయత్నం చేస్తే అవన్ని నిండా మునిగాయని అమెరికా ఆర్థిక శాస్త్రవేత్తలు తమ పరిశోధనలో తేల్చారు. అందుకే పండిత పుత్ర పరమ శుంఠ అన్నారు .

అధికారం సంపాదించడం ఒక ఎత్తు. దాన్ని కాపాడుకోవడం మంచిపేరు తెచ్చుకోవడం ఒక ఎత్తు. అధికారం గర్వాన్ని పెంచకూడదు. ఎంత కష్టపడితే ఆ అవకాశం వచ్చిందో కష్టపడ్డ వారికి తెలుసు.

కష్టపడకుండా అధికారం, పదవి , ఉద్యోగం , సంపద పొందినవారు గర్విష్టులుగా మారవచ్చు. విచ్చలవిడిగా ప్రవర్తించవచ్చు. ప్రజలను చిన్నచూపు చూడవచ్చు. అలా అధికారాన్ని , సంపదను, నిలుపుకోలేక పోవచ్చు.

కులాధిక్యతను చూసుకొని మురిసి పోయేవారు , గర్వించేవారు స్వంతంగా సాధించిందేమీ లేక కులం పేరు చెప్పుకొని బతుకుతారు. వీరు దరిద్రులు. వీరి వల్లనే కులాల మధ్య చిచ్చులు రగులుతుంటాయి. ఫలానా కులంలో పుట్టడం అనేది యాదృచ్ఛికం. దాన్ని చూసుకొని మురవడం దేనికి,బాధపడడం దేనికి?

కొన్ని కులాల్లో తొలితరం నుండి ఎదిగినపుడు ఎదగడం ఓర్వలేక కొందరు సన్నిహితులే కిందికి లాగాలనుకోవచ్చు. అలా అందుకున్న అవకాశం , అధికారంతో తొలితరం నుండి ఎదిగినవారు వేలాది లక్షలాది మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా రహస్యంగా మేలు చేస్తారు. అన్నీ బయటకు చెప్పలేనివి ఉంటాయి. అలా అంబేద్కర్, జగజీవన్ రాం మొదలుకొని ఎందరో అధికారులు నాయకుల కృషివల్లనే ఈ కాస్తయినా జనం ఎదుగుతున్నారు.

తొలితరంవారు అధికారం పోగానే మంచి పనైంది అని సంతోషిస్తూ పైకి అయ్యో అని సానుభూతి చూపుతారు. మళ్లీ మళ్లీ అధికారం కోసం కృషి చేస్తూనే ఉండాలి. అలా కాకుండా

చతికిల పడితే ప్రజలలో పెరిగిన సంతోషం విశ్వాసం వల్ల విమర్శలు చేస్తారు.

నాయకత్వం కోసం నిరంతరం పోటీ పడాల్సిందే. పత్రిక నడపడం , స్కూలు నడపడం , విలేఖరిగా పని చేయడం కూడ అధికారమే.

నాయకత్వం అధికారం ఊరకేరాదు. అలా వచ్చేది ఎంతో కాలం మిగలదు.

గెలిచినవారు తరాల తరబడి అదేస్థాయిలో కొనసాగడం కూడ ఎంతో కష్ట సాధ్యం. కులం తప్ప మిగతావి మూడోతరానికే ఆ స్థాయిని కోల్పోవడం గమనించవచ్చు.

అర్హతకు మించిన అందలం అందితే నిభాయించుకోలేక బోలెడు తప్పులు చేయవచ్చు. అందువల్ల సీనియర్ల అదుపు సలహాలు, శిక్షణ అవసరం. గురువులను ఎన్నుకోవాలి. విజయం లో వారి పాత్రే ప్రధానం. అలెగ్జాండర్ కు అరిస్టాటిల్, మౌర్య చంద్రగుప్తునికి చాణక్య గురువు లేకుండ వారి విజయాలు సాధ్యం కాలేదు.

తొలితరం నుండి ఎదిగేవారికి గురువులు మరింత అవసరం. లేని ఎడల తెలిసీ తెలియని తనంలో జరిగే పొరపాట్లను నడమంత్రపు సిరి, ఎక్కడఆగుత లేదుఅని అప్రదిష్ట మూట గట్టుకోవచ్చు.

అందువల్ల అధికారం కోసం ప్రయత్నం చేస్తూనే అందుకుసంబందించిన , సంస్కారం, అధ్యయనం , ఇతరులను చూసి నేర్చుకోవడం సాగుతుండాలి.

సంపద, అధికారం రాగానే ఎక్కడెక్కడ నుంచి స్నేహితులని, చుట్టాలని, రకరకాల పేర్లు చెప్పుకొని చుట్టూ చేరుతుంటారు. వారిని నమ్మి కేటీశ్వరులైన సినీతారలు బికారిలా మరణించారు. వారికి తెలియకుండ అనేక విధాల నష్టం చేయవచ్చు. ఈ అనుభవాలు గుణపాఠాలు నేర్చుకునే సరికి అధికారం ఊడి పోతే ఆ బాధ వర్ణనాతీతం. గతంలో బతకలేరు. అధికారం , హోదా, గాంభీర్యం సడలదు.

కాని చేతిలో అధికారం ఉండదు. అధికారం లేని వారికి దాని రుచి ఆనందం తెలియదు. వారు ఆనందంగా హాయిగా నిద్రపోగలరు. కాని అధికారం అనుభవించిన తర్వాత,అందరిలో హోదా గౌరవం, మన్నన పొందుతూ సేవ చేసాననే తృప్తి సాటిస్ ఫాక్షన్

పొందాక అధికారం పోతే ఆ బాధ బాధ కాదు. అందుకే అధికారం ఒకసారి పొందినవారు మళ్లీ మళ్లీ రావాలని కోరుకుంటారు. అలాగే అధికారం రుచి తెలియని కులాలను , వర్గాలను , అధికారం రుచి తెలియకుండ అధికార వర్గాలు, కులాలవారు చాలామంది అధికారం దరిదాపుల్లోకి రాకుండ చూస్తుంటారు,

చేస్తుంటారు. అందువల్ల కొత్తగా అధికారం లోకి వచ్చేవారు, రాదల్చుకున్న వారు

ఈ గండాలన్ని దాటాల్సిఉంటుంది. ఈ పరీక్షలన్ని పాస్ కావాల్సి ఉంటుంది. అందువల్ల శిక్షణ తరగతులు పెట్టుకొని గురువులను, సంపాదించుకొని , సలహాలు , జాగ్రత్త లు

తెలుసుకోవాల్సిఉంటుంటుంది. తీపి రుచి ఎరుగని వారికి తీపి రుచి మాటలతోచెప్పలేం. తీపి తినిపించి రుచి

చూపాల్సిందే.

సన్యాసం లో ఉండే మజా సన్యాసులకే తెలుసు. సంసారం లో వుండే మజా సంసారులకే తెలుసు. తల్లి తనంలో ఉండే తృప్తి తల్లులకే తెలుసు. సంపద / కీర్తి సంపద రుచి , తృప్తి అది అనుభవించే వారికే తెలుసు.

రచన చేయడంలో ఉండే తృప్తి రచన చేసే వారికే తెలుసు.

మొక్కే వారికే తెలుసు అది ఇచ్చే స్ఫూర్తి. మిగతా వారికది చెక్క పేడు, రాతి బొమ్మ. అలా

అధికారం లో

ఉండే మజా అధికారం లో ఉండేవారికే తెలుసు.

కనీసం క్లాసులో మానిటర్

గానో, ఇంట్లో , వాడలో, ఆటలో పాటలో పనిలో ఎక్కడో ఓచోట

ఏదో అనుభవం లో అధికారం రుచి కొంత తెలుస్తుంది. అందుకే పార్ల మెంట్ లో 70 శాతం ఇంటిలో తొలి సంతానమని ఆ మధ్య విశ్లేషించారు.

అందువల్ల ఎక్కడైనాఏదైనా ఎంత చిన్నదైనా

నాయకత్వం అందుకొండి. నాయకులుగ మన్నన పొందండి

సోపానంలో అది తొలిమెట్టు అవుతుంది.

ఒకనాటి సర్పంచ్ రాష్ట్రానికి ముఖ్య మంత్రి కాలేదా! ఒకనాటి రచయితల ఐక్య వేదికల నిర్మాతలు, ఎన్జీవో, జీవోసంఘనేతలు , కళాసంపదల నిర్వాహకులు, గురువులు,

మోటివేటర్లు వివిధ రంగాల్లో ఛైర్మన్లు కాలేదా! అద్భుతంగా నిరూపించుకోలేదా!

మొదటే చెప్పాల్సిన వారు మంచి టీచర్లు , లెక్చరర్లు, ప్రొఫెసర్లు , హెడ్మాస్టర్లు , ప్రిన్సిపాల్లు, రచయితలు, కళాకారులు, మేధావులు. విద్యా బుద్దులు సంస్కారం జీవిత లక్ష్యాలను తీర్చి దిద్దే

వీరిని , వీరి పాత్రను ఎవరితోను పోల్చలేమ.

వీరు ఏక కాలంలో గురువులు, అధికారం చేయించే నాయకులు, సలహాదారులు, రోల్ మాడల్స్ , స్ఫూర్తి దాతలు, వ్యక్తిత్వ నిర్మాతలు. వీరికి శిష్యులుంటారు , అభిమానులుంటారు . కాని పార్టీ నాయకులు లాగా వెంట నడిచే వారుండవచ్చు , ఉండకపోవచ్చు. కాని సమాజ ననిర్మాణంలో వీరి పాత్ర స్థానం అనన్యం మహోన్నతం. నాయకులు క్రమంగా గురువులుగా ఎదుగుతారు. నాయకత్వం అందనివారు, అవకాశం కోల్పోయిన వారు గురువులు గా కింగ్ మేకర్లుగా అత్యున్నత స్థానం , అధికారం పొందే అవకాశం ఉంటుంది.

---



# బాల వికాసం

## బాల గేయం

### ఋతు పవనం!

ఋతు పవనం! ఋతు పవనం!
మబ్బుల వానలకవనం! ॥ఋతు॥

నైసర్గికముగ మనకిల
నైఋతి దిశనుంచి వచ్చు
నైఋతి ఋతు పవనం!
'జూన్'లో కేరళ మీదుగ
జోరుగ వానల గమనం! ॥ఋతు॥

నెర్రెలు బారిన నేలకు
సర్రున జల్లులను తెచ్చి
సాగునీరు తాగునీరు
సమకూర్చే ఏరువాక!
రైతన్నల కన్నుల్లో
కానవచ్చు వెలుగురేక!
చెరువులు, కుంటలు నింపే
కరువులణచు కాంతిరేఖ!
ప్రజలకు- ప్రభుత్వానికి
"సుజలాం" ఆశారేఖ!!



- డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699

## కొడుకా

నీ తండ్రిని నీవు చేరదీయకుంటే
నీ కొడుకూ నిన్ను చేరదీయక పోవచ్చు
నీ తండ్రిని వెలివేస్తే ,వృద్ధాశ్రమంలో ఉంచితే
నీకూ అదే గతి పట్టవచ్చు
నీవు ఎదిగావంటే వారే కారణం
నీవు ప్రయోజకుడవయ్యావంటే వారే కారణం
నీవు తింటున్న అన్నం,నీవు కడుతున్న బట్ట, నీవు అనుభవించే
భోగాలు వారిభిక్షే.
వారు ప్రాణానికి ప్రాణంగా పెంచితేనే నీ ప్రాణం,
నీ జీవితం .అది గుర్తుంచుకో.
తల్లిదండ్రులే మొదటి కనబడే దేవుళ్ళు.
వారిని సేవించు,పూజించు,
ప్రేమలుపంచు అదేశ్రీరామ రక్ష.



-ఎలగందుల లింబాద్రి.
చరవాణి.7659834393.

## బాల్యం.

ఆనందపుటంచులు తాకే బాల్యం ఎక్కడ ఉందీ
ఆహ్లాదపుటవధులు దాటే బాల్యం ఎక్కడ ఉందీ
టైరు పంక్చరు షాపుల్లోనా బాల్యం బందీ
చాయపోసే హోటల్లోనా బాల్యం బందీ
కూరలమ్మే అంగడిలోనా బాల్యం బందీ
చెత్త కుప్పలు ఏరుటలోనా బాల్యం బందీ
బిచ్చమెత్తే బతుకుల్లోనా బాల్యం బందీ
ఇచ్చగించని పనుల్లోనా బాల్యం బందీ
పలక పట్టే చేతులు అరక పడితే ఎలా?
బలపం పట్టే చేతులు బరువులెత్తితే ఎలా?
ఆడి పాడే మనసులు ఆరళ్ళ పాలైతే ఎలా?
ఊహలఊయల ఊగే వయసులో
ఊపిరి సలపని పనులేలా?
కమ్మని కథలు వినాల్సిన తరుణంలో
కష్టాల కడలిని ఈదనేలా?
బాలల జీవనచిత్రం మారాలంటే..
బాల్యం ఛిద్రం కారాదంటే..
బాలలు బడిబాట పట్టాలిపుడు
వారి భవితకు భరోసానివ్వాలిపుడు.
అరకపట్టే చేతులకు పలకనిచ్చే దాత కావాలిపుడు
బరువులెత్తే చేతుల్లో బలపంపెట్టే భ్రాత రావాలిపుడు
ఆరళ్ల పాలైన పాపలను ఆడిపాడించే దోస్తు కావాలిపుడు
వెట్టినుండి విముక్తికోసం
ఆ చిట్టిచేతులకు గట్టి ఆసర కావాలిపుడు
పనుల్తో ఊపిరాడని పిల్లలను
ఊహల ఊయలలూపే జోడి కావాలిపుడు
కష్టాల కడలి వదలలేలా
కమ్మనికథలుచెప్పే బామ్మ కావాలిపుడు
పలకనిచ్చే దాత.. బలపమిచ్చే భ్రాత..
ఆడిపాడే దోస్తు.. ఊయలలూపే జోడీ..
కథలు చెప్పే బామ్మ..
అందరూ ఒక్కటై గురువుగా రావాలిపుడు..
అపుడే బాల్యం ...
ఆహ్లదపుటవధులు దాటుతుంది
ఆనందపుటంచులు తాకుతుంది.



-రాంనరేష్
9492682285

## రేపటి పౌరులం

మేము పిల్లలం
మేము పిల్లలం
నేలతల్లి పసిడి పువ్వులం
భరతమాత ముద్దు బిడ్డలం
భావి భారత భాగ్యరేఖలం

మేము పిల్లలం
మేము పిల్లలం
సన్నజాజి చెట్టు రెమ్మలం
పచ్చని లొగిలికి వన్నెలం
చల్లని నీడనించే కొమ్మలం

మేము పిల్లలం
మేము పిల్లలం
పాఠశాలలో ఆడిపాడే ఆటలం
పలకపై ఓనమాలు దిద్దే బాలలం
మేము దేశానికి రేపటి పౌరులం

మేము పిల్లలం
మేము పిల్లలం
భద్రతను ఇచ్చే సైనికులం
ఆరోగ్యాన్ని కాపాడే డాక్టర్లలం
సౌధాలను నిర్మించే ఇంజనీర్లలం

మేము పిల్లలం
మేము పిల్లలం
అలుపెరుగని శ్రమ యోధులం
పంటలను పండించే కర్షకులం
చెమటలను రాల్చే నిత్యశ్రామికులం



-పగిడిపల్లి సురేందర్ పూసల
9290701508

## పిల్లలు...

లేవాలి లేవాలి
వేకువజామున లేవాలి !
తోమాలి తోమాలి
పళ్ళు చక్కగా తోమాలి !
కడగాలి కడగాలి
ముఖం బాగా కడగాలి !
చేయాలి చేయాలి
స్నానం రోజు చేయాలి !
దువ్వాలి దువ్వాలి
తలను బాగా దువ్వాలి !
వెళ్ళాలి వెళ్ళాలి
బడికి రోజూ వెళ్ళాలి !
చదవాలి చదవాలి
ఉన్నత చదువులు చదవాలి !
పాడాలి పాడాలి
పాటలు బాగా పాడాలి !
ఆడాలి ఆడాలి
ఆటలు బాగా ఆడాలి !



-పి. కుమార్
చరవాణి :897863193

## బాల మొగ్గలు

ఆట ,పాటలను నిత్యం ఆస్వాదిస్తూనే
చదువులమ్మ గుడికే వన్నె తెస్తారు
కోవెలలో వెలిగే చిట్టి దివ్వెలు 'బాలలు'

వివిధ కళలలో ప్రావీణ్యం సాధిస్తూనే
కన్నవారి కలలను సాకారం చేస్తారు
కళామతల్లి కాలి మువ్వలు 'బాలలు'

విహంగాలులా స్వేచ్ఛగా విహరిస్తూనే
స్నేహ పరిమళాలను వ్యాపింపచేస్తారు
చెలిమి గూటిలో ఒదిగే గువ్వలు 'బాలలు'

బడిలో చక్కటి క్రమశిక్షణ పాటిస్తూనే
గురువులకు ప్రియ శిష్యులవుతారు
ఆకాశంలో వెలిగే తారా జువ్వలు 'బాలలు'



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
944179139

గౌరవ, మర్యాదలు ఇచ్చిపుచ్చుకోవాలనే చోట అంతిమ సత్యావిష్కరణకు తావు లేదు.

-మునిమడుగుల రాజారావు
-7013577140

---

# తాత్వికపరిమళం డా॥ఆంజనేయులు కవిత్వం



**"పొరలు కప్పబడి ఉంటాయి**
**ఊదుకోవడమే కవిత్వం-**
**ఆకుపై నిశ్శబ్దంగా జారే బిందువు**
**ఒక వెలుగు/ఒక పరుగు**
**అనుభవాలు అక్షరాలుగా**
**పదునుదేరటమే కవిత్వం"** (డా॥ఎన్ .గోపి)

ఏ కవిత పురుడు పోసుకోవడానికైనా అనుభవం ముఖ్యం.జీవతానుభవం వలన చూపు మరింత విశాలమౌతుంది.

సమాజంనుంచి నేర్చుకున్న పాఠాల్లోంచి,జీవితం నేర్పిన అనుభవాలలోంచి తాత్వికపరిమళాన్ని వెదజల్లుతున్న కవి డా॥సి.హెచ్ ఆంజనేయులు. తన యాభైఏడేండ్ల జీవితఅనుభవాల తాత్వికసారమే ఈ "ఆశలగాలి పటాలు"కవిత్వం. ఏ కవి వ్యక్తిత్వమైనా తన కవిత్వంలో ప్రతిబింబిస్తుందంటారు. అలాగే ఈ కవిలోని హృదయనిర్మలత, మార్దవం తన వాక్యాల్లోనూ కనబడుతుంది. సామాజిక విషయాలను చెప్పేటప్పుడు ఆవేశం కన్నా ఆలోచనాత్మకంగా ఉంటుంది తన వాక్యం. సాంప్రదాయ కవిత్వఛాయలు తన కవితల్లో ఎక్కువగా కనబడుతాయి.

**"మనిషే నా విశ్వాససంతకం**
**మనిషే నా సకలం**
**మనిషితనం నిండా**
**వెన్నెల ఆరబోసినట్లున్న కాలం కోసం**
**నిరంతరం తపస్సు"**(అపరిచితులం-పే.54)

ఆంజనేయులు కవిత్వంలో మనిషే కేంద్రం. మనిషిని ఆనుకొని వున్న సుఖదుఃఖాలు, మానవ స్వభావం, యాంత్రికమైపోతున్న ఆధునిక జీవితం తన కవిత్వంలోని ప్రధానవస్తువు. జీవితాన్ని ఎలా దర్శించాడు?ఎట్లా వ్యాఖ్యానిస్తున్నాడు?జీవితం పట్ల తనకున్న తాత్విక దృష్టి ఎలాంటిదో "బతుకు" కవితను చదివినపుడు తెలుస్తుంది.

**"బతుకొక నటనల వలయం**
**బతుకొక భ్రాంతివాస్తవాల చిత్రశాల**
**బతుకొక జనన మరణాల మధ్య**
**ప్రాణాయామం"** (బతుకు-పే.124)

"ఊపిరివున్నంత వరకే మనిషి, తతర్వాత శవం" ఈ తత్వాన్ని బాగా అర్థం చేసుకున్న కవిగా జీవితాన్ని వ్యాఖ్యానిస్తాడు.బ్రతుకే ఒక నాటకరంగమైనపుడు మన పాత్ర ఎప్పుడు ముగుస్తుందో తెలియదు.కాబట్టి మనిషి తనలోని స్వార్థాన్ని,అహాన్ని విడిచిపెట్టాలంటాడు. జీవితసంద్రంలో ఆటుపోట్లు సహజం. రెండింటిని సమానదృష్టితో చూస్తూ సాగిపోవడమే బ్రతుకని తెల్పడమే తన కవితలలోని తాత్వాకత. అన్నమయ్య, వేమన, వీరబ్రహ్మం మొదలైన కవులు జీవితాన్ని దర్శించిన మార్గమే తన కవితల్లో కనబడుతుంది.

ఆత్మీయప్రపంచాన్ని సంపాదించుకోవడం కన్నా జీవితంలో మరేది ఎక్కువ కాదనే సత్యం వినిపిస్తాడు.

**"మనుషుల మనస్సు కూడలి చుట్టూరా**
**విషాదాల కెరటాలు తాకినప్పుడల్లా**
**గాయాల సమూహాన్ని లేపనంతో మాన్పే**
**చేతులు కావాలి!"**(పచ్చ సంతకం-పే.43)

జీవితానికి ఊరటనిచ్చే ఒక చల్లని మాటకోసం
రాత్రిపగలెరుగక ఎదురుచూసే కళ్ళు తామరపూలు
రోజురోజుకూ ఆధునిక జీవితం సంక్లిష్టమౌతున్న
కాలంలో ఈ కవి మనకోసం ఎదురుచూసే ఒక మనిషిని కలగంటాడు. నాల్గు ఆత్మీయమైన మాటల కోసం నడక సాగిస్తుంటాడు.ఎంత డబ్బున్నా మనల్ని పలకరించే ఒక మనిషి లేకపోవడం ఎంతో విషాదం!.అందుకే ఈ ఉరుకుల పరుగుల జీవితాన్ని చూసి బైరాగిలా నవ్వుకుంటాడు.ఆ నవ్వులో బతుకు శాశ్వతం కాదని, బతుకొక మాయ అని అనేక అర్థాలు ధ్వనిస్తాయి.

డా॥ ఆంజనేయులు ప్రకృతి కవి.ప్రకృతిని జీవితానికీ అన్వయించి చెప్పడం తన కవితల ప్రత్యేకత. జీవితం గురించి చెప్పినప్పుడల్లా చెట్టు, నది, పక్షి మొదలైన ప్రకృతిసంబంధమైన వాటితో పోలుస్తూ జీవితాన్ని విశ్లేషిస్తాడు.




పుస్తక సమీక్ష

**"రాలిన ఆకులను చూసి**
**చెట్టువైపు జాలిగా చూడకు**
**చిగురుటాకులను చూసి వసంతోత్సవమని**
**అతి ఉత్సాహం చెందకు"** (రాలిన ఆకులను చూసి -పే.35)

ప్రకృతిలోంచి జీవితాన్ని దర్శించడం, ప్రకృతిలోని ప్రతీ అణువణువు నుండి జీవితరహస్యాన్ని తెలుసుకోవడం చేస్తుంటాడు ఈ కవి. సంతోషంలో పొంగిపోవడం గానీ, దుఃఖంలో కుంగిపోవడంగానీ చేయకుండా సాధారణ జీవితాన్ని గడపాలనే తత్వం కనబడుతుంది.

"విషాదంలోనూ హాయిగా ఉంది" అని ఈ కవి అనడం వెనుక జీవితాన్ని లోతుగా దర్శించిన అనుభవం కనబడుతుంది.

సాహిత్యంలో చాలా వరకు నదిని,చెట్టును త్యాగానికి ప్రతీకగ తీసుకున్నారు."త్యాగభావమునకు తరువులే గురువులు"లాంటి పద్యపాదాలు అందుకు ఉదాహరణ. వీటిని చూసి పరోపకారగుణం నేర్చుకోవాలని బోధించారు. ఆంజనేయులు కూడా ప్రకృతిలోని త్యాగగుణం మనిషికి ఉండాలని ఆకాంక్షించాడు. సంకుచితత్వం వీడి విశాలత వైపు అడుగులు వేయమంటాడు. నలుగురికి సహాయం చేయడంలోనే జీవనసౌందర్యం దాగివుందనే సత్యం తన కవితల అంతస్సారం. ఆదివాసిల కోసం ప్రాణాలర్పించిన కొమరం భీం, దోపిడి విధానాలను ఎదిరించిన ఐలమ్మను, తెలంగాణ కోసం ప్రాణాలొదిలిన అమరుల త్యాగాలను కీర్తిస్తాడు.

మనిషి జీవితాన్ని ప్రభావితం చేస్తున్న వాటిల్లో డబ్బు ఒకటి.

డబ్బు మనిషికి విలాసవంతమైన జీవితాన్ని ఇచ్చింది. అలాగే మనిషితనం లేకుండా చేసిన సందర్భాలూ అనేకం.

**"డబ్బుంటే ఆకాశంతోటలో**
**నక్షత్రపుష్పాలనే కొని తెచ్చి**
**సిగలో తురుముకోవచ్చు"** (మానవతా మణి కిరీటం-పే.46)

మనుషులే కాదు సమస్తం సరుకుల అంగడి నేడు.

డబ్బుతో ముడిపడ్డ జీవితంలోని రెండు పార్శ్వాలు ఇక్కడ చూడొచ్చు.డబ్బు ద్వారా ప్రతిదీ సాధ్యమౌతుందని ,డబ్బు చుట్టు తిరుగుతూ అంగడిసరుకుగా మారిపోయాడనే విషయం స్పష్టంగ చూపిస్తాడు.

**"జీవితం రంగులపక్షి "** అంటాడు డా॥ ఆంజనేయులు. పిట్టబతుకుకు, మనిషి బతుకుకు ఎంతో తేడా.ఎన్ని కోట్లు ఉన్నా మనిషి ఇంకా సంపాదించుకోవాలనుకుంటాడు. పక్షులు అట్లా కాదు. ఏరోజుకారోజు తృప్తిగా జీవిస్తాడు. ఏపూటకాపూట ఇంత దొరికితే చాలు అనుకునే తత్వం పిట్టది.ఒకరిని తొక్కి పైకి ఎదగాలనుకునే మనస్తత్వం మనిషిది.

అందుకే ఈ కవి డబ్బు జీవితంలో భాగము మాత్రమే డబ్బే జీవితం కాదని చెబుతాడు.

సమాజం తీరుతెన్నుల గురించి గత ముప్పై యేండ్లుగా బోధిస్తున్న ఒక అధ్యాపకుడిగా,జీవితంలోని ఎత్తుపల్లాలను చూసిన ఒక సామాన్యుడిగా జీవితంలో ఎలా బ్రతకాలో తెలిపే బోధ సి.హెచ్ ఆంజనేయులు కవిత్వంలో కనబడుతుంది.

**దీపమై వెలిగించుకో బతుకు చివరంచుదాకా**
**సాగిపోవాలనే విశ్వాసకవచాన్ని ధరిస్తే**
**ఆవలి అంతిమ శిఖరం ఎక్కి**
( జీవనరుషి-పే.45)
**మనిషెప్పుడూ నిలువనీరుగా నిలిచిపోరాదు**
**మనిషి నిరంతర గంగానదిలా సాగాలి**

ఇవి యువతను లక్ష్యంవైపు నడిపించే వ్యక్తిత్వవికాస పాఠాలు.విచక్షణాజ్ఞానాన్ని పెంపొందించి ఎంతో ప్రేరణనిస్తాయి.చదువులో జయాపజయాల కన్నా జ్ఞానసంపాదనకే ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలంటాడు. ఇప్పుడున్న విద్యావిధానం ఎట్లుందో మనకు తెలియంది కాదు. టెక్నాలజి యుగంతో పోటీపడే వాళ్ళలో కూడా విషయపరిజ్ఞానం తప్ప లోకజ్ఞానం తెలియని వాళ్ళూ ఉన్నారు.నైతికవిలువలు లోపించి తల్లిదండ్రులను హింసించే వాళ్ళూ ఉన్నారు. అలాగే ర్యాంకుల కోసం వెంపర్లాడే తల్లిదండ్రులు లేకపోలేదు. వీటన్నింటికి పరిష్కారం మన ఆలోచనావిధానంలో మార్పు రావడమే.

"ఆశలగాలిపటాలు"కవిత్వసంపుటిలో రైతు జీవితాన్ని,తెలంగాణ ఉద్యమాన్ని ప్రతిబింబించే కవితలున్నా ఎక్కువభాగం తాత్వికతే కనబడుతుంది. బహుశా తన అనుభవం కూడా అందుకు కారణం కావొచ్చు.

ఇది వరకు డా॥సి.హెచ్ .ఆంజనేయులు అక్షరాలు పూస్తున్నాయి,గాయపడిన జాబిలి,దిగివచ్చిన గగనం అనే మూడు కవిత్వసంపుటాలు వెలువరించాడు."అనిసెట్టి అగ్నివీణ ఒక విశ్లేషణ" అనే సిద్ధాంత వ్యాసం రాశారు. 'తెలంగాణ వచనకవిత్వం-ఒక విశ్లేషణ' అంశం మీద దాదాపు వెయ్యి పేజీల పరిశోధనగ్రంథం రాశారు. రాజకీయాలకు అతీతంగా తన పని తాను చేసుకుంటూ పోవడం మాత్రమే తెలిసిన కవి. నిరాడంబరంగా బతకాలని తన కవిత్వం ద్వారా చెప్పి బతుకుతున్న కవి.

పుస్తకం వివరాలు
పేరు:ఆశల గాలిపటాలు
కవి:డా?సి. హెచ్ ఆంజనేయులు
వెల:రూ. 75
ప్రతులకు:పాలపిట్ట పుస్తకకేంద్రాలలో
ఫోన్ నంబర్ :7702537453



-తగుళ్ళ గోపాల్
9505056316

## నానీలు

భస్మాసురుణ్ణి
మించింది కరోనా
అదీ.. మరి చైనాలో
పొందింది వరం !!

కనబడని వైరస్సే
కాని...శోదిస్తే
ఉన్న రంగులన్ని
దాని ఒంటిపైనే !!

దాగుడు మూతలంటే
దానికెంతిష్టమో
ప్రతి యిల్లు దానికో
క్రీడా స్థలమే !!

ప్రజల బ్రతుకుల్ని
చిద్రం చేసిన
కరోనా ఇపుడు
విశ్వ జపమైంది !!

పిల్లల నిడువదు
పెద్దల నిడువదు
అందరికీ
ఆత్మబంధువే !!

అంతం లేదని
పంతం బూనింది
కరోనా పాతకి
ప్రాణాలిగ కైలాసమే !!

కంటికగపడదు
వొంటినిడవదు
అదిప్పుడు
చాపక్రింద మృత్యునీరు !!

జనం బతుకుల్ని
మోదులు చేసిన
కరోనా..జనం గుండెల్లో
మండే అగ్నిగోలం !!

పులిని అనుకరించింది
మహమ్మారి
నరగొంతే దాని
కీలక స్థావరం !!

విశ్వమిప్పుడు
దాని చేతిలో పూబంతైంది
అదిప్పుడు
విశ్వవిజేతే !!

దానికాశెక్కువే
ఇంకా ఆగడం లేదు
దాని ఆయువిక
మునివేళ్ళ పైనే !!



-పోమాల హన్మంతు
9989943521

# సిగ్నల్ ఫ్రీ కరోనా..

ట్రాఫిక్ సిగ్నళ్ళ వద్ద వాహనం ఆగటానికి ముందుకు సాగటానికి వ్యవధి కొన్ని సెకన్లు... కరోనా మహమ్మారి మనిషిని కాటేయటానికి ఈ సమయం చాలా ఎక్కువే... ఆరోగ్యవంతుడు వైరస్ బాధితుడయ్యేందుకు ఈ సెకన్లు ఎక్కువే..

సమాజమనే పడవ మునగకుండా ప్రభుత్వం కోట్ల కళ్ళతో రేయింబవళ్ళ కాపుకాసింది..కానీ.. చిల్లులన్నీ పూడ్చి ఎక్కడో ఒక రంధ్రాన్ని గమనించక పోయినా సరే..పడవ మునిగిపోతుంది..

ఇన్నాళ్ళు నిద్రపోయిన తారు నదుల్లో ఇపుడు వాహనాలు ప్రవహిస్తున్నాయ్ ... లాక్ డవున్ సంకెళ్ళ సడలింపుతో స్పీడో మీటర్లు రయ్యి మంటున్నాయ్..

రోడ్లపైకి వేల సంఖ్యలో దూసుకొచ్చే వాహనాల విషయంలో భౌతిక దూరం అమలు కావటంలేదు.. వాహనాలు రెడ్ సిగ్నల్ పడగానే ఠక్కున నిలిచిపోతుండటంతో ఆప్రాంతంలో సోషల్ డిస్టెన్సింగ్ రూల్ బ్రేక్ అవుతోంది.. కోవిడ్ నిబంధన అపహాస్యమవుతోంది..

ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు ఆటోల విషయంలో ఈ ప్రమాదం ఎక్కువగా ఉంది.. సిగ్నల్ పాయింట్ వద్ద ఏమాత్రం డిస్టెన్స్ మెయింటెయిన్ చేయకుండా వాహనాలను ఒకరి భుజం ఒకరికి తగిలేంత చేరువలో నిలుపుతున్నారు... సిగ్నల్ పాయింట్ వద్ద కరోనా తలెత్తే ప్రమాదం ఉందని కొందరు జగ్రత్తపరులు బాధ్యతాయుత పౌరులు ముందు వాహనాన్ని గమనించి కొంత వెనుకగానే తమ వాహనాన్ని నిలిపినా వారివెనుకవచ్చేవారు మాత్రం కరోనా సోయి లేకుండా వ్యవహరిస్తున్నారు.. సిగ్నల్ మారేలోగా ముందుకు వెళ్ళిపోవాలనే ఆరాటం తప్ప కరోనా ప్రమాదం మరిచిపోతున్నారు.. ఆటోల్లో కూర్చున్న వారో డ్రైవరో, ద్విచక్రవాహనం వెనుక కూర్చునేవారో సెల్ ఫోన్ మాట్లాడుతున్నప్పుడో, తుమ్మినప్పుడో దగ్గినప్పుడొ వారిలో ఎవరికన్న వైరస్ ఉండి ఉంటే తుంపర్ల ద్వారా వ్యాప్తి అయ్యే ప్రమాదం ఉంది

ఇందువల్ల రోడ్లపై ఎరుపు ఆకుపచ్చ సిగ్నల్ లైట్లు మరొక అర్థాన్ని సంతరించుకునే స్థితి పొంచి ఉంది...ఆకుపచ్చ అంటే కరోనా వైరస్ వ్యాప్తి అని ఎరుపు అంటే తలెత్తే విపత్కర స్థితికి నిదర్శణం అని అర్థం తర్జుమా అయ్యే ప్రమాదమేర్పడుతోంది...

కరోనా రక్కసి కట్టడిలో ప్రజలు మహమ్మారి బారిన పడకుండా చేసే చర్యల్లో పోలీసులు కీలక భూమికపోషించిన విషయం విదితమే... తమ సెలవులు మరిచి కుటుంబాలనొదిలి రోడ్లపైనే విధుల్లో నిమగ్నమైన సంగతి తెలిసిందే...

కానీ పోలీసింగ్ లో అంతర్భాగమైన ట్రాఫిక్ రూల్స్ కరోనాకు సహకరించే అవకాశాలు కనిపిస్తున్నాయి... కరోనా వ్యతిరేక స్థితికి అనుగుణంగా ట్రాఫిక్ చర్యలు లేకపోవటం ఈ సందేహాలకు కారణం అవుతోంది.. చిన్న దుకాణం మొదలు పెద్ద స్టోర్ వరకు కోవిడ్ ఆంక్షలు అమలవుతున్నాయి.. వినియోగదారులు బారులు తీరకుండా గుమికూడకుండా ఎగబడకుండా సోషల్ డిస్టెన్సింగ్ చర్యలు అమల్లోకొచ్చాయి...నిర్ణీత దూరదూరాన మనుషులు నిలిచేవిధంగా వృత్తాలు చదరాలు ఏర్పాటు చేస్తున్నారు...

కానీ ఈ నిబంధన ట్రాఫిక్ కు వర్తించదన్నట్టు వాహనదారులు ఎవరికివారు ప్రవర్తిస్తున్నారు.. కరోనాకు ముందు లా ట్రాఫిక్ రూల్స్ ఇబ్బంది కనుక ట్రాఫిక్ జోన్లను సిగ్నల్ ఫ్రీ గా మార్చాల్సిన ఆవశ్యకత ఏర్పడింది... ఎరుపు ఆకుపచ్చ సిగ్నళ్ళ పేరుతో వాహనదారులను ఒక చోట గుమికూడ కుండా నిరోధించే చర్యల్లో బాగంగా ట్రాఫిక్ కూడళ్ళను సిగ్నల్ ఫ్రీగా మార్చాల్సి ఉంది...

ట్రాఫిక్ కూడళ్ళ వద్ద వాహనాలు బెల్లం మీద ఈగల్ల ఒకచోట నిలబడిపోవటం కాక నిర్ణీత మార్గంలో ప్రయాణిస్తూ అవసరమైన చోట్ల యూ టర్న్ లు తీసుకుంటూ కొంత అదనపు దూరం ప్రయాణించైనా సరే ఎక్కడా ఆగకుండా ముందుకు సాగిపోవటమే సిగ్నల్ ఫ్రీ విధానం..

నగరాల్లో కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే ఈ సిగ్నల్ ఫ్రీ నిబంధనలు అమల్లో ఉన్నాయ్.. ఈ నిబంధన పూర్తి స్థాయిలోకి తేవటంతోపాటు ఇప్పటికే ఈ విధానం లేని చోట ప్రవేశపెట్టాలి..

కరోనా మానవాళి స్థితిగతులన్నీ మార్చేసింది.. ఏం పాటిస్తే కరోనా రహితం అవుతుందో ఆదిశగా ప్రపంచ రేఖలు వాలిపోతున్నాయి... ట్రాఫిక్ నియంత్రణ కూడా తీరు మార్చుకోవలసి ఉంది..



–కె..శ్రీనివాస్
9346611455

## కోవిడ్ 19

వైరస్ లలో నేనే రారాజునని"
నెత్తి కెక్కిన కోరల అహంతో విర్రవీగుతూ విధ్వంసం సృష్టిస్తోంది"
దానికి వావి వరుసలు రీతి రివాజులు లేవు
మొలకె త్తి చిగురించి ఎదుగుతున్న
మొక్కలాంటి పసిపిల్లడైనా పండు ముదుసలి అయినా ఒక్కటే"
'బీద ధనిక తెలుపు నలుపు తేడాలు జాంతానై
మనిషి ముక్కుల్లో మక్కువగా దూరుతోంది
శ్వాస కోశపు కొమ్మల్లో రెమ్మల్లో చొరబడి కబ్జా చేస్తోంది
వీధి రౌడీలా హుంకరించి క్రూర పరిహాసం చేస్తోంది
చాప కింది నీళ్ళలా రక్త నదుల్లో ఈదులాడుతోంది
ఆమ్లజని అందక వేటు పడిన పక్షిలా మనిషి ఉక్కి రి బిక్కిరవుతాడు
పాము విషం లా ప్రధాన అవయవాలకు జర్రున పాకుతోంది
మనం వృద్ధి చేసుకున్న వైద్య శాస్త్రాన్ని సవాల్ చేస్తోంది
కవలల్లాంటి మన రెండు చేతుల్నీ మనకు పగవాళ్లని చేస్తోంది
ఈ అష్ట దరిద్రపు క్రిమి ఎక్కన్నుంచి వస్తేనేం?
భయ కంపితులం కావొద్దు చిగురు టా కుల్లా విల వి ల్లాడ వద్దు
మమతానురాగాల బృందగానంతో
నవ్వుల పువ్వుల నెత్తావుల్తో
స్వగృహ మే ఆనంద సీమగా మలచుకొందాం
వైరస్ గొలుసు తెంచుదాం
మనిండ్లకి మనం వేసుకున్న తాళాలు తొలగించు కొందాం
త్వరలో బంధ విముక్తులమయే వేళ వస్తోంది...



–దామెర రాములు
9866422494

## నేటి బతుకు చిత్రం

చిత్ర కారుడికి సైతం
అంతు చిక్కని బతుకు చిత్రం
భిన్న వర్ణాలతో సమ్మిళితమై
ఏ కుంచెకు దొరకని వి చిత్రమాయె

వారసత్వంగా వచ్చే పేదరికం
తరాలు మారినా తలరాత మారలే
ఎన్నికలు ఎన్ని వచ్చినా నేతలు
మారుటే తప్ప వ్యతలు మాత్రం
ఎక్కడ వేసిన గొంగడి అక్కడే

అవకాశం అందుకొని
శిఖరాలు ఎక్కినోడు
తనవారిని ముంచి
తలదన్ని పోతుండు

విడచి పోలేక పేదరికం
దరిద్రంతో జతకట్టి కూలి వాన్ని
చేసి వలస పొమ్మంటుంది
ఆకలి మంటలు రేగి అన్ని మరిపించి
అడుక్కునేవాన్ని చేసింది

బరితెగించినోడి బలుపుకు
బలిఅవుతున్నది పేదవాడు

పనులన్ని ఆగిపోయి పస్తులుంచి
కాని ఊరిలో కంటతడి పెట్టిస్తుంది

అద్దె బతుకుల వలస జీవులు
మాడే కడుపుతో వీడే నగరము
ఎవరికి పట్టని వలస బతుకులు
దారి వెంట రోదిస్తున్నయి

బొబ్బలొచ్చి అడుగులు తడపడుతుంటె
కారే రుధిరం ముద్రలు వేస్తు నడుస్తుంటె
మౌనం మార్గము చూపిస్తుంది

ఎంతకి రాని ఊరు ఇంకా నడవమంటె
సొమ్మసిల్లిన వలసల బతుకులు
దుర్భర బాధను భరిస్తున్న తనువు
తనవారిని చేరే ఆశతో ముందుకు నడిపిస్తుంది.



–బి.సుధాకర్
9849243908

# ఎవ్వరితో నీ సమరం తేల్చుకో ముందుగా..

సెల్ ఫోన్ స్పీకర్ ఆన్ చేసి ఎవరో స్నేహితుడితో మాట్లాడుతూ త్రీ స్టెయిర్ బిల్డింగ్ టెర్రస్ పై నుండి నింపాదిగా మెట్లు దిగుతున్నాడు ఓనర్ రామలింగేశ్వర్ రావ్...

ఇంకెవడ్రా రావాల్సింది.. అయినా ఈలాక్ డవున్ టైం లో ఏం తిరుగుళ్ళురా మీవి.. స్టే హోం స్టే సేఫ్ అనిచెప్పేది మీక్కాదా.. కర్ఫ్యూ టైం కూడా స్టార్టయ్యింది పోలీసులకు దొరికితే మక్కెలిరగతంతారు... అంటూ గ్రౌండ్ ఫ్లోర్లోని తన పోర్షన్ వైపు వెళుతున్నాడు.. సెకండ్ ఫ్లోర్ లో అద్దెకిచ్చిన గదిముందు చెప్పుల జతలు నాలుగే ఉండటంతో ఒకటి, రెండు, మూడు, నాలుగు అని లెక్కేస్తూనే.. అలా అన్నాడు..

ఒక్కడే కదండీ తగ్గిందీ ఎటెళ్ళాడో వచ్చేస్తాడ్లేండి ..దీర్ఘం తీస్తూ అంది వరండాలో ఏదో పనిచేస్తున్న ఆయన భార్య సామ్రాజ్యం . ఒక్కవేలు తగ్గినా చేతికి లోటే కదే.. ఏదో భావంలో అన్నాడు రామలింగేశ్వర్ రావ్ ఆమెను దాటి గదిలోకొస్తూ ..వెళ్తూ వెళ్తూ ఓనర్ అన్న మాటలు గదిలో పడుకున్న నలుగురికి సౌండ్ తగ్గుతూ తగ్గుతూ వినబడగానే వాళ్ళు ఒక్కసారిగా పైకి లేచారు..

గదిలో అప్పటి దాకా వాళ్ళు వివిధ భంగిమల్లో కూర్చొని ఉన్నారు.. అందరూ ఏదో ఆలోచిస్తున్నారు.. గోడకు ఆన్ చేసి ఉన్న టీవీలో కరోనా కామెంట్రీ .. నేలపై పడిఉన్న పేపర్లో మహమ్మారి వార్తలు... వాళ్ళను క్లోజప్ లో ఎస్టాబ్లిష్ చేస్తుండగా అదిగో అప్పుడు వినపడింది తమ ఓనర్ రామలింగేశ్వర్ రావ్ గొంతు..

వాళ్ళందరూ గదినుండి బయటికొచ్చి బాల్కనీలో నిలబడి సిటీవైపు చూస్తుంటే... నిర్మానుష్య రోడ్లు.. దుకాణాలు, బస్టాండ్ రైల్వేస్టేషన్ లు పోలీసుల పెట్రోలింగ్... నైట్ ఎఫెక్ట్ లో కర్ఫ్యూ దృశ్యాలు కనిపిస్తున్నాయ్..

పోలీస్ జీప్ లో సీఐ అనుకుంటా.. వైర్ లెస్ సెట్ లో ఏదో మాట్లాడుతున్నాడు.. కొందరు కానిస్టేబుళ్ళు అడపాదడపా వస్తున్న వాహనాలను ఆపి వివరాలు నోట్ చేసుకుంటున్నారు...

ఓవర్...అంటూ సీఐ తన సంభాషణ ముగిస్తూనే పోనీయ్ అంటూ డ్రైవర్ కు సైగ చేశాడు.. జీప్ ఇంజిన్ స్టార్ట్ చప్పుడు విని రోడ్ పై అడ్డంగా పెట్టిన ఇనుప బారికేడ్ ను కానిస్టేబుల్ జరపగానే సైరన్ సౌండ్ తో ముందుకు దూకింది వెహికిల్ .. జీప్ వెళ్ళిపోగానే ఆ నలుగురు..మెల్లగా ఒకో మెట్టు దిగనారంభించారు..

అలా ఎలా వదిలేసొచ్చార్రా.. ఇదేనా మనిషితనం ఇదేనా మానవత్వం.. ఇదేనా యూత్ బిహేవియర్, అని సీరియస్ గా ప్రశ్నిస్తున్నాడు ఇంటి ఓనర్ రామలింగేశ్వర్ రావ్ తన కాళ్ళు పట్టుకున్న ఆ నలుగురు యువకులను పైకి లేవదీస్తూ.. తప్పయ్యింది బాబాయ్ అని ఒకడు, ఇలా అవుతుందనుకోలేదని మరొకడు ఏవేవో సంజాయిషీలిస్తున్నారు...

తప్పుచేశార్రా అన్నాడు ఇంటి ఓనర్ ఏదో బాధగా.. తప్పు సరిచేసుకుంటాం బాబాయ్ అన్నారు అందరూ అక్కడినుంచి బయల్దేరుతూ..

నాలుగు బైక్ లు సిటీలోని అన్ని ప్రాంతాలను గాలిస్తూ వచ్చి ఒక ప్రాంతానికి చేరుకున్నాయి.. ఏమయ్యిందిరా, కనిపించాడా, మీకూ కనపడలేదా, అంతా వెతికాం ఎక్కడా లేడ్రా...అనేమాటలు వినిపిస్తుండగా.. .సైరన్ మోగిస్తూ పోలీస్ వ్యాన్ వచ్చింది..

ఏయ్ ఎవరు మీరు...ఇక్కడేం చేస్తున్నారు.. వ్యాన్ దిగుతూ గద్దించాడు సీఐ.. రోడ్డు మీద వదిలేసి వెళ్ళాం సార్..ఇప్పుడొచ్చి వెతుక్కుంటున్నాం... అన్నారెవరో వాళ్ళలో.. ఏంటది అని ప్రశ్నించగానే మాతోటివాడ్ని సార్ అన్నాడింకోడు.. ధైర్యం తెచ్చుకుంటూ..

ఇంకా ఏం జరిగిందో అన్నీ చెపుతున్నాడు.. సార్.. మేం అయిదుగురం బీహార్ రాష్ట్రం నుంచి ఇక్కడ ఒకే గదిలో ఉంటూ పనులు చేసుకుంటున్నాం..

ఒకరోజు నేను ఎవరికో ఫోన్ చేస్తుంటే దగ్గు, ఆయాసం జ్వరం లక్షణాలు ఎవరికైనా ఉంటే అటువంటి వారికి కనీసం ఒక మీటరు దూరమైనా ఉండండి అనే కొత్త కాలర్ ట్యూన్ వినపడింది సార్..

అదే సమయంలో జల్ రాం అనే మా స్నేహితుడు ఒకరోజు దగ్గు ఆయాసం , జ్వరం తో బాధ పడుతుంటే అవి కరోనా లక్షణాలని భయపడ్డాం సార్.. అతన్ని మా రూం కి రావొద్దని మేం నలుగురం అతన్నొదిలించుకొని వచ్చేశాం..అంటూ చెప్పటం ముగించాడు..

అదివిని సీఐ దీర్ఘంగా నిట్టూరుస్తూ..

అసహ్యించుకోవాల్సింది, తరిమికొట్టాల్సింది కరోనా వైరస్ ను.. కానీ వ్యాధిసోకిన రోగిని కాదు.. మీరు ఒదిలించుకొని వెళ్ళారు మేం అతన్ని గమనించి ఆసుపత్రికి తరలించాం...అన్నాడు ..

ఆ మాటలు వినగానే ఆ నలుగురి కళ్ళు ఆనందంతో మెరిశాయ్..

సార్...మా వాడ్ని అర్జంట్ గా చూడాలి, మమ్మల్ని క్షమించమని అడగాలి అని ఆతృత పడుతుండగా....

ఇప్పుడు కుదరదు అన్నాడు సీఐ జీపెక్కుతూ.. మరెప్పుడు సార్ అని వాళ్ళడుగుతుంటే.... 28 రోజుల క్వారంటైన్ తర్వాత..అని వినపడుతూ జీపు కదిలింది..

పొగ వదులుతూ ముందుకెళ్ళిన వెహికిల్ ఎందుకో మళ్ళీ వెనక్కొచ్చింది.. జీపులో నుండే సీఐ తల బైటికి పెట్టి హీరోలను అభిమానించటం కాదు మీతోటివారిని ఆదరించండి.. దెన్ యు వుడ్ బీ హీరోస్ అన్నాడు హితబోధచేస్తూ.. ఆమాట వినగానే..ఇప్పుడైతే పోలీస్ ఈజ్ హీరో సార్ అని అందరూ ఆయనకు సెల్యూట్ చేశారు....

మరుసటి రోజు..పేపర్ చదువుతున్న ఇంటి ఓనర్.. ఒరే..మీరు మీ మీ ఊళ్ళకు వెళ్ళేందుకు గవర్నమెంట్ పర్మిషన్ ఇచ్చింది.. మీ చేతుల్లో డబ్బులున్నాయో లేవో ఇదుగో ఇవి ఉంచండి అంటూ కొంత నగదు ఇవ్వబోతుండగా..

వెళ్ళం బాబాయ్.... ఈకరోనా నుంచి మానవత్వ పాఠం నేర్చుకుంటాం... సహాయకార్యక్రమాల్లో పాలుపంచుకుంటాం.. అభాగ్యులకు అండగా ఉంటాం...అంటూ ఒక్కొకరు తమ నిర్ణయం వ్యక్తం చేశారు, అది విని సరేరా ఆపనులకైనా వినియోగించండి అంటూ డబ్బు వాళ్ళ చేతులో పెట్టాడు రామలింగేశ్వర్ రావ్ ....

ఆ డబ్బుతో సొంతూళ్ళకు కాలినడకన వెళుతున్న వలస కూలీలకు అన్న దానాలు, మురికి వాడల్లో పేదలకు కూరగాయల సరఫరా , మాస్కుల పంపిణీ తో పాటు రోడ్లపై పోలీసుల విధుల్లో తమ వంతు సహాయంలో నిమగ్నమయ్యారు ఆ నలుగురు.

కొద్దిరోజుల తరువాత..కరోనా ఐసోలేషన్ నుంచి జల్ రాం నడుచుకుంటూ అతనొస్తుంటే ... ఆ నలుగురు బయట నిలుచోని చప్పట్లు కొడుతూ అతన్ని తమ స్నేహంలోకి తిరిగి స్వాగతించారు..

టెర్రస్ మీద వాకింగ్ చేస్తూ .. ఎవరికో కాల్ కలిపి స్పీకర్ ఆన్ చేశాడు రామలింగేశ్వర్ రావ్... వయస్సు పైబడటంతో చెవులు సరిగా వినపడక ఇలా స్పీకర్ ఆన్ చేసి ఫోన్ మాట్లాడుతుంటాడు...

కానీ గుర్తుంచుకోండి మనం పోరాడాల్సింది వ్యాధితో రోగితో కాదు.. అతని కాల్ వెళ్తున్నట్టు గుర్తుగా సెంట్రల్ గవర్నమెంట్ కాలర్ ట్యూన్ పైకి వినపడుతోంది...

–శ్రీనివాస్ సూఫీ
9346611455

## దుఃఖగీతం పాడుకుంటూ...

అతడెళ్లిపోతున్నాడు
దుఃఖగీతం పాడుకుంటూ
ఏ ఆకలితో వచ్చాడో
ఆ ఆకలితోనే మళ్ళిపోతున్నాడు
ఏ అనిశ్చితి దరిచేరకూడదని
ఇన్నాళ్లూ రెక్కలు ముక్కలు చేసుకున్నాడో
అదే అనిశ్చితితో
అదే ఆవేదనతో వెనుదిరిగి వెళ్లిపోతున్నాడు
అతడిన్నాళ్ళూ
ప్రాణంలేని వట్టి కట్టెగానే
ఇన్నిన్ని అద్భుతాల్ని సృష్టించాడు
ఇప్పుడు
ప్రాణాల్నే ఒడ్డి ప్రయాణాన్ని నెత్తినెత్తుకున్నాడు
రాత్రి పగళ్లను రెండు పాదాలుగా చేసుకుని
ఎండా వానల్ని చేతుల్లా కదిలించుకుంటూ
సాగిపోతున్నాడు
దేన్నైనా వాయిదా వేస్కోడానికి
అలవాటుపడ్డవాడేమో
ఇప్పుడు
ఆకలీ నిద్రల్నీ వాయిదా వేసుకుంటూ
మొరాయిస్తున్న కాళ్ళను బ్రతిమాలుకుంటూ
రేపటి బతుకు కోసం నడుస్తున్నాడు
ఏ మురికిబట్టలతో వచ్చాడో
ఏ ముసురుకున్న భయాలతో వచ్చాడో
వాటినే వెంటేసుకుని వెళ్లిపోతున్నాడు
నిర్దేశించుకున్న గమ్యాన్ని చేరతాడో లేదో
గమనాన్నే నమ్ముకుని సాగుతున్నాడు
అతడ్ని ఆపాలంటే
చూపున్న హృదయమో
హృదయమున్న చూపో కావాలి
ఆ రెండూ ప్రభుత్వాల దగ్గరున్నట్టులేవు
అతడు బాటసారై సాగిపోతూనే వున్నాడు
దుఃఖగీతాన్ని పాడుకుంటూ...



– సాంబమూర్తి లండ
9642732008

## వలస జీవుల బతుకు యాత్ర

కరోనా మాకెందుకీ రోదన
బతుకుదెరువుకోసం పట్నం
పోయినం
పని దొరుకుతుందని ఆశపడినీ
పని ఏమో గాని
ప్రాణం పోయేటట్లు ఉంది.
కంటికి కనపడని కరోనా వచ్చి
పట్నాన్ని పట్టుకుంది.
కరోనా కల్లోలం తో రెక్కలు తెగిన పక్షిలా
మైనం చేద్దామంటే పని లేక
చేతుల్లో డబ్బుల్లేక
మాయదారి క రో నా
మట్టి పెట్టకముందే
పుట్టిన ఊరు పోయి కన్నోళ్ళను
కనులారా చూసేందుకు
మండుటెండలో కాలినడకన
వందల మైళ్ళ దూరం అరిగిన చెప్పులతో
బొబ్బలు వచ్చిన కాళ్ళతో
సుదీర్ఘ బ్రతుకు యాత్ర కొనసాగిస్తున్నారు
వలస కార్మికులు
ఎంత కష్టం ఎంత కష్టం
సంపదకు ప్రతిరూపాలు
ఈ నేల తల్లి ముద్దు బిడ్డ లు
సర్వేజనా సుఖినోభవంతు.
అందరు బాగుండాలి
అందులో మనం ఉండాలి



–పోతుగంటి వీరాచారి
9666693494.

## కరోనా బంధనం

కవులందరికీ
ఓ కరోనా!
నువ్వు కవితా వస్తువయ్యావు!.
నువ్వెంతగా
విజృంభిస్తుంటే
అంతగా నిన్ను
అక్షరవేత్తలు తమ
అక్షరాల్లో బంధిస్తున్నారు!.
కాని,
నీ కరాళ నృత్యాన్ని
మాత్రం
శాస్త్రవేత్తలు ఇంకా
బంధించలేక పోతున్నారు!
ఇది జరిగిన నాడు
ప్రపంచ మానవాళి
ఆనందానికి అవధుల్లేవ్!.



– డా॥ దాశరథుల నర్సయ్య
సెల్: 9390919100

## విజేత

జయించాను కరోనాని!
అవును జయించాను!
విజేతగా తిరిగొచ్చాను!
కరోనా రక్కసికి చిక్కి
చితికిపోయిన నాకు
ప్రాణదాతలై వైద్యులు
ఊపిరి పోసారు
ఆయమ్మలు ఆదుకున్నారు!
మానసిక ధైర్యంతో
మనిషిగా మళ్ళీ జీవించా!
పద్నాలుగు రోజులు
నిర్బంధంలో ఉన్నా
మట్టిలో విత్తులా మళ్ళీ మొలకెత్తా!
కొత్తజన్మలో ఎలా బతకాలో నేర్చుకున్నా!
ఈ కరోనా ఒకరితో వదిలేది కాదని
దీనికి మందే లేదంటే ఏమో!అనుకున్నా!
మందు లేని మహమ్మారితో చేసిన యుద్ధంలో
అంతిమ విజయం నాదే!
కరోనా వచ్చిందని చెబితే
చిన్నతనమని భావించకు సోదరా!
నీ కదలిక వందమంది
ప్రాణాలకు ముప్పని తెలుసుకో!
తప్పించుకుని తిరగకు!
ఒప్పుకుని క్వారెంటిన్ కి తరలిపో!
ప్రాణదాతవై మిగిలిపో!
దేశం కోసం ప్రాణాలొడ్డిన వీరుల
చరిత్రలు గుర్తుతెచ్చుకో!
మనకోసం నిరంతరం శ్రమిస్తున్న
సేవా సమూహాలను స్మరించుకో!
వారి త్యాగాలను మననం చేసుకో!
సమాజశ్రేయస్సుని కాంక్షించు!
కరోనాతో కలత చెందకు!
ఎదిరించి దాని అంతం చూడు!
పోరాడటంలో వీరత్వముంది
గెలుపులో భరోసా ఉంది!
మన సంకల్పం ముందు
వజ్రమైనా బద్దలు కావల్సిందే!
కరోనాని జయిద్దాం!
విజేతలుగా నిలబడదాం!
(కరోనాని ఆత్మస్థైర్యంతో
గెలిచిన నా
సోదరసోదరీమణులకోసం)



–మానాప్రగడ సాహితి
9989370358

## అద్భుత సేవాస్ఫూర్తి సోనూసూద్

కం॥ ధర పాదచారులై చను
నిరుపేదలకండ యగుచు నిలిచిన మూర్తిన్!
తరుగని సేవాస్ఫూర్తిని,
సురుచిర దీప్తిని నుతింతు సోనూసూదున్!

కం॥ నిండుమనంబున తృప్తిగ
తిండియు,బండియు నొసంగి దీనప్రజకున్
బండెడు కష్టమునందున
నండగనిలబడ్డ ధీర!యసలగు "హీరో"!

ఉ॥ గందరగోళమై చెలగు గడ్డుపరిస్థితులందు సాయమై
కొందరికన్నవొచు మరి కొందరికక్కునజేర్చు తండ్రిగా
కొందరికేమొ తమ్ముడిగ,కొందరికీవిల కన్నబిడ్డగా
నిందరినాదుకొన్న ఘనుడీవెగ "సోను"మహాశయా!నమో!

కం॥ సామాజికమాధ్యమముల
సామాన్యుల కష్టమెరిగి సాయంబిడగా
సీమలు దాటిన సేవా
సోముడవీవే గదోయి సోనూభాయీ!

కం॥పేదల కాలెడి కాళ్ళకు
నాదరమొప్పంగ చేయి నాసరనిడుచున్
వేదనలన్ బాపిన నీ
యౌదార్యంబెంతటి ఘనమౌరా "సోనూ"!

మ॥విలనై వెండితెరన్ నటించినను జీవింపంగ హీరోవలెన్
వలసల్ బోయెడి పేదవారికిడుముల్ బాపంగ పెన్ దిక్కువై
యిలుజేర్చన్ శ్రమియించుచున్ దినదినమ్మీరీతి, కూలీల క
న్నులలోకాంతులు నింపు దేవునిగ "సోనూసూదు" వెల్గొందితే!

సీ॥"ఫైవ్ స్టారు" హోటలున్ వైద్యులు బసజేయు
మందిరమ్ముగ నిట్టె మార్చుటనిన!
బస్సులెన్నియొ గూర్చి బడుగుజీవులనెల్ల
గమ్యస్థలికి జేర్చి కాచుటనిన!
నిరతాన్నదానమ్ము నిష్ఠగా సలుపుచున్
దీనులకాకలిన్ దీర్చుటనిన!
గడియించు సొమ్మెల్ల కష్టజీవులకిట్టి
యిడుములన్ బాప వెచ్చించుటనిన!

ఆ.వె॥నిన్నుబోలినట్టి నిజదాతలకుదప్ప
సాధ్యమే యొరులకు? సాధుహృదయ!
అపరదానకర్ణ! అలఘుదయాపూర్ణ!
వందనీయచరిత వందనములు!

(కరోనా కష్టకాలంలో రెండునెలలపైగా నిత్యం 45000 మంది అన్నార్థులకు భోజనమిడి, స్వంత హోటలును కోవిడ్ వైద్యులకు బసగా యిచ్చి, తన స్వంత బస్సులలో ఇప్పటికే దాదాపు 12000 మంది వలసకూలీలను వారి స్వస్థాలలకు జేర్చి రోజుకు 20 గంటలు సంఘసేవలో శ్రమిస్తున్న వెండితెర నటుడు, రియల్ హీరో "శ్రీ సోనూసూద్" కి అభినందన వందన పద్యసుమార్చన)



–ఎస్ సాయిప్రసాద్
9440470774

## కన్నీటి సాక్షిగా..!

ఉరిమి ఉరిమి మంగళం మీద పడ్డట్టు
'కరోనా లాక్డౌన్' విధింపు
మిన్ను విరిగి కోట్లాది కార్మికుల వెన్నుపై
హఠాత్తుగా పడిన పిడుగుపాటు.
స్తంభించిన పనులు, ఆగిపోయిన దేశం.
దేశపు వెన్నుపూసకు నవనాడుల్లా
పట్టణాల ప్రగతికి శ్వాసగా
ఉన్నతికైనా, ఉత్పత్తికైనా
లాభాల వాటా లేని భాగస్వాములుగా
అన్ని అభివృద్ధులకు కారకులు
కోట్ల వలస శ్రామికులు.
పని లేని చోట పస్తులతో ఉండలేక
ఏ రవాణా సౌకర్యాలు లేని పరిస్థితిలో
రహదారులే కాలి బాటలుగా
సొంతూర్లకు పయనం.
కాలే కడుపులతో
కందిపోయి బొబ్బలెత్తిన కాళ్లతో
ఆగని వేల మైళ్ళ ప్రస్థానం.
పాద యాత్రలు కావవి
కన్నీటి సాక్షిగా పాదాల యాతనలు,
కొందరికి పరలోక యాత్రలు.
రక్తసిక్తమైన రహదారులతో
దేశానికి దేశమే కన్నీటి పయనం.
వెనుతిరిగిన పెను వలస వాహినితో
అభివృద్ధికి
తాత్కాలిక విరామమా
దేశ ప్రగతి తిరోగమనమా!?



–ఆచార్య కదారు వీరారెడ్డి
9392447007

## ఎవరే నువ్వు

వికలల విచ్ఛిత్తి మాకేం కొత్తకాదు.
ఎవరే నువ్వు అలా వెక్కిరిస్తున్నావు...?
నేలమీద పడకముందే ధ్వంస రచనల్ని చదివిన వాళ్ళం.
దుఃఖపు పాటని పాడిన వాళ్ళం.
రాక్షస పాదాల కింద నలిగిన వాళ్ళం...!
దుమ్ములో కాలుష్యాన్ని రుచి చూస్తూ మెలికలు తిరుగుతూ
శకలాలుగా విడిపోతున్న వాళ్ళం.
తుదిశ్వాసను ఆహ్వానిస్తూ బ్రతుకుతున్న మనుషులం
మనుషుల గుంపుల్లో ఒంటరై పోయిన వాళ్ళం.

ఇప్పుడు మమ్మల్ని ఏమి అడగకండి.
మాకు ఈ ప్రపంచం అంటే ఏమిటో అర్థం కావాలి.
నీడల నిజరూపాలు కావాలి.
నీ నిజ రూపం రహస్యాలు విప్పక ముందే.
నీ నుంచి వస్తున్న వాసన చీకటిలోకి వెళ్లిపోవాలి.
ప్రకృతి మనిషికి ఎప్పుడూ అర్థం కాని మర్మమే.
ఇప్పటికి మేము జీవించి ఉన్న మనుషులం మాత్రమే...!



–ఏటూరి నాగేంద్రరావు
7416665323.

## కళ్ళు తెరిచాము కరోనా

ప్రకృతిని బాధిస్తే నాశనం తప్పదని మనిషికి
బుద్ధిచెప్పి, కనువిప్పు కలిగించ వస్తివా కరోనా
నిత్యం రణగణ ధ్వనులతోరోడ్లపై కిటకిటలాడే జనం
బుద్ధిగా ఉంటే చూడ ఆశపడి వస్తివా కరోనా
ఏమైనవీ జనజీవన వ్యవహారాలు,
నగరంలో వ్యాపారాలు, ఏమైనవీ విద్యార్థుల చదువులు
ఉద్యోగుల ఆర్భాటాలు, నిరుద్యోగుల పోరాటాలు
శక్తికిమించిన పనులతో సతమతమగుచున్న జీవుడు
ప్రాణాలు దక్కితే చాలనుకునే స్థితిని కలిగిస్తివా కరోనా
ధనము సుఖము కీర్తి కై పడరాని పాట్లు పడుతున్న
తన బిడ్డల ఆవేదన చూసి, కన్నీరుపెడుతున్న
భూమాతను బుజ్జగించి ధైర్యం చెప్ప వస్తివా కరోనా
పుడమి తల్లి ప్రసాదించిన ప్రకృతి సంపదను
సహజంగా స్వీకరిస్తే మనిషి గొప్పతనం ఏముందని
కలిషితం చేస్తున్న మానవుని అహంకారం చూసి
చిన్నబుచ్చుకున్న ప్రకృతిని ఓదార్చ వస్తివా కరోనా
చెరువులు మాయంచేసి నీటికొరత సృష్టించి
వ్యవసాయ భూములను కనుమరుగు చేసి
అన్నదాతల ఆకలి చావులకు కారణమైన
నాగరికుల మూర్ఖత్వాన్ని మందలించ వస్తివాకరోనా
మూగ జీవాలను చంపుకుతినే మనిషి పై పగబట్టి
కంటికి కనిపించని క్రిమివై, జనజీవన ప్రవంతిని అల్లకల్లోలం చేసి,
అంతానాదే అని విర్రవీగిన
ఆధునికుల గర్వాన్ని అణచివేయ వస్తివా కరోనా
యావత్ ప్రపంచాన్ని కలవరపరచి వణికిస్తూ
మానవజాతిని స్వీయనిర్బంధం పాలుచేసి
కాసులతో ఏదైనా కొనవచ్చనే అహంభావంతో
బుద్ధిమందగించిన మానవుని సరిచేయవస్తివా కరోనా
చాలుచాలు కరోనా మాపై కరుణజూపు ఇకనైనా
కళ్ళు తెరిచి బతుకు విలువ తెలుసుకున్నాము కరోనా
సకలప్రాణులపట్ల దయతో మసులుకుంటాము కరోనా
ఇంక చాలు వెళ్లిపో కరోనా వెళ్లి మరల రాకు కరోనా.



– గంజి కళావతి,
8639695507.

## తాపత్రయం

అవయములు శిధిలమై
పట్టుజారి బిగువు సడలి
శిరము నెరియగా
పలువరస రాలుతుండగా
చర్మమంతయు ముడతలు పడగా
చూపు మందగించగా
చేతులు వణుకుతుండగా
కాళ్ళు తడబడుతుండగా
చేతి కర్రనే ఆలవాలంగా
రక్త ప్రసరణ మందగించగా
గత జ్ఞాపకాలు మనస్సును పిండుతుండగా
చేసేదేమి లేక తడబడుతుండగా
పనికిరాని ఈ దేహం బాధిస్తుండగా
ఇంకా బ్రతకాలనుకునే కోర్కె నిండుగా
ఎందుకొచ్చిన తాపత్రయం ?



–డా. పులివర్తి కృష్ణమూర్తి

## లాక్ డౌన్ మెరుపులు

సగంజీతమే వస్తుందని
ఇంట్లోనే ఉంటున్నాము
ఈజీవితం మస్తుందని
అందరితో అంటున్నాము !!

ఏపనులూ లేవుకద
ఎక్కడికీ వెళ్ళలేము
ఇంట్లోనే ఉండాలికద
బయటకేమో వెళ్ళలేము !!

మొత్తానికి కరోనా
భలేభలే చేసింది
ఎవరూ ఏపనైనా
చేయకుండా ఆపింది !!

ఇప్పటిదాకా ఎవరూ
చేయలేనివి చేసింది
కలలోకూడా ఎవరూ
ఊహించనివి చేసింది !!

సినిమాహాళ్ళు లేవు
బారుషాపులు లేవు
షాపింగ్ మాళ్ళు లేవు
సెలూన్లూ లేవు !!

పనిమనుషులు లేరు
ఎవరిపని వారిదే
మనింటికి ఎవరూరారు
మనపని మనదే !!

ఎవరిబట్టలు వారే
ఉతుక్కుంటున్నారు
ఎవరిజుట్టు వారే
కత్తిరించుకుంటున్నారు !!

తిరుపతి దేవాలయాన్ని
మూసేస్తారని విన్నామా
ఎప్పుడైనా ఆవిషయాన్ని
ఎవరితోనైనా అన్నామా !!

గుడ్ ఫ్రైడే దినము
క్రైస్తవ సోదరులకి
ఎంత సుదినము
బలయ్యెను కరోనాకి !!

రంజాన్మాసం మొదలైంది
ముస్లిసోదరుల ప్రార్థనలు
ఎంతసందడిగా ఉండేది
కళతప్పాయి ఆమసీదులు!!



–వి.టి.ఆర్.మోహనరావు
95503 40402.

## వైద్యో నారాయణో హరిః

శ్వేతవర్ణపు కోటు, మెడలో స్టెతస్కోపు,
ఆపాదమస్తకం కొరోనా రక్షణ తొడుగు,
తోడుగా మొక్కవోని ధైర్యం, పట్టుదలతో
కొరోనా బాధితులకు సేవలు జేసేరు ..

స్వీయ, కుటుంబ పరిరక్షణను మించి
వైరస్ బాధితుల రక్షణే మిన్నగానెంచి
రేయీపవలూ నిద్రాహారాలు మానుకుని
అకుంఠిత దీక్షాపరులై బాధ్యతలు నిర్వర్తించేరు ..

బీదాగొప్పా, కులమతాలూ, మంచీచెడూ
తారతమ్యాలెంచక మమైక భావనతో,
మానవసేవే మాధవసేవగా భావించి
కర్తవ్యనిర్వహణాబద్ధులై సపర్యలు చేసేరు ..

మహమ్మారినుండి తమను కాచుకొనుటకై
మాస్కులు, మందులూ, తొడుగులూ
కొదవై అందకున్నా వగచి వెనుకాడక
ప్రజారక్షణే ప్రథమ కర్తవ్యముగా తలంచేరు ..

కొరోనాపై ప్రజకు అవగాహన కల్పించుటకై
అవమాన, అవరోధాలనూ లెక్కజేయక
తమపై జరుగు దాడులను సహనంగా భరిస్తూ
అదరక, బెదురన్నది లేక పరిచర్యలు చేసేరు ..

విశ్వానికి పెను ఆపత్తు సంభవించిన తరుణాన,
తనను తాను మరలా సృజించుకొని మానవాళిని
కాపాడుటకై ఆ దైవమే అవతరించెనాయన్నట్లు
అహర్నిశలూ జనప్రాణరక్షణకై పాటుపడేరు 'వైద్యులు'.



-దినవహి సత్యవతి
9790752180

## వలస కార్మికులు

బ్రతుకు తెరువుకై
బతుకు భారమై
పంటలు పండక
పండించిన దానికి ధర లేక
ప్రకృతి కరుణించక
వికృతిలా మారిన
బ్రతుకు పోరాటం
వలస కూలీల ఆరాటం

ఆకలి కేకలను
చూడలేక
రక్త సంబంధాలను వదిలి
పట్టణాలకు వలస వెళ్లి
బానిస బ్రతుకులుగా మారిన
బ్రతుకు సమరం
వలస కార్మికుల ప్రయాణం

పస్తులున్న రోజులు బరించాం
పాపాత్ముల పాలన చూశాం
పొట్టకూటి కోసం ఎన్నో కష్టాలు పడ్డాం
ఉపవాసాలు ఉన్నాం
ఉపచారాలు చేశాం
బతుకు ప్రగతికి
పిల్లల భవిష్యత్తుకై
బాధలెన్నో భరించాం
కన్నీటిని దాచాం
అమానాల పెట్టెలను
భుజంపై మోసం
నిరంతర శ్రమ జీవన
బతుకు సమరం
వలస కార్మికుల జీవనం



-డాక్టర్ తెలుగు తిరుమలేష్
9908910398

## అజ్ఞాతంలో..

అక్షరాలను హత్తుకుని
ఈ అజ్ఞాత జీవితాన్ని
దాటాలని ఆరాటపడుతున్న స్థితిలో
మిత్రుల గాఢ కరచాలనాలు
ఆత్మీయుల కౌగిలింతలు
మనిషి సజీవ స్పర్శ కరువై
శిలారూప అహల్యల మై
కరోనా శాప విముక్తి కోసం
ఎదిరిచూస్తున్న రోజులివి!
ఎటు చూస్తే అటు
చావుల తేలని లెక్కలతో
రోజు రోజుకూ పెరిగి పోతున్న
మరణ మృదంగ రోదనలతో
భయంగా, భారంగా గడుస్తున్న
కాలం మధ్య కునుకే కరువై
రాని నిద్రలో పీడకలల గగుర్పాట్లతో
ఒంటరిగా ఇంటి కిటికీ ఊచల
సందుల్లోంచి బంధిఖానలా మారిన
బయటి ప్రపంచాన్ని చూస్తున్నా!
చెట్లు ఎప్పటిలాగే చిగురును తొడుక్కుంటూ
పచ్చగా పాడుతున్నట్టు
పక్షులు రెక్కలు విప్పి
ఆకాశ విహారాలు చేస్తూ
మరచిపోని తమ కుహు కుహూ రాగాలు
ఆలపిస్తూనే ఉన్నాయి!
పిల్లగాలులు సుతారంగా
వికసించి విప్పారిన పువ్వుల
చెంపల్ని నిమురుతుంటే
కొమ్మల ఊయలలపై ఊగుతూ
ఊరేగుతూనే ఉన్నాయి!
ఇన్నాళ్లు ఈ అందాల నడుమ
ఉదయపు నడకతో నన్ను నేను
పోగొట్టుకుని పొందిన అనుభూతులను
జన జీవన అందాలను, ఊసులను
ఆనందాలను, కన్నీళ్లను
అక్షరాల్లో నిక్షిప్తం చేసే వాడిని!
తిరిగి అక్షరాల దుప్పటిని దులిపేసి
స్వేచ్ఛగా విహంగమై ఎపుడెపుడు
ఎగరాలనే నిరీక్షణలో వెలుగుల
దిక్కుకు ఆశగాఎదురుచూస్తున్నా!



-డా. కె. దివాకరా చారి
9391018972

# పితృదేవోభవ !

మాతృదేవోభవ ! పితృదేవోభవ !! అంటూ నాన్నకు రెండవ స్థానాన్నే కట్టబెట్టారు.

వాస్తవానికి ఇద్దరిదీ ప్రథమస్థానమే. అమ్మను ఓర్పులో భూదేవితో పోలుస్తారు. కానీ నాన్న హృదయం ఆకాశమంత విశాలమైంది. సముద్రమంత లోతైనది. నింగిలోని సూర్యచంద్రాదులను, కోట్లాది నక్షత్రాలతోబాటు ఉరుములు, పిడుగులు వంటి ప్రకృతి వైపరీత్యాలను. మహాసాగరంలోని బడబాగ్నిని ఉప్పెన,తుఫాను, సునామీ వంటి కుటుంబంలో ఎదురయ్యే మహా విపత్తులను సహితం తనలోనే దాచుకొని పైకి ప్రశాంతంగా కనుపించే నాన్నకు గరళాన్ని కంఠంలోదాచుకొన్న శివుడేకాదు త్రిమూర్తులు సహితం సాటిరారంటే అతిశయోక్తి కాదు.

జీవన పోరాటం చేసే కురుక్షేత్రమనే కుటుంబ యుద్ధంలో సర్వసైన్యాధ్యక్షుడే నాన్న. ఇంటికి దీపం ఇల్లాలే కాని,కుటుంబమనే సామ్రాజ్యానికి మకుటంలేని మహారాజు నాన్న. మహామంత్రి అమ్మ.నాన్న ఒక అడ్మినిస్ట్రేటర్,ఒక గొప్ప ఆర్థిక శాస్త్రవేత్త. వార్షిక బడ్జెట్‌ను తన మనసులోనే తయారుచేసుకోవడం. తన సంతాన సభ్యులను ఎవరెవరిని ఏయే స్థానాలకు ఎంత ఎత్తుకు తీసుకువెళ్ళాలనే పంచవర్ష ప్రణాళికవంటి ప్రణాళికను తనకుతానుగానే తయారు చేసుకొని దాన్ని తూ.చ తప్పకుండా అమలుపరిచే గొప్ప పాలనాధ్యక్షుడు నాన్న.

అమ్మ తన కష్టాన్ని ఇతరులతో పంచుకొని, దుఃఖాన్ని కన్నీటితో కడిగేసుకొని మరు నిమిషంలోనే మరచిపోగలదు.నాన్నకు ఆ అవకాశంకూడాలేదు కష్టాన్ని ఇతరులతో పంచుకొంటే చులకన భావన ఏర్పడుతుందనే ఆత్మగౌరవం బహిరంగంగా ఏడిస్తే కుటుంబపెద్దవు నువ్వే ఇలా దిగులుపడితే పిల్లలంతా ఏమైపోతారు అని ఇతరులు ఇచ్చే సలహాలు ఓదార్పులు తనను మరింత క్రుంగదీస్తాయి. అందుకే తన దుఃఖాన్ని కూడా తనలోనే దాచుకొని పైకిగంభీరంగా నటించే ఏడవడానికికూడా స్వతంత్రం లేని అస్వతంత్రుడు నాన్న.

నాన్న పేరు శ్రీరాములు. అమ్మపేరు వజ్రమ్మ. ఇద్దరూ ప్రభుత్వోద్యోగులే ఉపాధ్యాయవృత్తిలో ఉన్నతస్థానాల్లో ఉన్నవారే.ఒక ప్రక్క ఉద్యోగం మరొక ప్రక్క వ్యవసాయం ఇంకొక ప్రక్క కిరాణా వ్యాపారం.పశుసంపద.ఇవన్నీ అవసరానికి మించి అత్యాశతో చేస్తున్న పనులని నేననుకునేవాడిని ఆనాడు.ఎనమండుగురు సంతానం బంధువర్గంలోని మరోనలుగురు అమ్మానాన్నలతో పదిమందిమేగాక నిరంతరం మరో నలుగురైదుగురి రాకపోకలతో పెద్దకుటుంబమే మాది. ఇంతమందిని పోషించి మంచి భవిష్యత్తునివ్వాలనే ఏకైక ధ్యేయంతో ముందుచూపుతోనే ఇద్దరిజీతాలతో సుఖంగా గడపవలసిన తన జీవితాన్ని నాన్న కష్టాల నిప్పులగుండంలో తనకు తానే ఎందుకు నెట్టుకొంటున్నాడో నాకప్పుడు అర్థం కాలేదు.

ఆయన మమ్మల్ని తన కఠినమైన నిబంధనలతో ఎక్కడికీ కదలనీయకుండా నిర్బంధ ఖైదీల్లా చూస్తున్నాడని మా స్వేచ్ఛను హరిస్తున్న కఠినహృదయుడని అనుకునే వాడిని కాని అది క్రమశిక్షణలో భాగమని ఆనాడు నాకర్థమయ్యేదికాదు.పాఠశాలలో తప్పుచేసినప్పుడు అందరినీ ఒకటికొడితే మమ్మల్ని మరోరెండు ఎక్కువగా కొట్టినప్పుడు మాపై ఆయనకు పగ ద్వేషం అనుకున్నానేగాని అదే మాపట్ల ఆయనకున్న ప్రేమకు పరాకాష్టఅని ఆ వయసులో నాకర్థమయ్యేదికాదు. ఎనభైశాతం మార్కులు సాధించినా ఇంకా ఇరవై శాతం ఏమయ్యాయని కోపంగా చూసినప్పుడు ఈయన మా అభివృద్ధికి సంతోషించేవాడు కాదు అనుకొనే వాడిని. ఎప్పుడు చూసినా నాన్ననాకళ్ళకు నిరంకుశుడుగానే కన్పించేవాడు.

ఆయన ఇంట్లోఉన్నా వీధిలోకి వెళ్ళినా వంగివంగి దండాలు, చేతులెత్తి నమస్కారాలు, పలకరింపులు. అన్నిరకాల సమస్యల పరిష్కారాలకు నాన్న దగ్గరకుఇంటికి వచ్చేవారు.ఎక్కడికైనా బయలుదేరి వెళుంటే ఎందాక మాష్టారూ అని పలకరించని వారుఉండేవారుకాదు .ఏమిటీ వీళ్ళఅమాయకత్వం ఈయన అసలు స్వభావం తెలియక అంతా ఈయనను అనవసరంగా గౌరవిస్తున్నారు ఈయనలోని రెండుముఖాలు ఎవరికీ అర్థంకావు అమాయకులు అని అమాయకంగా అనుకునే వాడిని.అమాయకులు వాళ్ళుకాదుఅసలైన అమాయకుణ్ణి నేనేనని చాలా ఆలస్యంగా అర్థమయ్యిందినాకు.

నాన్న క్రమశిక్షణ కట్టుబాట్లు నా స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నాయని భావించిన నేను ఇంటినుండి బయటకు వెళ్ళి స్వతంత్రంగా జీవించాలని అనుకున్నాను. అప్పుడేనాకు ఎస్ఎస్ఎల్‌సి పూర్తయ్యింది.తిన్నగా వెళ్ళినాన్నతోనే చెప్పాను నేను బయటికి వెళ్ళి స్వతంత్రంగా బ్రతకాలనుకుంటున్నాను. ఈ క్షణమే ఇంటినుండి బయటికి వెళ్లిపోతు న్నాను అని చెప్పాను.మంచిది జాగ్రత్త ! అని చెప్పారు అంతేగాని ఎందుకు ఏమిటి అని ఒక్కమాట కూడా నన్ను అడగలేదు. ఆగమని చెప్పలేదు.నాన్న మీద ఉన్నకోపం కట్టలు తెంచుకుంది.బయటికి వచ్చేశాను .

ఇంగ్లీషు గ్రామర్ మీదనాకు పట్టుఉందనే నమ్మకం నాకు గట్టిగానే ఉంది అందుకే ఇంగ్లీష్ గ్రామర్ కోచింగ్ సెంటర్ ప్రారంభించాను ఉదయం ఒకగంట.నాకున్న అభిరుచులప్రకారం నాటకాలలో వేషాలు వేయడం కవిత్వం వ్రాయడం .అతితక్కువ కాలంలోనే కోచింగ్ సెంటర్ లో సంఖ్య పెరిగింది.దాంతో నాచదువుమీద దృష్టిపెట్టాను

ఆంధ్రాయూనివర్శిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌ద్వారా మూడు పీజీలు రెండు డిప్లొమాలు స్లెట్ పిహెడి వంటి డిగ్రీలనెన్నింటినో సాధించాను ఇదంతా నాన్న సహకారంలేకుండా నాకునేనుగా సాధించానని సంబరపడిపోయాను. పెళ్ళికూడా నాకు నేనుగానే చేసుకున్నాను .అప్పుడప్పుడూ ఇంటికివెళ్ళి నాన్నముందు నాకు నేనుగా ఇవన్నీ సాధించానని రొమ్ము విరుచుకొని.తలెత్తుకొని చెప్పేవాడిని కానీ నేను చేస్తున్న తప్పేమిటో నేను అప్పుడు గుర్తించలేకపోయాను.

నాతమ్ముళ్ళందరూ నాన్న పర్యవేక్షణలోఉండడం వల్ల దిశానిర్దేశం చేయడంవల్లవాళ్ళంతా కేవలం డిగ్రీతోనే ప్రభుత్వోద్యోగులుగా స్థిరపడ్డారు. నన్నునడిపించి సలహాయిచ్చి గమ్యాన్ని సూచించే తండ్రి పర్యవేక్షణలో లేనందువల్ల నేనిప్పటికీ ప్రభుత్వోద్యోగిని కాలేకపోయాను. అప్పుడే నాకర్థమయ్యింది.తండ్రి పెట్టే ఆంక్షలు కట్టుబాట్లు క్రమశిక్షణ

పిల్లల భవిష్యత్తుకేనని పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి నాన్న పడే తపన ఆవేదనవెలకట్టలేనిదని ఉడుకురక్తంలో ఉన్నప్పుడు ఆవేశంతో మనలో నాలాంటి వాళ్ళు అర్థం చేసుకోలేక జీవితంలో స్థిరపడలేకపోతున్నారని ఆలస్యంగా తెలుసుకున్నాను.

నాన్న ఉద్యోగవిరమణ చేసినతర్వాత నాదగ్గరకొచ్చి కొన్నిరోజులు ఉన్నారు ఆయన ఫెన్షన్‌డబ్బులతో ఇంకా నాకోసం ఖర్చుపెట్టడంచూసి నేను ఆశ్చర్యపోయాను.

నాన్నప్రేమ అంటే ఇదికదా అనిపించింది. ఇంతప్రేమున్ననాన్న నేను బయటికి వెళ్ళిపోతున్నానన్నప్పుడు ఎందుకు ఆపలేదని అమ్మనడిగాను. అప్పుడు అమ్మచెప్పింది. నీవు బయటికి వెళ్ళినా బ్రతకగలవు మిగినవాళ్ళు ఇల్లు విడిచిపెడితే బ్రతకలేరు అందుకే అని చెప్పారని అమ్మనాతో చెప్పినప్పుడు నామీద నాన్నకు ఎంతనమ్మకమో విని కళ్ళు చెమ్మగిల్లాయి.

ఇప్పటికీ నాజీవితాన్నివెనక్కు తిరిగిచూస్తే నేను చేసిన దిద్దుకోలేని తప్పేమిటో అర్థమవుతుంది.అప్పుడు నేను ఒక ప్రైవేట్ కాలేజీ ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్నాను.డిగ్రీ అయినతర్వాత బిఇడి చేయాలనిపించలేదు కేవలం లెక్చరర్ కావాలనుకున్నాను నాన్న పర్యవేక్షణలో ఉంటే బిఈడి చెయ్యమని సలహాఇచ్చిఉండేవారు. తెలుగుపండిట్ ఎంట్రన్స్ వ్రాశాను 2 వ ర్యాంక్ వచ్చింది సలహాఇచ్చేవాళ్ళులేరు నాన్న పర్యవేక్షణలో ఉంటే ట్రైనింగ్ కు వెళ్ళమనేవారు ఉద్యోగంలో స్థిరపడిఉండేవాణ్ణి. ఇవన్నీ గతజలసేతు బంధనంవంటివే.

నాన్నకు నాజీవితంలో తృప్తిని కలిగించిన సన్నివేశం ఒకటి నాకు మధుర జ్ఞాపకంగా మిగిలిపోయింది. కవిగా నాకు భీష్మఏకాదశి కమిటీవారు పౌరసన్మానం చేయాలని నిశ్చయించి నా ఇంటిద్గరనుండి వేదికవద్దకు సుమారు రెండు కిలో మీటర్ల దూరం కారులో ఊరేగింపుగా తీసుకెళ్ళారు కారులో మానాన్న గారు రెండు సంవత్సరాల నాకొడుకు ఉన్నాము. సగంమంది కళాకారులు నా ఇంటినుండి ఊరేగింపులో పాల్గొంటే సగంమంది మద్యలో ఎదురుకోలుగావచ్చి వేదికవద్దకు దీపావళి మందుగుండు కాలుస్తూ తీసుకువెళ్ళారు సుమారు మూడుగంటలపాటు జరిగిన పౌరసన్మానంచూసి గర్వంతో ఆనందభాష్పాలు రాల్చిన నాన్న ముఖంలోని ఆనందాన్ని చూసి నాజీవితానికిదిచాలు అని తృప్తిపడ్డాను. అప్పుడు నాన్నకళ్ళల్లోని ఆనందం నా మాటలతో వర్ణించలేను.

పరిషత్ నాటకపోటీలకు ఒక నాటకంవ్రాయాల్సిందిగా ఏలూరులో ఒకనాటక సమాజంవారు మూడురోజులకు లాడ్జిలో ఒకరూంబుక్‌చేశారు తెల్లవార్లు వ్రాసి తెల్లవారు జామున రూమ్‌లాక్‌చేసి కీ కౌంటర్‌లోఅప్పగించిఅలా నడుచుకొంటూ బస్టాండ్ వరకు వచ్చాను జంగారెడ్డిగూడెం ఫస్టు బస్సు సిద్ధంగా ఉంది.యధాలాపంగానే బస్సుఎక్కి జంగారెడ్డిగూడెం వచ్చాను బసుస్టాండులో మాతమ్ముడు కొబ్బరిబొండాం కొంటున్నాడు నన్నుచూసి నాన్నకు బాగుండలేదు రా ఇంటికెళ్దాం అని బైక్‌మీద తీసుకెళ్ళాడు నన్నుచూసి నాన్న లేచికూర్చుని నన్ను దగ్గర కూర్చోబెట్టుకున్నాడు కొబ్బరిబొండాం నేనే నాన్నకు తాగించాను.కొద్దిసేపైనతర్వాత నేను ఇంటికి వెళ్ళి స్నానం చేసివస్తానని ఇంటికి వెళ్ళి స్నానంచేయడానికి సిద్ధమౌతున్నాను నావెనుకనే బైక్‌మీదవచ్చి నాన్న పోయారు అని చెప్పాడు అప్పుడు నాకు దుఃఖం ఆగలేదు. నేను పోరుగూరులో నాలుగురోజులవరకు రాకుండా పనిమీద వెళ్ళినవాణ్ణి అర్థంతరంగా రావడమేమిటి తమ్ముడు కొనితెచ్చిన కొబ్బరి బొండాం నేను పట్టించడమేమిటి ? చివరిగా నాన్ననాతోనే మాట్లాడారుఅంతా విచిత్రంగా జరిగిపోయింది. ఋణానుబంధం అంటే అదేకాబోలు నాన్నతో నాబాల్యమంతా ఒక్కసారిగా నాకళ్ళముందు కదలాడింది.

నాన్న ప్రేమను అర్థంచేసుకోలేని నావంటివాళ్ళందరికీ నా అనుభవాన్ని పంచుతున్నాను.నాన్న చూపుడువేలే మనకు దిశానిర్దేశనం చేస్తుంది. దానికి దూరమైతే ఏమౌతుందో అందుకు నేనే ఉదాహరణ.

సీ॥ తా జయించగవలె ధరణినంతయు గాని తనయుని చేతిలో తనివితీర
యోటమిన్ గాంక్షించి యుత్సహించెడునట్టి తలపుగల్గునెవరు?తండ్రిగాక
కొసరి యూసడిగినా కసరితిట్టినగాని తండ్రిమాటల నమృతమ్మె గురియు
కోపతాపాలందు కొండంత ప్రేమయే గోరంత ద్వేషపు గుణములేదు
ఆ॥వె॥ తనకు ఎత్తుబెరిగి దలపు వక్రించినా
తలను నిమిరి తండ్రి తప్పుదిద్దు
తండ్రికన్న వేరు దైవమింకెవ్వండు ?
వందనంబు తండ్రి వందనంబు !



-డా ॥ పూసల రజనీగంగాధర్
9290680605

## నేనూ-నాన్న

నేను నాన్న రక్తాన్ని.. అందుకే
ఎందరికో పట్టుదల గలవాణ్ణి
కొందరికి మొండిఘటాన్ని అయ్యాను
నేను నాన్న స్వేదాన్ని..అందుకే
నా దగ్గరనిన్నటి శ్రమ స్వేదపు
సుగంధం గుబాళిస్తుంది.
నేను నానన్నపౌరుషాన్ని
ఉన్నంత కాలం తలెత్తుకొని జీవించాడు
నన్నూ అలాగే జీవించమన్నాడు
నేను నాన్న నోటి కాడి ముద్దను
తాను తినబోయే ముద్దను నాకందించి
నేను తింటే తాను తిన్నట్లే సంతోషించాడు
ఇప్పుడు నేను తినే, తినిపించే ప్రతిముద్దా ఆయనభిక్షే
ఎంత సరదాగా తిరిగాడో నాన్న
ఎంత దొరలాగా బతికాడో నాన్న
నాయనమ్మ తినిపించిన వెన్నెల ముద్దులు
తాతయ్య వినిపించిన బుద్దుల సుద్దులు జీర్ణమై
నాన్న నునులేత కంధకాల మీద భారంపడిన తర్వాత
ఊళ్లోయిల్లు,ఊరవతల పొలం,ఆఫీసులో ఉద్యోగంలేక
మా 'నోళ్లల్లోకి ఐదు వేళ్లూ పోవడం' కోసం
తననుతానే గానుగ మారలో వేసుకొని తనతైలాన్ని
తానే పొండుకొని సొమ్ముగా మార్చి మా అవసరాలన్నీ
తీర్చి రోజు రోజుకూ హరించుకొని పోయాడు
కడుపు ఆయగట్టుకొని కన్నవాళ్లకోసం కరిగిపోయాడు.
నాగుబిలో సేదతీర్చుకొనాన్నా.. అనబోయేలోగానే
విరిగిన రెక్కలతో కనరానిలో కాలకు
ఎగిరిపోయాడు. ఆసుపత్రి పడకమీదనే ఒరిగిపోయాడు.
నాన్నకు మరణం లేదు
నాన్నలేని నాకు జీవం లేదు
నాన్న కొండంత అండ
నాన్నలేని జీవితం ముదరెండ
నేనిప్పుడు మాన్యుణ్ణీకాదు, సామాన్యుణ్ణీ కాదు
నాన్న రక్షణలో ఉన్న నా శైశవాన్ని
తలచుకుంటూ బ్రతికే కదులుతున్న శవాన్ని!!
నాన్న అపురూపంగా ప్రేమించిన అమ్మకు
ఇప్పుడు తొంభైఏళ్ళు అమ్మకు అసరాగాఉంటూ
అమ్మ కళ్లలో మెరుస్తున్న నాన్నను చూసుకుంటూ
'యధావిధి'గా కాకుండా ఏదో 'విధి'గా
బ్రతుకుతున్న వాణ్ణి!!
కం॥ కోటయ్య నాదుజనకుడు
కోటీశ్వరుడు కాదుగాని కూరిమితోడన్
మేటిగ-నే-రాశించెడి
బాటను నిర్మించి పెంచె శైశల్యంబున్!!

-రాధశ్రీ
సెల్: 9494481210

# అందరివాడు మా నాన్నగారు



"నీ నిద్దుర వీడుము ఇంద్రా
ధీరుడు సమయపాలన యందు
ధరణిని దిద్ది దివికి వచ్చుచున్నాడు ద్వా.నా
కలము విమర్శనా ఖడ్గమైన విరించిగాన్"

మా నాన్నగారి మరణవార్త విని మా నాన్నగారి శిష్యుడు, నా మిత్రుడు గంటి శ్రీరామ ప్రకాష్ పంపిన సందేశం ఇది. ద్వా.నా. శాస్త్రి గా తెలుగు సాహితీ వినీలాకాశంలో ధృవతారగా నిలిచిన ద్వాదశి నాగేశ్వర శాస్త్రి, 1948లో కృష్ణాజిల్లా లింగాల గ్రామంలో కీర్తిశేషులు కృష్ణశాస్త్రి, లక్ష్మీప్రసన్నగార్ల మధ్యముడిగా జన్మించి, బండ్లమూడి సత్యనారాయణగారు, ఆచార్య దోణప్పగారు, చేరా మాస్టార్ల వద్ద శిష్యరికం చేసి 1971లో తన సాహితీ ప్రస్థానం ప్రారంభించి, 1972లో అమలాపురం శ్రీ కోనసీమ భానోజీరామర్స్ కళాశాలలో అధ్యాపకునిగా చేరి 2005 లో స్వచ్ఛంద పదవీవిరమణ చేసి భాగ్య నగారానికి చేరుకొని 'ఇంతింతై వటుడింతై' ఆఖరిక్షణం వరకు అక్షరమే శ్వాసగా జీవించిన మా నాన్నగారి గురించి నా మిత్రుడు అలా నాలుగు వాక్యాలలో వివరించాడు.

కవిగా, సమీక్షకునిగా, అధ్యాపకునిగా, పోటీ పరీక్షల భోధకునిగా, పరిశోధకునిగా బహుముఖీయమైన ప్రజ్ఞశాలి మా నాన్నగారు.

ద్వా.నా సమీక్షకునిగా ఏ ఒక్క భావజాలానికి నిబద్ధుడుకాడు.

భావాలకి మాత్రమే నిబద్ధుడు. ప్రాచీన, నవీన సాహిత్యాల పట్ల సమదృష్టితో ఉంటారు. రచనకి తప్ప, రచయితని చూసి ఎప్పుడూ సమీక్ష చేయకపోవడం ఆయన్ని సమీక్షకులలో అగ్రస్థానంలో నిలబెట్టింది అన్న అద్దేపలి రామ్మోహనరావుగారికి వ్యాఖ్య సమీక్షకునిగా నాన్నగారి ప్రత్యేక రుజువు చేస్తోంది.

అధ్యాపకునిగా కూడా ఎంతో మంది శిష్యులతో ఆత్మవిశ్వాసాన్ని నింపి, కేవలం పాఠాలే కాకుండా వారి ప్రతిభా పాటవాలని ప్రోత్సహించి, వెలికి తీసి ఉత్తమ అధ్యాపకునిగా నిలిచారు.

అయితే పరిశోధకుని గా నాన్నగార కృషి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. 1993 లో ఆయన సేకరించిన 'అక్షరచిత్రాలు' అందుకు ఒక నిదర్శనం, ఇప్పటికీ ఇంటర్‌నెట్‌లో లభ్యంకాని అపురూప సాహితీ వేత్తల చిత్రాలు సేకరణ ఆ పుస్తకం.

అలాగే జాషువా అసలు హృదయాన్ని ఆవిష్కరించి, ఆయన ఏ కొందరివాడు కాదు, అందరివాడు అని, విశ్వనరుడు అని నిరూపించారు. తొలిదళితకవి కుసుమ ధర్మన్నకవిగా పరిచయం అయినది నాన్నగారి వ్యాసంతోనే అన్నది నిర్వివాదాంశం.

M.Phil. సిద్ధాంతగ్రంథం 'మారేపల్లి రామచంద్ర శాస్త్రిగారి కవితా సమీక్ష' కూడా నాన్నగారి పరిశోధనా పటిమకి, శ్రమకి నిదర్శనం ఏదో మొక్కుబడిగా సిద్ధాంతం గ్రంథాన్ని సమర్పించకుండా తెలుగు సాహిత్యానికి సర్వసం ధారపోసి 'కవిగారు' గా లబ్ధ ప్రతిష్ఠులైన మారేపల్లి వారిని పరిచయం చేసి ఆ కష్టాన్ని శ్రమని మరచిపోయారు.

కిన్నెర పబ్లికేషన్స్ తరపున ప్రచురించిన 'మా నాన్నగారు' 'తెలుగు సాహిత్యంలో హాస్యామృతం' నాన్నగారి విభిన్న దృక్కోణాన్ని ఆవిష్కరిస్తాయి.

ఇవన్నీ ఎందుకు ఉటంకిస్తున్నానంటే తెలుగు సాహిత్యానికి, తమ వంతు కృషి చేసిన వారిని వెలుగులోకి తేవాలనే తపనే తపస్సులా భావించిన శ్రమజీవి మా నాన్నగారు.

ఈ నాటి యువతరాని అర్థం అయ్యేలా, చదవడానికి ఆసక్తి కలిగించేలా పోటీ పరీక్షల అభ్యర్థుల విజయానికి కరదీపికలా, ఇప్పటికీ 12 ముద్రాణలు పూర్తి చేసుకొని నాన్నగారి కృషికి గుర్తింపు తీసుకువచ్చిన 'తెలుగు సాహిత్య చరిత్ర' చరిత్ర సృష్ఠించింది.

12 గంటల నిర్విరామప్రసంగం, పలకరిస్తే ప్రసంగం, అరవై సంవత్సరాల ఉత్సవం – ఇవన్నీ మరపురాని సన్నివేశాలు, తెలుగు నట్టింట్లో పండుగలు తనను తాను కొత్తగా ఆవిష్కరించుకోవడం, తెలుగు భాషని మరింత మందికి దగ్గర చేయలి అన్న ఆలోచనలోంచి వచ్చినవే ఈ నూత్న ఆవిష్కరణలు

– సమకాలీన రచయితలలో మీరు విశిష్ఠస్థానాన్ని సంపాదించారని గౌ॥ పొత్తూరి వెంకటేశ్వరరావు గారు మెచ్చుకున్నా

– సామాన్య జనానికి తెలియని సారస్వతి ప్రపంచపు సంగతులలో ప్రేరణాత్మకంగా మీ రచనలు ఉంటాయని గౌ॥ మండలి బుద్ధప్రసాద్‌గారు అభినందించినా

– ద్వానా భాషా నిపుణతకు ప్రసంగ కరణచణతకు నా హార్థిక అభివందనలు అని డా. సి.నారె గారు దీవించినా

మా నాన్నగారి కృషికి, తెలుగుభాషాభిమానానికి, ఆత్మ విశ్వాసానికి లభించిన పురస్కారాలే కదా !

– ఎన్నో అవార్డుల నాన్నగారి కృషిని గుర్తించాయి – అందులో వంగూరి ఫౌండేషన్ పురస్కారం, కిన్నెర సత్కారం, రాష్ట్ర ప్రభుత్వం గురజాడ పురస్కారం తెలుగు భాషా సాహితీ పురస్కారం, సింగపూర్ లో జీవిత సాఫల్య పురస్కారాలతో పాటు శ్రీ గణపతి సచ్చిదానందస్వామి, సద్గురు శివానందమూర్తి గార్ల ఆశీఃపూర్వక సత్కారాలు నాన్నగారికి సంపూర్ణ గురుకృపకి నిదర్శనం.

చివరగా నాన్నగారి శిష్యులు మీ విదేశీయాత్ర అనుభవాలు చెప్పండి అంటే – అమెరికా, లండన్, జపాన్, సింగపూర్ చూసావా అనికాదు. నీవు పుట్టిన దేశపు ఔన్నత్యాన్ని చూసావా అన్నదే నా అనుభవం అన్నారు.

– తన మాతృభాష పట్ల అపరిమితమైన ప్రేమ, నిరంతరం భాషకోసం శ్రమించడం

– నిక్కచిగా, నిర్మోహమాటంగా మాట్లాడే భోళాతనం

– తరతమ ప్రాంతీయ భేదాలు లేకుండా అందరితో కలసిపోవడం

– ఈ త్రివేణి సంగమమే ద్వా – నా – శాస్త్రి.

(జూన్ 15 ద్వా.నా. శాస్త్రి జయంతి సందర్భంగా...)



-ద్వాదశి శశికాంత్
9841004314

## కరోనా ఓ మహమ్మారి..!

ఓ మహమ్మారి కరోనా.. కరోనా..నీది ఏ వూరే కరోనా
ఎక్కడ పుట్టినావు కరోనా..ఎక్కడ పెరిగినావు కరోనా
నీకు నీతి, జాతి లేదా,, ఎంతటి మహమ్మారికనే కరోనా
ఎంత కసాయి దానివే..ఎంతఘటికురాలివే కరోనా కరోనా
ఏ పాపం ఎరుగని వారికి వేశావు శిక్ష
అన్యం, పుణ్యం తెలియదు వారికి ఏమిటి ఈ శాపం?
ప్రపంచ దేశాల్ని వణికిస్తున్నావు ఎంత మహమ్మారివే నీవు
కోట్ల జనాభా రక్తం త్రాగావు నీ ఆకలి చల్లారదా ఓ కరోనా
పనులు లేక తిండిలేక నీరులేక
జనం అల్లాడుతుంటే ఏమిటి ఈ ఘోరం కరోనా
తల్లికి పిల్లకి పిల్లకి తల్లికి
భార్యకు భర్తకు, భర్తకు భార్యకు
ఎవరిని ఎవరికి కాకుండా తీసుకుపోతున్నావు
నీవు ఎక్కడ వున్నావని చెప్పాలి
గాలిలో వుంటే కాల్చేస్తారు
మట్టిలో వుంటే మందు వేస్తారు
చీకట్లో వుంటే చిదిమేస్తారు
వెన్నెల్లో వుంటే వెంటాడి చంపేస్తారు కరోనా
ప్రపంచ జనాభా మొత్తం కలిసి
నిన్ను పీల్చి చెండాడి మసి చేస్తారు
అంతిమ విజయం మాదే అని
చెప్పే రోజు దగ్గరలోనే వుంది
అప్పుడే ప్రపంచానికి శాంతి శాంతి ప్రశాంతి
ఆ రోజే కరోనా పండుగ చేసుకుంటాము
కబడ్దార్ కరోనా కబడ్దార్ కరోనా
కరోనా కబడ్దార్ కరోనా..

-జంపాల గుణసుందరి
సెల్: 9494262794

## బాధ్యతగా నడుచుకో

తుమ్మితే వచ్చే తుంపర్లు
మన బతుకు పాలిట శాపాలు
దగ్గుతే దద్దరిల్లితున్నాయి
భూగోళాలు..
చేయి చేయి కలపకు
రోగాన్ని కొని తెచ్చుకోకు.
ప్రపంచానికి సంస్కారం నేర్పింది
మన నమస్కారం.
ఇపుడు నమస్కారమే
మన ఆరోగ్యానికి సంస్కారం.
ప్రపంచ దేశాలకు పెద్దనై ...
వైద్యసహాయం చేస్తుంటే. స్విజెర్లాండ్
మెటర్న్ హార్న్ పర్వత శిఖరం పై
నా భారత జాతి త్రివర్ణ పతాక
...రెపరెపలు......
ఇది తెలుపుతుంది విజయానికి
సంకేతాలు...
కోవిడ్ 19పై కలిసి కట్టుగా పోరాటం
ఇపుడు నా భారత దేశం అవుతుంది
ప్రపంచ దేశాలకు ఆదర్శం.
మిత్రులారా....
గాలిలో తిరుగుతుంది వైరస్
ముఖానికి మాస్క్ వేసుకోకుంటే
మన బతుకు అవుతుంది మైనస్..
ప్రపంచం కరోనా కబంధ హస్తాల్లో
చిక్కుకోని ఉంది.
బతకాలని ఆశ బలంగా ఉంది..
గుండె నిబ్బరం చెసుకొని
గూటిలోనే ఉండిపోండి..
అజాగ్రత్తగా ఉండి కోవిడ్ ని
కొనితెచ్చుకోకండి.
బాధ్యతగల దేశ పౌరుడుగా
మసులుకో..
కరోనాను అంతం చేయడానికి
ప్రతిన పూనుకో..
నిశ్శబ్ద యుద్ధంలో అందరం
పాత్రదారులై పోరాడుదాం..
కరోనాను అంతం చేద్దాం...



-అశోక్ గోనె
.9441317361

## నేల విడచి సామేల...?

ఈ.....నేల చల్లనిది
ప్రాణులకే.... పెన్నిది
సహనం ఎంతో కలిగి
జీవం పోస్తు... ఉంది

నింగితో స్నేహం.. చేసి..
మేఘాలను చూసి మురిసి
రాగాలెన్నో.... పలికించి
పచ్చదనంతో....నవ్వేసి

ఆడు పాడుతు తిరిగే
జీవుల మనసును ఎరిగే
చల్లని తల్లీ వడిలో....
బిడ్డలు హాయిగ పెరిగే

పెరిగిన బిడ్డలు నేడు
చేసిరి ఎంతో ..కీడు
ఎడారిగ మార్చి చూపి
వికాసమంటున్నాడు..

విజ్ఞానము పెరిగి పోయి
మానవతా తరగి పోయి
ఎవరికెవరు కానట్లు....
మనిషి తీరు మారి పోయె

సహజత్వం విడచి పెట్టి
పశుతత్వమును చేపట్టి
పసిమొగ్గల నలుపుచుండె
మంచి తనం విడచి పెట్టి

ఇంటి వంట మరుస్తుండు
ఫాస్టు ఫుడ్డు మెచ్చుతుండు
ఆరోగ్యం పాడు కాగా
ఆసుపత్రి. వెళ్ళుచుండు

పెద్దలంటె చులకనాయె
హద్దులన్ని దాటిపోయె
సరిహద్దులు దాటు కుంటు
రెచ్చ గొట్టి చచ్చుడాయె

చేతి పనులు మరుస్తుండు
యంత్రాలను పెంచుతుండు
నియంత్రను కోల్పోయి...
యంత్రమల్లె మారుతుండు

ఏమి బతుకు మనిషిదాయె
భయముతోని గడుపుడాయె
కనిపించని రోగాలకు ...
బలి అవుతు చచ్చుడాయె

నేల తల్లి దీవెనలు
అందుకొనే మానవులు
ఎల్లప్పుడు హాయిగా
బతికు పుణ్యాత్ములు

-బి.సుధాకర్
9849243908

## హాలాహల గళధారి

'నా' అనే స్వార్థంతో అమృతం కోసమై దేవదానవులు సలిపిన పోరులో
పాలసముద్రాన్ని మధిస్తుంటే బయటపడింది ఒక భీకర గరళం
దానిని నీలకంఠుడు గరళంలో నింపుకున్నా,
గాలిలో వ్యాపించిన దాని తుంపరలు మాత్రం
నాటి నుంచీ నేటి వరకూ దాని ప్రతాపాన్ని వెలువరిస్తూనే ఉన్నాయి.

నేడది విశ్వరూపం దాల్చిందేమో
కుతంత్రాలు పన్నే మనుష్యుల మేధను ఆసరాగా చేసుకుని
గబ్బిలాల కంపుతో గాలిలోకి లేచింది
ఆ వాడ... ఈ వాడ... ఏ వాడ అని లేకుండా
దేశ దేశాలు తిరుగుతూ... తిరుగుతూ
తనదైన ఒరవడిలో మారణహోమాలు చేస్తూ
కల్లోలం రేపుతూ ప్రపంచాన్ని ఒక్కటిగా కట్టేసింది
హాహాకారాలలో తన ఆనందాన్ని వెదుకుతోంది

కానీ ప్రేమమయమైన ఈశ్వర తత్వం మాత్రం
ఆనాడే కాదు, ఈనాడూ ఆ గరళం బారి నుండి
మానవాళిని కాపాడే కర్తవ్యంలోనే ఉన్నది
ఇంటిపట్టున ఉండి, తన రక్షాకవచంలోనికి రమ్మన్నది
తనవారితో కలిసి సౌఖ్యంగా, కాలం గడపమన్నది
తనకోసం సైనికులుగా పాటు పడుతున్న వైద్యుల, రక్షక భటుల
పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తు చేసుకుంటూ
వారికి తిరిగి తీర్చాల్సిన ఋణం ఒక్కటేనని నొక్కి నొక్కి చెప్పింది
అదే స్వీయ నియంత్రణం... స్వయం గృహ నిర్బంధం!
ఈ ఒక్కటీ చేస్తే చాలదా,
కరాళ నృత్యపు కరోనా రాక్షసి కనుమరుగై పారిపోవటానికి!.



-సుజాత తిమ్మన.
9391341029

## మనిషి మనీషిగా సాగిపో

గర్వం విర్రవీగినప్పుడు
పైత్యం తలకెక్కినప్పుడు
ఏదో ఒక ఉపద్రవం
తరుముతూనే వుంటది.
సాగరం అంతుచూశానని
రోదసి ఒళ్ళు తాకానని
టెలిస్కోపు కళ్ళతో విశ్వాన్నే పరికించానని.
చెప్పుకున్న నువ్వు
ఎన్ని గొప్పలు చూపావు?
ఇప్పుడర్థమైందా?
ఇక్కడ నువ్వెంతని!.
పెంచుకున్న ధనం కుప్పలుగా మూలుగుతున్నది
ఆకాశ హర్మ్యాలు కునికిపాట్లు పడుతున్నాయి.
సుదూర తీరాలకు విస్తరించిన
నీ సామ్రాజ్య పునాదులు
ఒక్కటొక్కటిగా తిరుగుప్రయాణమైనాయి.
నువ్వు కోట్లకధిపతైనా
మెరిసే బందీఖానాలో బందీయే.

క్రూరత్వం నింపుకొని
లెక్కచేయక సాగిన దారిలో నలిగిన గడ్డిపూలు
ఇప్పుడిప్పుడే విచ్చుకొని
తావులను పంచుతున్నవి.
భూమాత ఎదను గజాలుగా విడదీసి
కోట్లు గడించిన కౌటిల్యపు నీతి.
ఎన్నో ప్రాణాలను వేలం వేసిన నీకు
వేలం వేయడానికేమి మిగిలింది?.
వామనపాదమై ఎందరినో బలి చేసి
బకాసురుడవై భూవనరుల మింగేసి
స్వప్నించే చిరుకళ్ళపై కరాళనృత్యం చేసి
ఆర్తితో పలికిన కోయిల గొంతును నులిమి.
సుస్థిర ప్రభుత్వాల మాటున
అస్థిర ధనాన్ని పోగేసి
ఆరోగ్య జీవనానికి కల్తీమందులు జతచేసి
దండుకున్న ధనం నీకు ధర్మమేనని తలచినావు.
అంతా నాదని విర్రవీగిన నీకు
ఆరడుగుల నేల కొరత.
మానవత్వపు ప్రస్థానంలో
ఓ మనిషి మనీషిగా సాగిపో
మనిషిగా సాటి మనిషిని ఆదరించు
ఋషిలా దివ్యత్వాన్ని దర్శించు.

-సముద్రాల కుమారస్వామి
9705476138

## పో పో కరోనా

పోపో కరోనా
జావ్ జావ్ కరోనా
మాయదారి కరోనా
మహమ్మారి కరోనా
కరచాలనం,కౌగలింత లేకుండా చేస్తివే
మాస్కులు ముక్కుకేసి,
గ్లౌజులు చేతులకేసి సానిటైజర్లు కొనిపించి
ఏమిమాయజేస్తివే
లాక్ డౌనుబెట్టించి, కర్ఫ్యూనుఅమలుచేసి
ఇంటినుండి కాలు బయట పెట్టనీక జెస్తివే
కొన్నాళ్ళే నీ కులుకు
కొన్నాళ్ళే నీ తళుకు
కొన్నాళ్ళే నీ బలుపు
మందులొచ్చినాక నిన్నుతరిమి తరిమి కొట్టమా
ఎక్కడో పుట్టినావు ఎక్కడో పెరిగినావు
దొంగలాగ మాదేశానికి
నక్కినక్కి వచ్చినావు
నీ అంతు చూడకుండ వదలముళే
కొత్త పురుగా
నిన్ను చంపక కదలముళే



-ఎస్ .ఎమ్ .షరీఫ్
9618045319

# మండే ఎండలు, మహమ్మారి రోగాలు
# మిడతల దండ్లు మానవ తప్పిదాల వలననే..

ఒక మహమ్మారి నుండి ప్రజలు బయటపడక ముందే మిడతల దండు ప్రపంచ దేశాలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి, వీనికి తోడు మండే ఎండలు మహా ప్రళయాలుగా ఈ మానవ తప్పిదాలవలననే అని నిరూపిస్తున్నాయి, ఎంతో అభివృద్ధి సాధించానని విర్రవీగే దేశాలు సహితం ఏ ప్రళయం ఎటువైపు నుండి వస్తుందో అని కంటికి కునుకు లేకుండా కనిపెట్టుకుని కూర్చున్నాయి. కరోనా వలన అధిక శాస్త్ర సాంకేతిక, ఆర్థిక అభివృద్ధి చెందిన దేశాలలో అధిక మరణాలు చవిచూడగా, భారతదేశంలో మాత్రం ప్రభుత్వాల నిర్ణయాలు ఆ ప్రమాదంనుండి గట్టెక్కించాయి. అలాగే ప్రతిసంవత్సరం మండే వేసవి వడగాలుల వలన అధిక మరణాలు నమోదయ్యేవి కానీ ఈ సంవత్సరం లాక్ డౌన్ వలన మండే ఎండల్లో వడగాలులు నుండి ప్రజలు రక్షించబడ్డారు. కానీ ఈ సంవత్సరం పర్యావరణ మార్పుల వలన (గ్లోబల్ వార్మింగ్) అధిక ఉష్ణోగ్రతలు కారణంగా హిందూ మహాసముద్రంలోని నీరు ఆవిరై మబ్బులను చేరి ఆఫ్రికా ఎడారి ప్రాంతం, అరేబియా ద్వీపకల్పంలో కురిసిన భారీ వర్షాల వల్ల ఈ మిడతల దండు వాటి మనుగడకై గాలివాటంగా ప్రయాణిస్తూ, ఆఫ్రికా, యూరోప్ మరియు ఆసియా ఖండాలలో ప్రవేశించాయి, ఇది కేవలం మానవ తప్పిదమే అనుటలో సందేహం లేదు. అడవులను నరికి వేయడం, వాటిని తగుల పెట్టటం, వాహనాల నుండి విడుదలయ్యే గాలి కాలుష్యం, పరిశ్రమల నుండి విడుదలయ్యే ఉద్గారాలు, ఇండ్లలో ఉపయోగించే ఎయిర్ కండీషనర్లు, రెఫ్రిజిరేటర్స్ విడుదలచేసే (CFC- క్లోరో ఫ్లోరో కార్బన్) వాతావరణంలోని గ్రీన్ హౌస్ వాయువులు విడుదలకు ఒక ముఖ్య కారణం, అందువలన జీవులు వాటి మనుగడకు, ఆహారంకై వలసలు ప్రారంభిస్తాయని ముఖ్య కారణంగా చెప్పుకోవచ్చు, ఈ ప్రకృతిలో జీవులు వాటి బతుకు జీవనం పై పలు ప్రాంతాల్లో ప్రవేశిస్తున్నాయి, పీడ పోయింది అనుకుంటే పిశాచం పట్టుకుందని COVID-19 మహమ్మారి పీడ వదలక ముందే మిడతల దండు వచ్చి గడగడలాడిస్తోంది,

పూర్వ కాలంలో కొన్ని యుద్ధాలు పంటలను నాశనం చేయటం, పండిన పంటను దోచుకెళ్లటం వంటివిగా ఉండేవని మన పెద్దలు చెప్పుతుంటారు, ఆవిధంగానే ఎవరో ఆకాశం నుండి ఒక పెద్ద వస్త్రాన్ని పొలాలపై కప్పినట్లు, అది మండే ఎండల నుండి పంటను కాపాడే మబ్బేమో అని రైతు అనుకునేంతలో పంట అంతా ఆరగించేసి అతని ఆశలన్ని భూతాపానికి ఆవిరైపోయినట్టు మిడతల ప్రళయం పంటను పాడుచేసి రైతు కంట కన్నీరు మిగులుస్తుంది.

ఈ మిడుత చూడగా చిన్నగా ఉన్నాను పంటలను నిమిషాల్లోనే మాయం చేస్తూ ఒక రోజులో అనేక వేల మందికి దాదాపుగా 35 వేల మంది తినే ఆహారాన్ని మిడతల దండు ఆరగిస్తాయని, వేగంగా రోజుకు కనీసం 150 కిలోమీటర్ల ప్రయాణించ గలవని ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO)లోని వ్యవసాయ ఆహార సంస్థ (FAO) తెలియజేస్తుంది.

మిడతలలో ఉన్న రకాలలో డెజర్ట్ లోకాస్ట్ (Desert locust) అత్యంత ముఖ్యమైనవి, ప్రమాదకరమైనవి. దీని శాస్త్రీయ నామం సిస్టో సెర్క్ గ్రెగరీయ, ఇది మూడు నుండి ఆరు నెలలు జీవిస్తూ, ఎడారి ప్రాంతంలో 13 నుంచి 15 సెంటీమీటర్లు లోతులో చిన్న చిన్న బొరియలు చేసుకుని గుడ్లు పెడతాయి, ఒక్కొక్క మిడత తన జీవిత కాలంలో మూడు సార్లు అనగా దాదాపు 700 గుడ్లు పైన పెడుతుంది, రెండు వారాల్లో పిల్లలు బయటకు వస్తాయి, ముఖ్యంగా మిడతలలో ఉన్న రకాల లో ఎరుపు మిడత, ఆఫ్రికన్ వైబ్రేటర్, ఇటాలియన్, అమెరికన్, బాంబే మిడత, డెసర్ట్ మైగ్రేట్, ట్రీ లోకస్ట్ లు ఎక్కువ వాతావరణ పరిస్థితులను బట్టి, ఆహారం వెతుకుంటూ కేవలం పగటిపూట మాత్రమే ప్రయాణిస్తూ ఉంటాయి, మనిషి చేసే అనేక పనులు ప్రకృతిలోని జీవుల మనుగడకు అంతరాయం కలిగిస్తున్నాయి అన్నట్టు నేటి మిడతల దండు వలస ప్రారంభమైనదనే చెప్పుకోవాలి.

కరోనా ఎక్కువగా పట్టణ ప్రజలను భయభ్రాంతులకు గురి చేయగా ఈ మిడతల దండు గ్రామాల్లోని రైతులను కృంగదీస్తునాయి, కానీ మండే ఈ ఎండలు పట్టణ, గ్రామ అని తేడా లేకుండా ప్రపంచం లోని ఉష్ణమండల దేశాలలో నిప్పులు కక్కుతూ ప్రకృతిలోని జీవ జాతులకు ప్రాణ సంకటంగా మారుతుంది. ఈ సంవత్సరం మన దేశంలో అత్యధిక ఉష్ణోగ్రత లు (రాజస్థాన్) శ్రీ గంగానగర్ - 50°C , (ఉత్తరప్రదేశ్ ) ఝాన్సీ- 48°C (మహారాష్ట్ర) నాగపూర్ - 48°C (చత్తీస్గఢ్) బిలాస్ పూర్ - 49°C (ఆంధ్రప్రదేశ్) రెంటచింతల- 52°C విజయవాడ- 49°Cగా నమోదవుచు నదులు, సరస్సులు, అలాగే భూగర్భ జలాలు స్థాయి తగ్గిపోతున్నాయి, ఈ అధిక ఉష్ణోగ్రతలు మానవునిలో అనారోగ్య కారణాలకు దారితీస్తుంది. అడవులు నరికివేయటం వలన, అడవులు తగలబడి పోవటం వలన, వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ శాతం పెరిగిపోతూ ఈ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుచు ఉన్నాయి అని IPCC (ఇంటర్ గోవేర్నమెంటల్ ప్యానల్ ఆన్ క్లైమేట్ చేంజ్ ) నివేదికలు తెలియజేస్తూన్నాయి, ఈ అధిక మండే ఎండలు విషజ్వరాలుకు ఒక కారణం.

మిడతలు ఇంతటి భారీ స్థాయిలో మనదేశంలో 1787 - 1796, 1901 - 1908 మధ్య కాలంలో వచ్చాయని చరిత్ర చెబుతున్నది, తర్వాత మిడతల దండు వచ్చి నన్ను ఇంత ఎక్కువగా వచ్చిన దాఖలాలు లేవు, వ్యాధులు కూడాను ప్రతి శతాబ్దంలో మహమ్మారుల రూపంలో మనిషి చేసే వికృత చేష్టలు, ప్రయోగాలు, జంతువులతో సాంగత్యం వలన బర్డ్ ఫ్లూ, జూనోసిస్, ఎయిడ్స్, ప్లేగు, అని ఇలా ఏదో ఒక రూపేణా మానవ తప్పిదంగానే సంక్రమిస్తున్నాయి..

మిడతలు భారతదేశంలోకి పాకిస్తాన్ వైపు నుంచి గుజరాత్ లోకి ప్రవేశించి రాజస్థాన్ గుండా విరుచుకుపడి పంటలను నాశనం చేస్తూ ఆ దండు రెండుగా చీలి ప్రయాణిస్తూ ఉత్తర భారతదేశంలో తమ ప్రతాపాన్ని చూపించి దక్షిణ భారతదేశం లో ప్రవేశించ బోతున్నాయి, భారతదేశంలో ఈ మిడతల దండు యొక్క ప్రభావం రాబోయే రోజుల్లో కరోనా వలెనే ఉగ్రరూపం దాల్చి పోతుందని WHO, FAO, మనదేశంలోని (రాజస్థాన్) జోధ్పూర్ కేంద్రంగా పని చేస్తూ ఉన్న లోకస్ట్ వార్నింగ్ ఆర్గనైజేషన్ LWA ) ది అంచనాలు తెలియజేస్తున్నాయి.

ఈ మిడతల దండు ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో ఆహార సమస్య ఏర్పడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి, అదృష్టం కొద్ది రబీ పంటలు సమయంలో పంటలు బాగా పండినను ఈ కరోనా లాక్ డౌన్ వల్ల రైతులకు కొద్దిగా అవాంతరాలు ఏర్పడ్డాయి, కానీ ఎంతో కొంత రైతు కష్టానికి ఫలితం పొందాడు, రాబోయే ఖరీఫ్ పంటల కాలం లో ఈ మిడతల బాధ తప్పేటట్టు లేదు. ఇప్పటికీ దాదాపుగా ప్రపంచ వ్యాప్తంగా ఆసియా, యూరప్, ఆఫ్రికా ఖండాలలో 70 దేశాలలో ఈ మిడతల దండు వల్ల తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నాయి, , భారతదేశంలో రాజస్థాన్, గుజరాత్, హర్యానా, పంజాబ్, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల గుండా తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశించి తదనంతరం ఆంధ్రరాష్ట్రంలో కూడా ప్రవేశించే ప్రమాదం పొంచి ఉన్నది, అనేక దేశాలలో అత్యవసర పరిస్థితిని ఏర్పాటు చేసి హై ఎలర్ట్ కూడా ప్రకటించడం జరిగినది, ఈ మిడతలు ఎక్కువగా పండ్ల తోటలు, కంది, కూరగాయలు, ఉల్లిపాయలు, చిరుధాన్యాలు, పంటలకు ఎక్కువగా హాని కలిగించవచ్చు, ఒకసారి దాడి ప్రారంభం అయితే దాని ప్రభావం రెండు సంవత్సరాలు వరకు ఉంటుందని WHO, FAO నివేదికలు తెలియజేస్తున్నాయి. కరోనా లాక్ డౌన్ వలన ప్రపంచ దేశాలలో ఆర్థిక పరిస్థితి తారుమారవగా , ఈ మిడతల దండు వలన అభివృద్ధి చెందుచున్న, పేద దేశాలలో ఆహార సమస్యలు పెరిగిపోవును, ఇది చాలా ఆలోచించదగ్గ విషయం అభివృద్ధి చెందుతున్న దేశాలైన భారతదేశంలో వ్యవసాయం ఎక్కువ కాబట్టి వీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది దాని వల్ల ఆహార, ఆర్థిక సమస్యలు ఏర్పడక తప్పదు.

ఈ మిడతల దండు లో 3 నుండి 4 లక్షల వరకు మిడతలు ఉండటం వలన పంటలను రక్షించడానికి క్రిమిసంహారక మందులు కొట్టే సమయం కూడా రైతుకి ఉండదు, కేవలం నివారణ ఒక్కటే మార్గం, దీనికి పద్మశ్రీ చింతల వెంకట్ గారి పద్ధతిలో మొక్కలపై బురద నీటిని పిచికారీ చేసి పంటలను కాపాడుకోవచ్చు. బురద, మట్టి పిచికారి చేసిన పంటలను మిడతలు తినలేవు మట్టితో ఉన్న పంటను తిన్నను అది అరగక మిడతలు చనిపోవును, ఇది ఒక శాస్త్రీయ పద్ధతి. రైతు పెద్ద ఖర్చు లేకుండా పంటలను రక్షించుకోవచ్చు. మిడతల దండుని ఎదుర్కోవడం ఏదో మానవ ప్రయత్నం అన్నట్లుగా, శబ్దాలు చేయడం, టపాసులు కాల్చటం, క్రిమిసంహారక మందులు చల్లటం, పొలాలను దున్నటం వంటివి చేసి వాటి గుడ్లను నాశనం చేసి వాటి సంతతిని పెరగకుండా చేయవచ్చు, అవి ఎటు వైపు వెళుతున్నది ముందే గ్రహించి ఈ ప్రయత్నాలు ప్రారంభించాలి, ఈ మిడతలు పొలాలు వదిలి పట్టణాలపైకి వస్తే, పట్టణాలలో ఉన్న పచ్చని చెట్లు, మొక్కలు అన్నీ మోడుబారి పోవును, అలాగే ప్రజల ప్రయాణాలకు ఇబ్బంది కలిగించును, పటిష్టమైన వ్యూహరచనతో తప్ప ఈ ప్రకృతి వైపరీత్యాల వల్ల బయటపడటం అంత సాధ్యం కాదు కాబట్టి ప్రతిఒక్కరు భాధ్యతగా భూతాపాన్ని తగ్గించటం కై, మొక్కలు నాటటం, కాలుష్య నివారణ చర్యలు చేపట్టటం, అడవులను పెంచటం వలన ఈ విపత్కర పరిస్థితుల నుండి మనలను మనం కాపాడుకోగలం.



-డా. సుధాకర్ గుమ్మడి
9440125495

## ఊరే నయం

ఉన్న ఊరు వదిలి వలస వెళితే
మనసు వెలితితో నిండి పోయే

కడప దాటితే చాలు పలకరింపులు
కనపడ్డ వారంతా అడుగుతారు క్షేమం
ఆప్యాయత ఉట్టిపడే చిలకరింపులు

ఉప్పు పప్పులు లేకున్న పుట్టే చేబదుల్లు
ఉద్దెర ఇచ్చే షావుకారు దుకాణాలు
ఉపవాసం ఉండనిస్తారా!

ఊరికి ఓ చివర చెరువు మరో చివర బడి
ఊరి మధ్యలో రామయ్య గుడి
గుడైనా బడైనా ఒక్కతీరే ఆనాడు
గంటలు మ్రోగేది గణగణమంటూ

ఉషోదయ పు కిరణ కాంతులు
చివుళ్లు మేసి మత్తుగా కుసే కోయిలలు
పిచ్చుకమ్మల కువకువలు
లేగ దూడల గమ్మత్తైన గెంతులు

పాలదాలిలో పాల ఘుమఘుమలు
పడతులు కవ్వంతో సయ్యమంటూ
లయ బద్ధంగా ఊగుతూ చేసే మజ్జిగలు
వెన్నకోసం పోటీ పడే చిలిపి కృష్ణులు

ఏ మూల చూసిన ధాన్య రాశులు
చూసి చూడక చేట నిండా పెట్టే భిక్షాలు
ఇంటి నిండా వచ్చి పోయే అతిథులు

అలసట అని అనుకోక
వండిపెట్టే అన్నపూర్ణలు ప్రతి ఇంటా

కట్టెల పొయ్యి మీద వంటలు
కమ్మ దనాన్ని పెంచేవి కడుపు నిండే ది
సంతృప్తి కరమైన జీవితం ఆనాడు

కొత్త బట్టలు కట్టాలని కోర్కె లేదు
అందరం కలిసి ఉండాలనే కాంక్షనే
చేతిలో డబ్బులు ఉండాలని చింతలేదు
తలో పని చేసుకుని ఉన్నది తిందామని తపననే..
అదే ఉమ్మడి కుటుంబాలకు వేసింది పూల బాట!

టీవీ ల మాయా ప్రపంచం లేదు
ఇరుగు పొరుగు కలిసి పంచుకునే వారు
కష్ట సుఖాలు ..
కాసేపు దొరికిన సమయంలో
ఆడుకునే వారు చిన్న చిన్న ఆటలు

ఆనాటి ప్రపంచంలోకి వెళితే..
రాలేను తిరిగి..ఇక చాలిస్తున్న.



-లక్ష్మి మదన్
9959186838

## నానీలు

సదా మీ సేవలో
సవ్యమైనదా దారి-
సఖ్యం పాటిస్తూనే
సగర్వమ్ముగా!

సేవ చేసిన
తృప్తి కలుగును-
చేసిన సేవ
చరిత్రలో మిగులును.

తీసుకోవడంలో కన్నా
ఇచ్చుటలోనే
తృప్తి ఉన్నది-
సేవకదే అర్థం!

నిత్య సేవకుడై
నీవు నిలిస్తే-
అందరికీ ఆదర్శం
నీ జీవితమే!

సేవలో తరించు
సంతృప్తిని గాంచు-
సంతృప్తికి మించిన
సంపదేదీ లేదు.

సృష్టిలో విలువైంది
కాలమే-
సేవలతో జీవిస్తేనే
సార్ధకమైనట్లదీ!

మనస్ఫూర్తిగా
సేవ చేస్తే-
అదియే అమృతనం,
మరియూ కమ్మదనం!

సేవ చేసే మది
నిండైన త్యాగధనం-
అది జన్మజన్మల
తపోధనం!

నిన్ను నీవు
సంస్కరించుకో చాలు!
అది ఈ సృష్టికెంతో
సేవ చేసినట్లు.

-కుదమ తిరుమలరావు
9505665748.

## దైవం మానుష రూపేణా

నరుడే హరుడని భావించాలి
మానవుడే మాధవుడని సేవించాలి
మానుష జన్మ దుర్లభమే సార్థకతను పొందాలి
తరిస్తూ తరింపగజేస్తూ బ్రతుకు చరితార్థం కావాలి

కామం దరిరాదు ఉన్నంతలో తృప్తిపడితె
కోపానికి తావులేదు క్షణకాలం యోచిస్తే
లోభం నిరర్థకం దేహమూ వదిలేదనితోస్తే
ఎప్పుడూగెలుపునీదే లోపలి శత్రువులను హరిస్తే

మోహం మించదు వైరాగ్యం బోధపడితె
మదమే హెచ్చదు విశ్వరచననే గ్రహించితే
మత్సరం కుత్సితం ప్రయోజనరహితమే
తప్పటడుగువేయవు కాలం విలువ నెరిగితే.



-డా॥గొల్లపెల్లి రాంకిషన్
9849693324.

## ధూమపాన మొగ్గలు

బీడీ సిగరెట్లలోని పొగాకుతో దోస్తీకడితే
ఒళ్ళంతా నికోటిన్ విషరసాయనమే
ధూమపానానికి బలైతే కుటుంబమంతా ఒంటరి

ఊదేపొగ ఊపిరితిత్తుల్లో మెల్లమెల్లగా చొరబడి
ఊపిరాడనివ్వక క్యాన్సర్ మహమ్మారి కాటేస్తుంది
ధూమపానం వ్యతిరేకిస్తేనే ప్రజల్లో చైతన్యం

ధూమపానం చాపకింద నీరులా మనిషిలో చేరి
మజా అనుకున్నా తంబాకు దేహాన్ని దహిస్తుంది
ధూమపానాన్ని తరిమి జీవితాన్ని కాపాడుకోవాలి

హుషారుగా గుట్కా నములుతున్న మనుషులు
మత్తులో మునిగి మైకంలో తేలియాడుతున్నరు
చేయిచేయి కలిపితేనే ధూమపానం బలాదూర్

పొగాకుమైకంలో పడి ఒళ్లు,ఇల్లు గుల్ల చేసుకుంటూ
దుర్భరస్థితిలో కొట్టుమిట్టాడుతున్న కుటుంబాలు
ధూమపానాన్ని నిషేధిస్తేనే సమాజం సురక్షితం.
(వరల్డ్ నో టొబాకో డే సందర్భంగా
రాసిన మొగ్గల కవిత)



-కొలిపాక శ్రీనివాస్
9866514972

## కానరాని పెళ్లి సందడి

మోగని పెళ్లి బాజాలు
వినిపించని మంత్రోచ్ఛారణలు
బోసిపోయిన పెళ్లి మండపాలు
అలంకరణ కోసం పూలు ఓ తాపత్రయం
కెమెరాలు వీడియోలు నిరీక్షణ
ఎదురు చూస్తున్నా ఆర్డర్లు క్యాటరింగ్స్
మౌనంగా కూనిరాగం తీస్తున్న డీజే
తగ్గ వెలగని రంగుల కాంతి లైట్లు
ఘుమఘుమలాడని రకరకాల వంటకాలు
ముందడుగు పడలేని ఏడడుగులు
ఆహ్వానాన్ని పరీక్షిస్తున్నా పెళ్లి పీటలు
గుప్పెడాశతో తలంబ్రాలు అక్షింతలు

వధూవరుల ముఖాల్లో చిరు బుర్రలు
సిగ్గు సింగారించుకుని సమయానికి
లగ్గానికి లాక్ వేసిన కరోనా
తాళం మేళం పెళ్లి సందడి రాగాలకు
మంచి ముహూర్తాల రోజులెప్పుడో



-దాసరి సుబ్రహ్మణ్యేశ్వరరావు
సెల్ : 9493033534

## ప్రకృతిని రక్షిద్దాం

దూసుకెళుతున్న
పోటీప్రపంచంలో
ఒకరినిమించి ఒకరు.
ప్రగతి పరుగులు

పరిశ్రమలు
రకరకాల ఆధునిక
పరిశోధనలు

పెరిగిన
ఉష్ణోగ్రత
కాలుష్యం

అటవీ సంపద
ప్రకృతి నష్టం

సంతోషంలో
దుఃఖం, పెరిగిన
కార్బన్ గాలులు
తగ్గిన ఆక్సిజన్

భూకంపాలు
తూఫానులు
ప్రాణనష్టం
ప్రాణాంతక రోగాలు,

దిక్కుతోచనిస్థితి
చెట్లునాటుటనే
సద్గతి

ప్రకృతిని రక్షిద్దాం
చెట్లునాటుదాం
పర్యావరణాన్ని
కాపాడుదాం

బాధ్యత ప్రయత్నం
సస్యశ్యామలం
ప్రకృతి హరితం

స్వచ్ఛదనం
సదానందం
పచ్చదనం
పరమానందం



- యెల్డి సుదర్శన్ పద్మశాలి
సెల్: 9892411067

## ఒంటరిగానే

ఒంటరిగానే
కీలక నిర్ణయాలన్నింటిలో
నీ నీడలాగా నువ్వు
ఒంటరిగానే
సమూహం నుండి
వీడినప్పుడు
నీ అడుగులు ఒంటరివై
సాగినప్పుడు
నీ చిన్ని అరుపు ఒంటరిదే.

నీ ఆలోచనల ప్రతి ఘట్టం
నీకు ఒంటరే
నిద్రలో నీ ఆలోచన
ఒంటరే .

కనులు మూస్తే ఒంటరి యుగం
కనులు తెరిస్తే జన సమ్మోహక శకం
దుఃఖం నిండిన హృదయం
వేదన మనసు.

గూటిలో దీపం ప్రాణిలో జీవం
కాలంలో చీకటి ఒంటరే .
మొదటి అడుగు 'మొదటి అక్షరం
మేధస్సు సంఘర్షణ ఆలోచన
మౌనమెప్పుడు ఒంటరే
మతలెన్ని నేర్చినా
మనసెప్పుడు ఒంటరే.



-సిరిసిల్లా గఫుర్ శిక్షక్
9849062038

## నిజాలు

ఆ. వె. విర్రవీగు నరుడు విశ్వంబు నాదంటె
నాదు సృష్టి యంచు నాట్య మాడె
సూక్ష్మ రూపు దాల్చి ఝుళిపించె ప్రకృతి
తనదు రక్ష జేయ తరలి వచ్చె.

ఆ.వె. గంగ యుక్కి రయ్యె కాలుష్య కోరల
విషము నింద హరుని విరుగు డడిగె
భయము వీడు నిన్ను బతికింతు సఖియని
మనిషి కదల కుండ మాయ జేచె.

ఆ.వె. నరుని గూడు జేర్చె నరహంత రక్కసి
పక్షులెల్ల స్వేచ్ఛ పయన మయ్యె
కమ్ము పొగల గాలి కాలుష్య రహితమై
పూల తావి మోస్తు పులకరించె.

ఆ.వె. భూమి యమ్మ యనుచు భూగర్భము దొలిచి
సారమంత పిండి సాగు జేయ
నీరు పీల్చి తనను నిస్సార మొనరింప
కాళి రూపు దాల్చె కరుణ మరిచి.

కం. అక్షయ పాత్రయె ప్రకృతి
తక్షణ కర్తవ్యమనియు ధనముల నిచ్చెన్
భక్షించితి మందరమున్
వీక్షించక ముందు వెనక వివరము లేకన్.



-అద్దంకి తిరుమల వాణిశ్రీ

## పున్నెం గట్టుకోండి సారు?

కరోనా కష్ట కాలం ఎల్లక ముందే
వలస జీవుల తండ్లాట తీరక ముందే
ఇంకో గండం ముంచుకు వచ్చింది
బతుకు ఆగమైతన్న పాడు దినాల
మిడతల దండు దండయాత్రకు దిగింది
చేతికంది వచ్చిన పంట నాశనం జేసీ
మా కంట దుఃఖం మిగిలిచ్చింది
పాపకారి మిడతల దళం ఊడి పడి
ఊళ్లకూళ్లను ఉక్కిరి బిక్కిరి జెత్తంది
భీకర సప్పుడెంత జేసినా...
గొంతు సించుక అరిసి గీపెట్టినా...
శత్రు మూక సెవిన బెట్టక పెట్రేగుతంది
సిగురుటాకుల హరితం మేస్తూ..

కాడల రసమంతా పీల్చి పిప్పిజేస్తూ...
రాతిరేళా చెట్లు,పైరులపై నిద్రదీస్తంది
గుడ్లు బెట్టి సంతానం పెంచుతంది
సక్కటి పక్కుర్తితో పరాస్కమాడుతంది
అయ్యా పాలక సామి !
మీ మాటల మూటలు వద్దు
ఈ మిడతల గండం నుంచి గట్టెక్కిచ్చి
కూసింత పున్నెం గట్టుకోండి సారు?!
(మిడతల దండు పంట చేలను ధ్వసం చేస్తున్న సందరభంగా)



-కోడిగూటి తిరుపతి
9573929493

## మాను ఇచ్చు మంచి ఫలము??

మానవ మనుగడకి మానులే ఆధారం
మానులే మనకు మాన్యములు
వృక్షములే రక్షకాలని
తెలుసుకొని మసలుకో...

ఇంటికో చెట్టు పెట్టు
ప్రగతి బాటకు అదే తొలిమెట్టు

పెట్టిన మొక్కను సంరక్షించు
దాని ఫలాలు ఆనందంగా భక్షించు

ఆ మాను నీడన సేదతీరు
మనమునన్నున్న బాధతీరు

భూరుహమే భూమిని కాపాడు
భుక్తి నొసగు భూమిపుత్రునికి తోడు

పశుపక్ష్యాదులకు సేదతీర్చు
పాలకునికి విశ్రాంతి నిచ్చు

నాగలికి నడకనేర్పు మోడైన చెట్టు
పొలానికే హద్దులు పెట్టు

బండిచక్రాలై దారి చూపు
బ్రతుకుబండి కష్టాలు మాపు

ఇల్లాలికి వంటచెఱుకువు
ఇంటిల్లిపాదికి కడుపునింపు క్రతువువు

నీవే నిస్వార్థానికి నిలువెత్తు నిదర్శనమౌను
తరువు తనువంతా ఉపయోగమౌను

నిన్నటి విత్తు, నేటి మొక్క
రేపటి వృక్షం,మర్నాడు మహావృక్షమౌను
మనం నాటిన చెట్టు
ముందుతరానికి ఫలాలనిచ్చు
పర్యావరణానికి పచ్చదనాన్నిచ్చు
భావిజీవితాలకు దాహార్తి తీర్చు
అందుకే....
మొక్కను నాటు
మొక్కవోని సంకల్పాన్ని చాటు



-డా.శ్రీభాష్యం అనూరాధ
8790325502

## వసుధైక కుటుంబం స్థాపనం, సర్వ శ్రేయస్కరం

నిత్య జీవన గమనంలో కాల ప్రభావమధికం
ఏ క్షణాన ఏమగునో ఎవరికి ఎరుక
ప్రకృతి అనాదిగ, ఈ పవిత్ర పృథ్వీ నేస్తం.

సాటి వారిని కించపరచడం ప్రకృతి ధర్మ విరుద్ధం
ఉగ్రవాద నేపథ్యం, ఈర్ష్యాసూయల ఆగడం
విద్వేష భావం, క్రూరత్వానికి ప్రేరణ, వినాశ హేతువు.

ఆత్మీయానురాగాలకు నెలవు మన భారతీయ సంస్కృతి
భారతీయ సనాతన ధర్మ నేపథ్యం, ' జీవకారుణ్యతా దృష్టి
"బ్రతుకు, బ్రతకనివ్వు ", అనే శాశ్వత మైత్రీ భావన, సదా అనుసరణీయం.

ఈనాడు అత్యవసర దృక్కోణం, సమైక్య భావన
కలుపుకుపోయే తత్త్వం, విశ్వ శాంతి మార్గం, సదా ఆదరణీయం
విశ్వ మానవాళి ప్రప్రథమ కర్తవ్యం, సముచిత వసుధైక చింతన.

ప్రకృతి పరిరక్షణలో ఈ సద్భావం, ఎంతో ప్రోత్సాహకరం.

ప్రకృతి, ఈ ఇలపై అనాదిగా అనేకానేక ఓషధీ సంపదకు నెలవు.
ప్రకృతి నేర్పే మైత్రీ ధర్మం, సకల చరాచర జీవ జగత్తుకు చక్కని ఆలంబన
ఏ సెకనులో ఎవరి అవసరమెవరికో, ఎవరికి ఎరుక
ప్రకృతి ఏర్పరిచిన సుమైత్రీ దార్శనికత, నేటి ' ప్రజాస్వామ్యానికి ', మార్గ నిర్దేశనం.

ధర్మో రక్షతి రక్షితః, వృక్షో రక్షతి రక్షితః
"యద్భావం తద్భవతి"
సర్వే సంతు సుఖినః ! సర్వే సంతు నిరామయాః !
సర్వే భద్రాణి పశ్యంతు ! మా కశ్చిత్ దుఃఖ భాగ్భవేత్ !!
ఓం శాంతి శాంతి శాంతిః !!

-గుళ్లపల్లి ఆంజనేయులు,
09848369618

## స్తంభించిన శ్రమ

ఊర్లన్నీ కరోనాతో చేసే యుద్ధంలో
ఉపాధి ఊపిరిపోయింది.

కడుపు చేతపట్టుకొని ఊరు దాటిన వారు
కన్నీళ్ళు పెట్టుకొని తిరిగి ఊరు ఒడిన చేరారు.

రూపు మారిన వలస బతుకులు
రేపటి రంగు మారబోతున్న రోజులకు
ఆలోచన గూడు కిందకు చేరి వణుకుతున్నాయి.

నిత్యం
రక్తాన్ని మరిగించి
చెమటను చిందించిన జీవితాల్లో

"స్తంభించిన శ్రమ"తో
ప్రపంచ శ్రామిక సౌందర్యం
జీవకళ తప్పి
మనిషి మనిషిలో
రేపటి రోజు దిగులు పుట్టింది.



-చందలూరి నారాయణరావు
9794437247

## శ్రీ శ్రీ గారి మెరుపులు

శ్రామిక దోపిడి
తగదని అన్నాడు
పెత్తందార్లపై తిరుగుబడి
అసలైన మంత్రమన్నాడు.!

ఆర్థిక అసమానతలను
వ్యతిరేకించాడు
కుల వివక్షను
విడనాడమన్నాడు ..!

ఇరవయ్యవ శతాబ్దపు
విప్లవ కవి
తెలుగు సాహిత్యపు
మహా కవి ..!

గ్రాంథిక బాషలో
రాయడం విడనాడాడు
మాత్రా చందస్సులో
కలం పట్టాడు ..!

భావకవిత్వమునకు బాసటగా
నిలబడ్డాడు
అభ్యుదయం దిశగా
కలాన్ని పరుగులుపెట్టించాడు .!

కవిత్రయమంటే తన
దృష్టిలో వేరేనన్నాడు
తిక్కన వేమన
గురజాడని చాటాడు .!

తిక్కన తెలుగుపదము
ఎక్కువగా వాడాడు
అందుకే కవిత్రయము
మొదటివాడు అన్నాడు..!

మేటికవి గురజాడ
అని అన్నాడు
అతని అడుగుజాడ
తన ఆదర్శమన్నాడు..!

సహజ కవయిన
వేమన గొప్పన్నాడు
అతనిదే అసలైన
కవిత్వమన్నాడు ..!

ప్రాసకు శ్లేషకు
పేరు గాంచాడు
చిన్ని అక్షరాలకు
విలువనిచ్చాడు..!

కొవ్వొత్తి రెండువైపులా
వెలగనివ్వగల శక్తి
ధిక్కార జ్వాలలా
కవితా శక్తి..!

అక్షరాలలో అగ్గిపుట్టించిన
సమర్థుడు
కవితలతోన చరితన
నిలిచాడు ..!

సమాజాన్ని నూతన దిశగా
పరుగులు పెట్టించాడు
అభ్యుదయం దిశగా
బాటలు వేశాడు..!

నేను సైతమని
విప్లవాగ్ని రగిలించాడు
కార్మికుల కోసమని
కొత్తశకాన్ని తెచ్చాడు..!

అందమైన అబద్దాల
మంచికవిత్వం రాదన్నాడు
నిష్టూరమైన నిజాల
నుంచే కవిత్వమొస్తుందన్నాడు.!



-సునీత బండారు
9440671530

## మాయమవుతున్న మనిషి

మనిషి మాయమ వుతున్నాడు
ఆగమైతున్నడు
ఈర్ష అసూయ ద్వేషాలతో
బుసలు కొడుతూ
పేగు బంధాలను ఆత్మీయ బంధాలు
తెంచుతున్నడు
కడుపుల ఇసం పెట్టుకుంటున్నాడు
నోట్లో బెల్లం పెట్టుకున్నట్టు మాట్లాడుతాడు
మాటల తూటాలతో బెంబేలెత్తిస్తడు
ఇరుగు పొరుగుతో సంబంధాలు
తెంచిండు అవసరానికి
ఎవరికి సహాయం చేయడు
పగలు ప్రతీకారాలతో
నాగుపాముల బుసలు కొడుతూ
అదను కోసం ఎదురు చూస్తాడు
ఎదుటివారు ఆపదలో ఉంటే
పైశాచిక ఆనందం పొందుతాడు

మంటగలిసిన మానవత్వం
మనీ ఉంటేనే మనుగడ అంటున్నారు
డబ్బున్న వాడి తోనే స్నేహం అంటాడు
పేదవాడి తో మాట గీట లేనే లేదు అంటాడు
బతికున్న రోజుల్లో అన్ని పగలు ప్రతీకారాలు
చచ్చి ఏం సాధిస్తావ్
మనిషి ఇకనైనా మేలుకో
మానవత్వంతో మసలుకో
మంచి చేయడం అలవర్చుకో
ఆనందంగా జీవించడం అలవాటు చేసుకో



-యాదవరం
చంద్రకాంత్ గౌడ్
9441762105

## దివిటీలు

పరిస్థితులను పరిశీలించు
నిజాలను గ్రహించు
సమస్యలను ఛేదించు
బ్రతుకును కొనసాగించు

విశ్వాన్ని ప్రేమించు
విజ్ఞానాన్ని అందించు
విద్వత్తును పెపొందించు
విజేతగా జీవించు

సిరులకొరకు ఆశపడకు
సిరులను వృథా చేయకు
సిరిని కాల తన్నకు
సిరి సంపదలుస్థిరమనుకోకు

పగలు కాదు మంచివి
పగతో ఏమీ వస్తవి
పగతో ఏమీ సాధించితివి
పగతో నీతిని మరచితివి

మనసు చూసి మాట్లాడు
మంచి కోసం పోరాడు
మానవత్వం చూపిన నాడు
మంచి మనిషిగా నిలబడు

శక్తికి మూలం
శివుని త్రిశూలం
భక్తికి మూలం
నంద గోపాలం

మమతతో మెలుగు
మాతృభాష తెలుగు
తెలుగు భాష వెలుగు
శుభంనీకు కలుగు

పని చేయకుంటే నష్టం
పనినిచేసుకో ఇష్టం
పడకు నీవెట్టి కష్టం
తీరుతుంది అభీష్టం

ప్రకృతి ఓవరం
నమ్మకం భారం
గానానికి స్వరం
మోక్షం కైఇహంపరం

కడుపుతీపి సంకటం
ఏదోసాధించాలని ఉబలాటం
బంధాలతో ఇరకాటం
తప్పని పోరాటం

మనిషినిత్య కృషీవలుడు
శ్రమకుతాను దాసుడు
కష్టాలకుతాను వారసుడు
ఐనాప్రకృతి ప్రేమికుడు

పంతంపనికిరాదు
చెడును కోరరాదు
మోసం చేయరాదు
ధర్మం వీడరాదు

మనుషులంత సమానం
వలదు అసహనం
చేయకు అవమానం
అవసరం నిదానం

జ్ఞానం పంచుము
అజ్ఞానం తుంచుము
మానవత్వం పంచుము
విజ్ఞానం పెంచుము

అందమైనది ఈజగతి
సాధించాలి ప్రగతి
చెందకు అధోగతి
కృషితోనే పురోగతి



- కె. శైలజా శ్రీనివాస్
చరవాణి :8019736254

## సుషుప్తావస్థ..??

సగం నిద్ర, సగం మెలకువ
సగం అహం, సగం అణకువ
సమ్మోహిత అర్ధనిమిలిత నేత్రాలు,
వాటిలో భయవిహ్వల చిత్రాలు..

ఆశనిరాశల నడుమ ఊగుతున్న
ఆత్మవిశ్వాసపు ఊయల
సుఖదుఃఖాల నడుమ కొన్ని రోజుల్నుండి
సుఖంగా సేదదీరుతున్న సమయాభిలాష..

అదే గదిలో పాత నులకమంచం
టేబుల్ పై అదే అన్నం కంచం
మారట్లేవు ఈ పరిస్థితులు కొంచెం కొంచెం
మనసులో బింకం, మది మూలన సంకోచం..

మరీ తేడాలేకుండా రాత్రి పగలు
ఒకేలా ఉన్నాయి చీకటి వెలుతురులు
కూడా అలానే
అవే పరిసరాలు, అదే పాత లోకం
అవే జ్ఞాపకాలు, అదే నూతన శోకం..

ఇదే నా ఆస్థానం, ఇదే నా సంస్థానం
ఇప్పటికి ఇదే నా ప్రస్థానం
పొద్దస్తమానం శైశావస్థలోనే జీవనం
ఆలోచిస్తూనే సందిగ్ధావస్థలో అవలోకనం..

ఏమిటీ దురవస్థ, ఏమిటో నిద్రావస్థ
ప్రస్తుతం జీవితం గడుస్తుంది సుషుప్తావస్థలో
మనసు స్థిమిత పడక, మధ్యస్థంగా
ఉండక అటూఇటూ ఊగిసలాడ్తుంది..

ఈ హృదయం తటస్థంగా ఉండక
అనిశ్చల అస్థిర స్థితిలో ఊగిసలాడుతూ
మానసిక అస్వస్థతతో మరుగుతూ
ఆరోగ్య సందేహ సంస్థాపనం చేస్తుంది..

వెన్నెల నెచ్చెలి చేయి పట్టుకుని
సరసాలాడుతూ చంద్రుడొస్తున్నాడు
వేలాది ఆశాకిరాణాల్ని మోసుకుంటూ
నాకై సూర్యుడొస్తున్నాడు
రాత్రొస్తుంది, పగలొస్తుంది ప్రస్తుతం
జీవితమిలా గడిచిపోతుంది..

సందేహాల కారుమబ్బుల్ని, సంకోచాల
నీలినీడల్ని పటాపంచలు చేస్తూ
కాలం గల్లా పట్టుకుని నిలదీస్తూ
ఆత్మస్థైర్యపు ఆశాదీపంతో పరిస్థితుల్ని
పునఃస్థాపనం చేస్తూ ముందడుగు వేస్తున్న నేను..

–సర్ఫరాజ్ అన్వర్
9440981198



## హరివిల్లు

నాన్న నావలా
నడిపించె దైవం
జీవితంలో మనకు
తోడుండే అభయం !!

కష్టమే లేకుండా
జీవితం సాగదు
జీవితం ఆగినా
కష్టం ఆగదు !!

తల్లి లేకుండ
తనువసలు లేదు
తల్లిప్రేమ చూపనిది
మనబ్రతుకు లేదు !!

మొక్కలను పెంచిన
ఆరోగ్యం అభివృద్ధి
నరికిన చోట్లల్లో
తిరిగిచేయ్యాలి వృద్ధి !!

పుస్తకాలు లేకుంటే
జ్ఞానమెక్కడిది
అవి చదువకుంటే
విజ్ఞాన మెక్కడిది !!

మనసు గాయమైతే
మాసిపోదు ఎపుడు
మనిషి ఆగమైతే
బరువు దిగదెపుడు !!

చెడుతిండి మనిషికి
ఆరోగ్యమియ్యదు
చెడు మాటలేమో
అసలే విలువియ్యదు !!

రాగం వుంటే
రోగం రాదు
దానివల్ల మనకు
బతుకు ఆగంకాదు !!

బాల్య జ్ఞాపకాలతో
బాధలను మరవచ్చు
అనుభవాల వలన
వృద్ధాప్యం రావచ్చు !!

ప్రాణవాయువేగా
ఇంటికొక్క చెట్టు
ఆక్సిజన్ వాయువే
బ్రతికిస్తది ఒట్టు !!



–తాండ్ర చిరంజీవి
9959180762.

## మంచిగా బతుకుదాం

ఈ ఆధునిక యాంత్రిక కాలంలో
కూడా
ఏదో ఒక పుస్తకాన్ని
సావధానంగా చదువుదాం

ఇంత హరిబరీ జీవితమైనా
పది మందిని పరిచయం
చేసుకుందాం
అప్పుడు అప్పుడు
పలకరిస్తూ ఉందాం

కృతజ్ఞతా భావం
మన భారతీయ లక్షణం
అందుకే ప్రతి చిన్న సహాయానికి
కృతజ్ఞతలు చెప్పుకుందాం
మన హుందాతనాన్ని
పెంచుకుందాం

ఏ సమస్యకైనా
పరిష్కారం ఉంటుందిగా
అందుకే సమస్యను
చర్చించు కుందాం
చర్చల ద్వారా
పరిష్కారాన్ని సాధించుకుందాం

సొంత లాభం
కొంత మానుకొని
ఉన్న దాంట్లో కొంత
తోటి వారికి పంచుదాం
పది మందికి
సహాయపడదాం
మంచి తనాన్ని పెంచుకుందాం

ఎవరినీ నిరుత్సాహ పరుచక
వారి పనిని ప్రోత్సహిద్దాం
సమ సమాజ నిర్మాణానికి
అందరం అవసరమందాం

మనం నవ్వుతూ
మనచుట్టూ ఉన్న వారిని
నవ్విస్తూ
పువ్వుల్లాగ బతుకుదాం

కాళ్ళు చేతులు ఉన్న
మనషులుగా
బతకడం కాదు
మానవత్వం ఉన్న
మానవులంగా
మంచిగా బతుకుదాం

–వలిపె సురేంద్ర రావు

## ఓ సోదరా..

ఓ సోదరా..
అనుమానంతో అడుగుపెడితే
అంతా అపజయమే
అడుగు పెడితే అనుమానం
నుడుగు నుడుగితే అనుమానం
అదిచేస్తే నష్టం వస్తాదేమోనని..
ఇది చేస్తే నష్టం అయితాదేమోనని
వారితో మాట్లాడితే
కష్టం నష్టం వస్తాదేమోనని
ఏది చెయ్యకుండా, ఎవరితో మాట్లాడకుండా
ఒక రాయి, రప్పలా
ఒక మ్రానులా
పడి ఉంటే ఏం లాభం
నీకు సుఖశాంతులు కావాలన్నా
పలువురితో మాట్లాడక తప్పదు
పలు ప్రదేశాలు తిరగాలి
కష్టమైనా, నష్టమైనా
ఇష్టంతో పనిచెయ్యాలి
ఇతరులను నమ్మాలి
నమ్మకముతో పనిచేస్తూనే పోవాలి
నమ్మకము లేనిచోట ప్రేమాభిమానాలు
నిలబడవు.
నీకు సుఖశాంతులు ఉండవు
నీకు విజయము లభించదు.

– సిరిగాద శంకర్
సెల్: 9493301985



## ఏమవుతావో

మా
బ్రతుకుల
వెతలను
చిత్రంపై చూసి
మదన పడుతున్నావా?
నిజమైన జీవితాలను
నేరుగా చూస్తే
ఏమౌతావో.

– పత్తి శివప్రసాద్
సెల్: 9440001224



## అన్నదాత ఘోష...!!

ఎండిన డొక్కలతో...
లొట్టపోయిన నయనాలతో...
దివికేసి ఎదురు చూస్తుంటాడు..
దిగులుగా ముఖం పెట్టేస్తాడు..
మేఘుడు ఎప్పటికీ కరుణిస్తాడనీ...
నా బిడ్డలు కాలేకడూపుల..
మంటలు భరిస్తారో లేదోననీ...

తొలకరి చినుకుల సవ్వడితో...
లేచి వచ్చినట్లయింది అన్నదాత ప్రాణం,
కోడి కూయగా నిద్రలేచి...
జోడెద్దుల హలమును కట్టి...,
పుడమి కడుపును చించి..
నాగటి సాలును ఒద్దికగా దీసీ...
విత్తనంబు విత్తి ,నారును నాటి...
పుడమి పొత్తిళ్ళలో...
పసిడి పంటలు పండించేటి అన్నదాత...!!

ఒక్కొక్క మారు వరుణుడు...
కరుణించక పంటలు వడలి పోవును,
మరో మారు వరుణుడి ప్రేమ అధికమై..
అతి వృష్టి తోడై నష్టం వాటిల్లును,
అలాంటి స్థితిలో చెప్పనలవి...
కానిది అన్నదాత పడే ఘోష...
సేట్లదగ్గర తెచ్చిన అప్పేలా..తీర్చాలనీ...
కూతురి పెళ్ళి ఎలా చేసేదనీ ...
పిల్లల చదువులకు పైకం ఎలాగనీ...

అన్నీ ఆటు,పోట్లను అధిగమించి,
చేతికొచ్చిన పంటలను కాస్త...
అమ్ముకునేందుకు మార్కెట్ కు కొంచబోతే..
సగం ధరకే కొంటానటటాడు..
రైతుల రక్తం పీల్చి బలిసిన దళారి ,
ఏమీ తోచని అన్నదాత ..ధాన్యాన్ని ...
మద్దతుధరకై మార్కెట్ లో ఆరబోస్తే...,
చివరికి వరుణుడు కూడా కక్షగట్టి...
ఆరబోసిన ధాన్యాన్ని కాస్తా...
వరదలో కలుపుకు పోయే...,
దిక్కు తోచని అన్నదాత ...
బిక్కు బిక్కు మంటూ కన్నీటి పర్యాంతమాయే...

అన్నదాత కంట కన్నీరు వస్తే ...
అది భారతావనికే తీరని పాపం...,
విశ్వానికే అన్నపూర్ణ అయిన అన్నదాతకు ...
ఓదార్పు నివ్వాలి జగమంతా ..,
పంటలకు మద్దతు ధరలు ఇచ్చీ...
ఆపన్న హస్తం అందించాలి ప్రభుత్వాలన్నీ..,
సకల సౌకర్యాలు కల్పించాలి..
అన్నదాతల పై దయాదాక్షిణ్యాల నుంచీ..,
మనం తినే ప్రతి మెతుకు వెనక...
అన్నదాత కష్టపు చెమట చుక్కదాగి ఉందనీ,
గ్రహించాలి మనం అనుక్షణం, ప్రతి దినం..,
వారిని హేళనగా చూడటం మానాలి మనం ...
ప్రతి నిత్యం గౌరవించాలి జై కిసాన్ అంటూ ...
నినదించాలి మనమంతా రైతే రాజు అంటూ...!!

–యం. తారాసింగ్

## స్వచ్ఛత

పేదల బ్రతుకుల్లో
పొంచి ఉంటుంది దరిద్ర దేవత
నట్టింట్లో నాట్యమాడుతుంది
అందుకే! కుటుంబంలో
అన్నదమ్ముల గౌరవ మర్యాదలు
అక్కచెల్లెళ్ళ ఆదరాభిమానాలు
మమతానురాగాలు కన్పించవు?
ఒకవేళ కన్పించినా
ఆత్మీయత, అనురాగం
కన్పించని సమాజం!
మనం తీసుకునే కల్తీ ఆహారం
మనం త్రాగే మంచితీర్థం
అనారోగ్యాలకు మార్గం!
బాధలను చవిచూస్తుంది
సభ్య సమాజం!
అప్పుడూ!
స్వచ్ఛతతో మెలగాలి
మంచితనం పెంచుకోవాలి
సమతామమతలు వెల్లివిరియాలి
కష్ట సుఖాలను పంచుకొని
అభిమానంతో గౌరవంచుకుని
అందరిలో ఆధ్యాత్మికతను పెంచాలి.
నిత్యం భక్తి భజనలు చేస్తూ
భక్తి పాటలు వింటుండాలి
కలియుగంలో "స్వచ్ఛత"
సభ్య సమాజంలో కన్పించాలి
విశ్వశాంతికి కృషి చేయాలి!!



– డా॥ కర్నాటి లింగయ్య
సెల్: 9515298610

## తలగడ

పట్టెమంచమున్న, పరుపు–దుప్పటి యున్న
తలగడుండవలయు తప్పకుండ
నిదురపట్టు నెట్లు కుదురుగా తలకింద
దిండు పెట్టుకొనక పండుకొన్న?

హెచ్చరించుచుందు రెముకల వైద్యులు
దిండు వలన నష్టముండు ననుచు
నష్ట ముండుగాక.కష్టమౌగదమరి
దిండు లేని యెడల పండుకొనుట!

మనిషి సుఖము గోరి కనుగొనుచున్నట్టి
ఉపకరణములందు నొకటి దిండు
వేల యేండ్ల నుండి వినియోగమందుండె
తలగడ, కలవు పలు దాఖలాలు!

'పిరిమిడ్ల'లోన తలగడ
స్వరూపములు కొన్నిబయటపడెనట!నాడే
నరులు తలగడల సౌఖ్యము
మరగిరి, మరి దాని నిపుడు మానెద రెట్లుల్?

తలదిండ్లుగ రాళ్లును, చె
క్కలు వాడిన సాక్ష్యములును గలవట,నేడున్
తలకింద 'పీట' నిడుకొని
పలువురు నట్టిళ్ల నడుము వాల్చుట కననొ!

కాలక్రమమున దూదిని
తూలికలను వాడినారు, తొల్లిటి కన్నన్
మేలాయెను తలగడ, లిన్
నేలా మానవుడు వదలు నిట్టి సుఖములన్?

విస్తరించె శాస్త్ర విజ్ఞాన, మీనాడు
వచ్చుచుండె నూత్నవస్తు చయము
రకరకాల దిండ్లు లభ్యమౌచుండెను
'గాలిదిండ్లు' గూడ కలవు గాద!

పలు రకమ్ములుండు తలగడలందు, వ్య
త్యాసములును వెలలయందు నుండు
తాహతులను బట్టి తలగడలను కొన
వచ్చు,సౌఖ్య మందవచ్చు జనులు!

కొంతమంది దిండు కొనలేక, పాత గు
డ్డలను మూటగట్టి తలగడవలె
వాడుకొనుట నేడు చూడనొ, నిరుపేద
గూడ దిండు సుఖము కోరుకొనును!

తలగడ లభించనియెడల, తనదు చేయి
మడచి తలకిందనిడి,తలగడగ నెంచి
హాయిగా నిద్రపోవు మహానుభావు
లుందు రెందరో, వారికి వందనములు!

తల నుత్తమాంగ మనుటయు
కలదు గదా, దానిని తలగడపై నిడినన్
తల కీదగు పెద్దరికము
నిలుచును, మానవులకు సుఖనిద్రయు పట్టున్

దిండులేని యెడల నుండదు సుఖనిద్ర
కలత నిదురతోనె గడచు రేయి
నీరసించును సుఖనిద్రలేని మనిషి
తలగడను స్తుతించ వలదె జనులు?

–హెచ్.ఆర్. చంద్రం.
సెల్ : 9493248053



## నిరీక్షణ

ప్రకృతి వధువు
జీవనదీజలాల జలకమాడి
వివిధ వర్ణ సుమవనాలచీర కట్టి
పచ్చనిపైరు పైటవేసుకుని
నుదుట అరుణ కిరణ తిలకందిద్దుకుని
పాదాలకు సంధ్యారుణిమను
పారాణిగ పూసుకుని
చంద్రమణి శోభిత
నక్షత్ర కిరీటం ధరించి
కారుమేఘాల శిరోజాలతో
షడ్రుతు విపంచిపైన
పవలు రేల తీగలశ్రుతి సవరించి
పంచమస్వర
సుస్వర గీతాలాపన చేస్తూ
నీ రెండలచూపులతో
విశ్వాత్మక వరుడిరాక కోసం
నిరీక్షిస్తున్నది!

–చిమ్మపూడి శ్రీరామమూర్తి
సెల్: 9704177270



## అంతరం

నింగికీ, నేలకూ మధ్య
అంతరంపెరగడం లేదు కానీ
ఉన్న వాడికీ, లేనివాడికీ మధ్య
అంతరం రోజు రోజుకూ
పెరుగుతూనే ఉంది!

## కోట్లు–నోటు

సంపాదనే సంపన్నుడికి
సంపాదిస్తోంది రోజుకు
కోట్లకు కోట్లు!
ఆపన్నుడైన పేదకు ఎంత కష్టపడ్డా
దక్కడం లేదు ఒక్క పెద్దనోటు!

## నాయకుడు

అందరికీ అండగా నిలిచాడు
ఒకప్పటి నాయకుడు!
కులోపకులాలుగా
కుంచించుకుపోతున్నాడు
ఇప్పటి నాయకుడు!

## కోకిలలు–కవి కోకిలలు

కోకిలల కలకుంజితాల
వసంత ఋతువులోనే విన్పిస్తాయి!
కవికోకిలల కలకూజితాలు
సర్వ ఋతువుల్లోనూ
ముద్రిత కవితలుగా కనిపిస్తాయి
కవితాగానాలై వినిపిస్తాయి!
రాబోయే తరాలలోనూ
ప్రతిధ్వనిస్తాయి!

–రఘువర్మ
సెల్: 9290093933



## నానీలు

ఎన్నికలంటే
జనానికి సంబరం
శ్రమలేని
సంపాదన కదా!

నాలుక అదుపు
చూపు చురుకు
రాణింపులో
రారాజువు నీవే

మమతల రూపమే
అమ్మ!
లోకానికి వెలుగుచూపు
అమ్మ!

స్వార్థాన్ని పేల్చు
అవినీతిని కాల్చు
మమతల్ని పెంచు
సంపదల్ని పంచు

కట్నం వద్దట
సంతోషమే!
పెళ్ళి ఘనంగా చెయ్యాలంట
అయ్య బాబోయ్!

మనిషి వెంట
నీడ పడటం మానవత్వం
మనిషి నీడ వెంట పడటం
బానిసత్వం.

సముద్రం అప్పుడప్పుడు
పొంగుతుంది
సముద్రంలో
ఉప్పు ఉంది కదా!

చెప్పుడు మాటలు
వినకూడదు
అందులో ఉంది
'చెడు' కదా!

– బొబ్బిలి జోసెఫ్
సెల్: 9989261991



## భూతాలు!

అనుమానం పెనుభూతం
వాతావరణ కాలుష్యం కరాళభూతం

అలసత్వం ఆదిభూతం
జలకాలుష్యం జగత్‌భూతం

పవన కాలుష్యం
పరమ పాపిష్టి భూతం

భువి కాలుష్యం
భరింపజాలని భయంకర భూతం
ఇంద్రియ నిగ్రహ–రాహిత్యం
ఇనుపగజ్జెల భూతం

మనమెక్కిన కొమ్మను మనమే నరుక్కుంటామా?
తల్లి పాలుతాగి రొమ్ము గుద్దుతామా?

పులినోట్లో తలపెట్ట ఇష్టపడతమా?
వాతావరణ కాలుష్య కరాళభూతాన్ని
తన్ని తరిమేయకపోతే
ప్రాణికోటికి ఉనికి ఉంటుందా?



– అమర్‌జీ
9620186222

## రెక్కలు

వెకిలి వేషాలు
మకిలి భావాలు
శోభనీయవు
జీవితానికి
బూజుకి బందీ
బ్రహ్మజెముడు.

అందరిలోనూ
దైవాంశ ఉంది
ఇక ఉండాల్సింది
మానవాంశే
మానవీయత
మహావరం

పైన చాప
క్రిందనీరు
రెంటిదీ
స్థిత ప్రజ్ఞతే
కర్మత్యాగం
యోగఫలం!

లోలోనికి
త్రవ్వకుంటూ
సుదీర్ఘంగా
నీ ప్రయాణం
అనుభవాలగని
జీవితం.



– రఘుశ్రీ
సెల్:924708893

## అమ్మ ఆకాశమంత ప్రేమ

ఆమె జీవం పోసిన ప్రాణదాత..
నవమాసాలు కడుపులో సాది..
పేగుబంధంతో ఆయువు రుచి చూపి..
నిత్య చైతన్యం ఒల్లంత నింపి..
మాటల మూటలు ముద్దుగా నేర్పి..
రెక్కల్లో బొక్కల్లో సత్తువను పేర్చి ..
తన రెక్కల కింద పొదిగింది అమ్మ !

పొయ్యి వెలిగించే అన్నం గిన్నె
కుటుంబానికే ఆమె అక్షయపాత్ర
నిన్న, రేపు తెలిసిన లోక జ్ఞాని
ఉగ్గుపాలతో బలాన్ని ఇచ్చిన మాత
పూజలందుకునే అనురాగ దేవత
చెడును చేండాడే అపర భద్రకాళి
తొలి అక్షరాలు దిద్దించే ఆదిగురువు
పిల్లల కోసం వాదించే నిక్కచ్చి లాయర్
పంట పండించడం ఎరుకైన ఫార్మర్
కులవృత్తులలో నాన్నకు సరైన హెల్పర్
నడుం బిగించి పనిలో దిగే అర్ధాంగి !

సూరీడు తల నిమిరి నిద్ర లేపి..
వేకువన గుమ్మాన్ని ఆర్తితో తెరిచి..
ప్రాణవాయువును సాదరంగా ఆహ్వానించి..
కళ్లాపు చల్లి జగత్తును మంగళకరం చేసి..
కసుపు ఊడ్చి వాకిలి శుద్ధి చేసి..
పొక్కిలి గాయాలకు అలుకు లేపనం అద్దిన..
మా ఇంటి మేధావైన గృహమంత్రి
సర్వశక్తి రూపిణైన బలశాలి అమ్మే కదా !

భవసాగరాన్ని దాటించు ధైర్యశాలి..
నింగికి ఎగిరి విశ్వ రహస్యాలు శోధించు..
గగనాన్ని చీలుస్తూ గమ్యానికి చేర్చి..
సముద్రయానంతో సాహసం చేసి..
సరిహద్దుల్లో రుద్రమలా కాపలాకాసి..
జబ్బుకు సూది మందు సుతారంగా ఇస్తూనే..
ఆర్థిక గాయాలకు పరిష్కారం చూపే నేర్పరి !

ఇంటిని గృహంగా మార్చగల హోం మేకర్
భూగోళాన్ని చుట్టేయగల రాణిఝూన్సీ
ప్రజలకు సుపరిపాలన ఇవ్వగల లీడర్
అణువుగా ఉండటంతో పాటుగా..
బ్రహ్మాండంగా మారడం తెలిసిన అవ్వ..
ప్రపంచాన్ని గృహంగా చూడగల ఔదార్య మూర్తి !

కళ్ల ముందుండే అద్భుత దీపస్తంభం
ఎన్నటికీ అబ్బుర తీరమే అమ్మ ఒడి
ఆమే కదా రక్ష..దక్ష..సలక్ష్యలక్ష్మి
ఆమె హృదయం ప్రేమానందసాగరం
ఆ మత్రృమూర్తి సర్వస్రష్టకు వందనం
మా అమ్మకు వేనవేల అభివందనం !

– డా॥ బుర్ర
మధుసూదన్ రెడ్డి
99497 00037



## తోటమాలికే..

జ్ఞాన సమవనంలో
పలు రకాల విద్యాసుమాలు
మొక్కలుగా పాదుకొని
విద్యాగంద మద్దుకొని
సువాసనలతో ఎదగాలని
సభ్యత–సంస్కారాల విలువల
యజ్ఞ, ప్రజ్ఞ, నీటిదారలు
నింపాదిగా అందించే తోటమాలి
వనంలోని సుమాలన్నీ
పరిమళాలు వెదజల్లాలని
విరబూసే నవ్వులవ్వాలని
ఉవ్విళ్ళూరుతాడు
మొగ్గ తొడిగేవి కొన్ని
పురివిప్పేవి కొన్ని
రంగుల్లో తేడాలున్నా
అన్నీ అందాలు,
ఆరబోయాలనుకుంటున్నవే
అన్నీ ఆ వన సుమాలే గదా!
అన్నింటిలో పరిమళాల ఇందన
మకరందం నింపినా
వనమాలికి
వన్నె తెచ్చేవికొన్ని
మల్లెలై మురిపించేవి కొన్ని
వనంలో వున్నంత వరకే
వాటి రాజసం!
వనందాటి జనవనం చేరితే
అసలు పరిమళం తెలుస్తుంది
తన వనంలోని సుమాలన్నీ
పారిజాత సుమాలవ్వాలని
దీవించినా
ఫ్లవర్‌వాజల్ పరిమళంలేని
ప్లాస్టిక్ పువ్వులై పడివుంటాయో!
పరిమళాలు వెదజల్లి పరమేశుని
యెడల దండవవుతాయో
అంతా తోటమాలికే బెంగ!

– పి. బక్కారెడ్డి
సెల్: 9705315250



## ఎటుపోతుంది..

మమకారం చూపకపోయినా
కాస్త కారం ఐనావేసి
పిడికెడు ముద్ద పెట్టకపోతాడా
కన్న కొడుకు అని
ముసలి తల్లిదండ్రులు చూస్తుంటే
ఆ ముద్ద కూడా పెట్టకుండా
కఠినాత్ముడై చీదరించుకుంటుంటే
కన్న కూతురు కంట తడితో
చూపే కాస్తంత మమకారంతో
కడుపు నిండిపోతుంది
ఆ వృద్ధ దంపతులకు.
అందుకే
కంటే కూతుర్నే కనాలి
ఆడబిడ్డే నయం
ఆపన్న కాలంలో ఆదుకుంటుంది
అమ్మకే అమ్మై ప్రేమపంచుతుంది
అనుకోవడం ఒకప్పటి మాట
నేడు
కూతురైనా. కొడుకైనా
అమ్మానాన్నల మనసుకన్నా
వాళ్ళువెనకేసిన ఆస్తులకే
విలువ ఇస్తున్నారు.
ఆస్తులుంటే ఓల్డ్‌ఏజ్ హోమ్‌లకు
లేకుంటే అనాథ శరణాలయాలకు
సాగనంపుతున్నారు
చేతులు దులిపేసుకుంటున్నారు
అమ్మా నాన్నలంటే
అనవసరపు వస్తువులనుకుంటున్నారు
విదిలించి
వదిలించుకుంటున్నారు
ఎందుకిలా
ఏమయ్యాయి ఆనాటి ప్రేమలు
అలనాటి అనురాగ ఆప్యాయతలు
అమ్మా నాన్నలను
ప్రత్యక్ష దైవాలుగా
కొలిచే మనభారత సంస్కృతి
ఎటుపోతోంది?

– దేవలపల్లి సునంద
సెల్: 9291599562

## గోస

కూత కోయిలదే గని
రాత గాడిదదన్నట్టు
రైతే రాజంటరు
కోసిన ధాన్యాన్ని
మార్కెట్కు తోలుకపోతే
కోతిమూకల్లా ఎగబడ్తరు
తాలు, తడి చూస్తరు
తూకమెక్కువేసి కోతలు కోస్తరు
కాసులిచ్చేకాడ దేవులాడేలా చేస్తరు
రోజులకమానంగా కళ్ళల్ల వత్తులేసుకొని
ఎదురుచూసేలా చేస్తారు
గింజ తడి చూస్తరు గని
కంటి తడి పట్టిచ్చుకునేటోడే ఉండడు
పండించినోడు పూటకు లేక సత్తాంటే
కొన్నోడు కోట్లకు పడగలెత్తుతడు
ఆరుగాలం కష్టపడినా
ఇరుకిరుకు బతుకులేనాయె
బొజ్జ ముంగటేస్కొని మురిసేటోళ్లకు
కడుపు కూతల గోడెట్లా తెలుస్తది
రెక్కల కష్టమే బతుకుదెరువైనోని మీద
ప్రకృతి గుడ కనికరం లేకుండా ఇర్సుకబడితె
పంట కోతకచ్చిందన్న సంతోషం
క్షణాల్లో కళ్ళ నుండి వడగళ్లయి కారిపోయె
ఆశల సౌధాలన్నీ
గాలి స్తంభాల్లా కూలిపోయె
ఇగ చేసేదేమున్నది
నెత్తికి చేతులు పెట్టి
నేల సూపులు సూసుడు తప్ప
రైతును రాజును చేయకపోయినా పర్లేదు గని
రాతి మనసు చేసుకొని
రాషి రంపాన పెట్టకుండ్రి
గోస పుచ్చుకోకుండ్రి

–గుండు కరుణాకర్
9866899046.



## వసంతంలో శిశిర గీతం..

తప్పించుకొనాలని కృతనిశ్చయంతో
ఎంతగా ప్రయత్నించినను
ప్రతిదినం పదునైన కత్తివేటుకు
రక్తపు చుక్క నేలవాలుతుంటే,
దెబ్బదెబ్బకు ప్రాణం గిరికీలు కొడ్తూ
మెలికలు తిరుగుతుంది
కరడుగట్టిన కరకు దెబ్బకు
నాజూకు మొహం వాచిపోతుంటే,
ప్రాణానికున్న తీపి ముందర
అనుబంధం, మానవత్వం
వివస్త్రలా మారి వింతగొల్పుతూనే ఉంది..

ప్రపంచంలో ప్రియాతిప్రియమైన
ప్రాణహృదయాన్ని గుప్పిట్లో దాచిపెట్టి
ప్రాణానికి ఆధారమైన ఊపిరిదారాన్ని
భద్రంగా వస్త్రాల్లో మూటగట్టి
విచ్చుకత్తులైన అరచేతుల వల్ల కల్గిన
పచ్చిగాయాల్ని దాచుకుని
సిగ్గుతో ముఖాన్ని ముడుచుకుని
పట్టుదలతో పిడికిలిని బిగించి
ధృతరాష్ట్రకౌగిలిని దృఢంగా విదిలించి
ఆత్మ స్థైర్యంతో ముందడుగు వేస్తున్నాను..

వసంత ఋతువు వచ్చింది కానీ
నా చుట్టున్న పూలవనంలో శిశిరంలా
నేడు రోజొక పువ్వు రాలిపోతూనే ఉంది
ఊపిరితీగ వాడిపోతుంటే
రోజొక మొక్క పచ్చదనాన్ని
కోల్పోతూనే ఉంది
జీవనిర్జీవ సంగ్రామంలో జీవ
మనుగడ మెల్లిగా జారిపోతూనే ఉంది
ప్రాణం వానచినుకులా మారి
ఇంటి చూరు నుండి రాత్రంతా
కారుతూనే ఉంది..

–సర్ఫరాజ్ అన్వర్
9440981198

## వర్ణాలు ఎన్నో??

వర్ణం ఇపుడో
జవాబు దొరకని ప్రశ్న.
అగ్రరాజ్యాల జాత్యహంకారానికి
ఆది నుండి బలి అవుతూనే ఉంది.
కళ్ళకు కప్పిన పొరల ముందు
నలుపు వర్ణమక్కడ
ఎంత వికారమై పోయిందో.
నల్లిలాగా నలుపుతున్న
కాలి బూటులే చెబుతున్నాయి.
వర్ణం వివర్ణమై పోతూ
వేదనతో ఆగిపోతున్న ఊపిరిగా
మిగిలిందక్కడ.
ఎంత తప్పు....ఎంత తప్పు...
మరి కాస్త ఇటుకూడా చూద్దామా.
వర్ణం వేద కాలం నుండ
విశృంఖలంగాతమ అభిజాత్యాన్ని
కొనసాగిస్తూనే ఉంది...
మన కర్మ భూమిలో.
అగ్ర వర్ణం శూద్ర వర్ణాన్ని
శూద్ర వర్ణం అధమ వర్ణాలని
అణగద్రొక్కుతూనే ఉన్నాయి.
ఇప్పటికీ పరువుహత్యల పేరుతో
పేగుబంధాలకు వేస్తున్న ఉరి
సభ్యసమాజాన్ని తలదించుకునేలా
చేస్తూనే ఉన్నాయి.
వర్ణమంటే రంగు కాదిక్కడ కులము
కులాల మధ్య మతాల మధ్య
కనిపిస్తున్న స్నేహభావం వెనుక
కంటికి కనిపించని కుమ్ములాటలెన్నో
అవి జ్వాలలై ఎగసినప్పుడు మాత్రం
లోకం ఉలిక్కిపడి చూస్తుంటుంది.
వర్ణమెపుడూ ప్రత్యేకమే...
అగ్రరాజ్యాలలో రంగుగా
భరతదేశంలో కులము మతముగా...
ఎందుకంటే
అవి రెండు నానార్థాలు గనుక...!!

–శాంతి కృష్ణ
9502236670



## నిరంతర యోధుడు

కోడికూయక ముందే లేచి
పుడమి సేవకై సైనికుడిలా బయలుదేరి
భూగర్భంలోని గంగను భువి పైకి తెచ్చి,
నేలను తడిపి,
సేద్యానికి సిద్ధం చేసి
విత్తనాలను విత్తి,మొలకెత్తిన మొలకలను
కంటికి రెప్పలా చూసుకుంటూ
పంటలోని కలుపు మొక్కలను
ఎప్పటికప్పుడు ఏరివేస్తూ....
ఎండకు ఎండుతూ, వానకు నానుతూ,
చలికి వణుకుతూ...
పగలురేయి అనే తేడా లేకుండా అలుపన్నది లేని,
యుద్ధ సైనికుడిలా
పంటకు రక్షణగా నిలుస్తూ,
అహర్నిశలు శ్రమిస్తూ....
మట్టి వాసనే సువాసనగా, చెమట వాసనే
సెంటు వాసనగా శ్వాసిస్తూ...
నిరంతరం వెలుగునిస్తున్న సూర్యుడిలా,
అలుపు అన్నది లేకుండా
అనునిత్యం చెమట చుక్కలను ధార పోస్తున్న
నిరంతర యోధుడు,
నిత్య శ్రామికుడు మన రైతన్న.
"హాలికా" నీ సేవకు వందనం..
ఇదే మేము నీకిచ్చే హృదయ వందనం.



–చాపల మహేందర్
9949864152

నేటినిజం
చందా వివరాలు
ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని 5 సం॥రాలకు రూ.700/–, 10 సం॥రాలకు రూ 1200/– మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు. లేదా SBI 3056 7652 629, IFSC: SBIN 0011660
Gandhi Nagar Branch Hyderabad-80
అకౌంట్‌లో వేయవచ్చును.
'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్‌టి–74,
జవహర్‌నగర్,
హైదరాబాద్–500 020.

## నిన్ను చూసి

పగలనక రేయనక
గనిలో
పని చేసి పని చేసి
కళ లేని నా కళ్లను
ఏం కబుర్లు ఆడమంటావు
నిన్ను చూసి

ఆకలితో అలమటించి
పీక్క పోయిన నా మోహాన్ని
ఏం నవ్వమంటావు
నిన్ను చూసి

మాసిన బట్టలతో
చెదిరిన తలజుట్టుతో
దీనంగా కనిపిస్తున్న నన్ను
ఏం నిలబడమంటావు
నీ ముందు కొచ్చి

మనసులో మూగ బాధల్ని మూసేసి
కృత్రిమంగా తెచ్చి పెట్టుకొన్న నవ్వుతో
ఎంతని నటించమంటావు
నీ ఆనందం కోసమని

–వలిపె సురేంద్ర రావు

